Telugu Association Inc.
Sydney Australia
తెలుగు అసోసియేషన్

సంపుటి 62 సంచిక 142 సెప్టెంబర్ 21



ముదాకరాత్తమోదకం సదావిముక్తి సాధకం

విషయ సూచిక


**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి..........................................................................................1**

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల..... ............................................................................................2**


## శీర్షికలు


శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి ..............................................................................................4

**వామన జయంతి.....................................................................................................,,.....................9**

వినాయకుని దండకం-విజయ చావలి......................................................................................,...................11

వాట్సాప్ వదంతులు - షామీరు జానకీదేవి ........................ ..........................................................................12

సర్వాంగ సుందరం – విజయ గొల్లపూడి.........................................................................................15

అఖిలార్థ ప్రదాత గణపతి - రంగారావు పెయ్యేటి ................................................................................17

వడ్లగింజలో బియ్యపు గింజ- శ్రీదేవి పెయ్యేటి..,,,,,,.......................................................................................19

వినాయక పూజ పత్రి ఆరోగ్య ప్రయోజనాలు ...........................................................................................28

పౌరుషిణి - కమల పరచ..................................................................................................35

చిత్రకళ- ప్రసూన రవీంద్రన్ ...........................................................................................................38

సంగీత నాదామృతం  - డా.పద్మ మల్లెల .................... .........................................................................39

బాలవాహిని..........................................................,..........................................................................42

ఇండియా వీసా- చిట్టెన్ రాజు వంగూరి.................. ..................................................................................47

పాట నేర్చుకుందామా/పాడుకుందామా......................................................................................................64

శిధిల నగరం – 4 - జి.వి.సోమనాధ శాస్త్రి.............................................................................................65

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయ్!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | కో-ఆర్డినేటర్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | ప్రసాద్ రాంబొట్ల |

# సంపాదకీయం

భాద్రపద మాసంలో బాపుగారి కుంచెనుంచి వెలువడిన వినాయకుని ముఖచిత్రంతో తెలుగు వాహిని పత్రిక మీకందిస్తున్నాము. వినాయకచవితి భారతీయులందరికీ ముఖ్యమైన పండుగ. ఈ నెల 10వ తేదీన భక్తి శ్రద్ధలతో చేసుకోగలరని భావిస్తున్నాము. ఈ సారి వినాయకచవితి ప్రత్యేక సంచికగా వాహిని లో శీర్షికలు, కవితలు పొందుపరచాము.

వాహిని మూడవ సాహితీ సదస్సు ఈ నెల18వ తేదీన అంతర్జాలంలో నిర్వహిస్తున్నాము. తెలుగు భాష, సాహిత్యంతో సాన్నిహిత్యం పెంచుకోవడానికి ఇది చక్కని వేదిక కాగలదని భావిస్తున్నాము. క్రమం తప్పకుండా శ్రీమతి పెయ్యేటి శ్రీదేవిగారి కథలు ఎన్నో వాహిని లో మీకు అందిస్తూ వచ్చాము. వారి కలం ఆగిపోయినా స్వల్ప వ్యవధిలోనే 'పిల్లలరాజ్యం' రెండవ కథల సంపుటి ప్రచురితమైనది అని తెలియచేయడానికి సంతోషిస్తున్నాము. ఈ అంతర్జాల సాహితీ సదస్సులో పూజ్యగురువులు శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఇంకా విశిష్ట అతిథులు కూడా హాజరు కానున్నారు. తేనెలూరె తెలుగులో తీయందనాల పద్యాలు, సాహితీ ప్రసంగాలు ఈ సభలో అందించనున్నాము.

మన సిడ్నీ తెలుగు అసోసియేషన్ 11వ తేదీన కోవిడ్ కష్ట సమయంలో అందరి యోగ క్షేమాలనుతెలుసుకోవడానికిగాను జూమ్ లో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లోపల పేజీలలో విషయ సమాచారాన్ని చూడండి.

మన భారతీయులకున్న ఆధ్యాత్మిక విజ్ఞానం, సాహిత్యం, సంగీతం, కళలు అపారం. ఈ సంపద అందరితో పంచుకున్నకొలదీ పెరుగుతుందే తప్ప తరగదు. సమయాన్ని వెచ్చించాలే కాని, ఏదో ఒక వ్యాపకంలో నిమగ్నమవడానికి మార్గాలెన్నో. శోధిస్తున్నకొద్దీ నేర్చుకోవలసిన పలు అంశాలు, ఊటబావిలోని జలంలా జ్ఞాన సంపద కావలసినంత అందుతూనే ఉంటుంది. జటిలమైన సమస్యలకు పరిష్కారం, జవాబు దొరకని చిక్కు ప్రశ్నలకు సమాధానాలు కూడా ఈవిధంగా తెలుసుకోగలుగుతాము. జీవనగమ్యంలో మనస్సు తేలికపడితే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది. ఒక్కోసారి మనిషి మాటలు, చేతలు అర్థం కాకుండా జీవితాలు నిరర్థకంగా మిగిలిపోయే ప్రమాదముంది. ఒక మంచి పుస్తకం, కథ, గురువుల ప్రవచనాలు అజ్ఞానాన్ని పారద్రోలే సాధనాలు.

పాఠకులకు, ప్రకటనదారులకు, వాహిని మాసపత్రిక వెలువరించుటలో సహకరిస్తున్న రచయితలకు, ప్రోత్సాహకులకు అందరికీ వినాయకచవితి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ .....

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరుసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## ఆఫీసర్స్


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

A very warm Greetings from EC!

The pandemic is challenging us in ways we never could have imagined. But through these turbulent times we have also seen the best of people – communities coming together in a spirit of solidarity and kindness.
Join us Online to support R U OK? Event on Saturday 11 Sep 2021 7PM -9PM. We want to check-in with you all, connect and chit-chat.
If you have story to share, please send through a few lines on how you adapted to the pandemic crisis and created an unexpected opportunity to make positive changes to your life. Please send through photos/videos of new hobby that you ventured into like painting, a poem that you wrote or a song lyric that you composed. Let us know prior to the event, so that we can share your story during the event. Please email your stories to secretary@sydneytelugu.org

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- Telugu Badi have switched to online classes.
- Telugu Vani weekly operations are running as normal with pre recorded Vani programs run by scheduled Broadcasters.
- The Youth Networking Session has been rescheduled to 2 October 2021 as an Online Event. Planning is underway to make this event a fun catch up session. Thanks to all the 50 young adults that have already registered to the event. EC is thankful to Sailaja Kambhammettu, Diwija Paramathmuni, Pallavi Rachakonda and Srinivas Byreddy for helping us plan this event.
- Vahini Convenor Mrs. Vijaya Gollapudi is organising Telugu Vahini Sahithi Sadhasu on 18 Sep 2021, 2pm-6pm as an online zoom event. Please contact the convenor for program details.

Right now, we are all grappling with the impact of COVID-19 public health orders on our communities. This delay also has a flow-on effect on the 2021 STA annual general meeting (AGM). Because of the current COVID restrictions, STA AGM will be called later in the year. As per the Associations Act and our Constitution, the AGM can be called for within 6 months of the close of our financial year, i.e. before 30 December or timeframe allowed by NSW Fair Trading.

We all need to do our part and get vaccinated as soon as we are able. Now we have a roadmap where everyone will have the opportunity to protect themselves and, in turn, our community. It gives us all a light at the end of the tunnel, and the ability for STA to plan for a more 'normal' future.

Best Regards,
Aparna Susarla,
Secretary Sydney Telugu Association.

**Telugu Vahini**

**తెలుగు వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in *Telugu*, The second largest language spoken in India
Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

55,

శ్రీ భగవాన్ ఉవాచ

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్ధ మనోగతాన్ |

ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే || 55 ||

పార్ధ = ఓ పార్థా!

యదా = ఎప్పుడైతే

మనోగతాన్ = మనస్సునందున్న

సర్వాన్ = సమస్తములైన

కామాన్ = కోరికలను

ప్రజహాతి = (మనుజుడు) పూర్తిగా త్యజించునో, (మఱియు)

ఆత్మనా = ఆత్మద్వారా

ఆత్మని ఏవ = ఆత్మయందే

తుష్టః = సంతుష్టుడగునో

తదా = అప్పుడే

స్థితప్రజ్ఞః = (అతడు) స్థితప్రజ్ఞుడు

ఉచ్యతే = అనబడును.

శ్రీ భగవానుడు పలికెను - "ఓ అర్జునా! మనస్సునందలి కోరికలన్నియు పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడైన వానిని, అనగా పరమాత్మసంయోగము వలన ఆత్మానందమును పొందినవానిని స్థితప్రజ్ఞుడని యందురు.

తమకింకను శాంతి కలుగలేదే, దుఃఖము శమించలేదే యని చింతించిన ఉపయోగము లేదు. సాధకుడు తాను చేయవలసిన సాధన సక్రమముగ జేయవలెను. ముందుగా తన మనస్సులోని కోర్కెలన్నింటిని వదలివేయవలెను. (జహాతి - విడచుచున్నాడు) అని చెప్పక, 'ప్రజహాతి' అని చెప్పుట వలన నిశ్శేషముగ వదలవలెనని చెప్పబడుచున్నది. 'సర్వాన్' అని ప్రయోగించుట వలన ఏ ఒక్కటియు మిగులకుండ అన్ని కోరికలను విడనాడవలెనని బోధింపబడుచున్నది.

వాసన, అగ్ని, ఋణము, రోగము, శత్రువు, రాగము, వైరము, విషము మున్నగు వస్తువులు ఒకింత శేషించియున్నను మహోపద్రవము కలుగును. (శత్రుశేషము, ఋణశేషము వుండకూడదని సామెత వున్నది కదా!). అందువలన వానిని నిశ్శేషముగ తొలగించి వేయవలెను.

కోరికలు మనస్సు యొక్క మారుమూలలందు దాగుకొని యుండును. వాసనారూపమున అవి లోన జితించియుండును. కనుకనే 'మనోగతాన్' అని చెప్పబడినది. దోషము గాని, బంధము గాని బయట లేదు. మనస్సునందే వున్నది. ఈ విషయవాంఛలే జీవునకు జననమరణములను కలుగజేయుచున్నవి.

'ఆత్మనేవాఽ త్మనాతుష్టః' - తన ఆత్మయందే తాను సంతుష్టుడై వుండుట. - ఆనందము బయట లేదు. దృశ్యములో లేదు. శబ్దస్పర్శాది విషయములలో లేదు. భూనభోంతరాళములను గాలించినను ఆనందము బయట దొరకదు. మనస్సునందు గల ఇఛ్ఛాది మాలిన్యమెపుడు రహితమగునో, అపుడు ఆత్మానందము ప్రాప్తించును. మనస్సునందే గల యానందము విషయవాసనలను కాలుష్యముచే కప్పబడియున్నది. ఆ కాలుష్యమును తొలగించిన నాడు ఆనందము ద్యోతకమగును.

ఎప్పుడు సమస్త కామనలను విడనాడి ఎల్లపుడు ఆత్మయందే సంతుష్టి జీవుడు పొందగలడో, అప్పుడే స్థితప్రజ్ఞుడు కాగలడు. అర్జునుడు స్థితప్రజ్ఞుని లక్షణమేది, అతడెట్లు మాట్లాడును? స్థితప్రజ్ఞుడెటుల కూర్చుండును? స్థితప్రజ్ఞుడెటుల నడుచును అని ప్రశ్నించినాడు. ఆ ప్రశ్నలకు క్రమముగ సమాధానమును శ్రీకృష్ణపరమాత్మ 'ప్రజహాతి' అను శ్లోకము మొదలు అధ్యాయ పరిసమాప్తి వరకు చెప్పబోవుచున్నాడు.

సర్వవృత్తిశూన్యుడెన్నడగునో అపుడు సమాధిస్థుడు, స్థితప్రజ్ఞుడు కాగలడు. కామనాదులనాత్మధర్మములగుటచే బరిత్యజించుటకు యోగ్యమైనవని 'మనోగతాన్' అను పదముచే చెప్పుచుండెను. ఈ విషయమునే 'యదా సర్వే ప్రముచ్యన్తే కామాయేఽ స్య హృది శ్రితాః | అథ మర్త్యోఽ మృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే || అని శ్రుతియు జెప్పుచున్నది. ఈ మర్త్యుని హృదయము నందుండు సర్వకామములెపుడు విడువబడునో అట్టి సమయమున మర్త్యుడు ముక్తుడగును. జీవించి యుండగనే బ్రహ్మభావము ననుభవించును.

'కామ! జానామి తే మూలం సంకల్పాత్కిల జాయసే' అను స్మృత్యనుసారము కామము సంకల్పము వలన జనించును. సంకల్పము వాసన వలన జనించును. వాసన లేనిదే వస్తువునందు సమీచీనత్వబుద్ధి కలుగదు. వస్తువు మంచిదను బుద్ధి లేనిదే కామముదయించదు. కాన కామోత్పత్తికి కారణము స్రక్చందనవనితాదులందు భోగ్యత్వవాసనయే. వాసన యనగా భోగమువలన జనించెడి పూర్వసంస్కారము. విషయములయందు భోగ్యత్వవాసనాబలము చేతనే జీవులకు విషయములయందు కామము, ప్రవృత్తియు కలుగును. నిత్యము, నిరంతరము సమాధినిష్ఠయందే యుండునట్టియు, ఎల్లపుడంతటను బ్రహ్మమునే జూచునట్టి విద్వాంసునకు స్రక్చందనవనితాది విషయగ్రహణమే సంభవించదు.

దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః |
వీతరాగభయక్రోధః స్థితధీర్ముని రుచ్యతే ||

దుఃఖేషు = దుఃఖములు సంప్రాప్తించినపుడు

అనుద్విగ్న మనాః = మనస్సునందు ఉద్వేగమునకు లోను కానివాడును

సుఖేషు = సుఖములు కలిగినపుడు

విగతస్పృహః = ఆసక్తిరహితుడును (పొంగిపోనివాడును)

వీతరాగభయక్రోధః = రాగ భయ క్రోధములను విడిచిపెట్టిన వాడును అగు

మునిః = మననశీలుడు

స్థితధీః = స్థితప్రజ్ఞుడు

ఉచ్యతే = అనబడును.

దుఃఖములకు క్రుంగిపోనివాడును, సుఖములకు పొంగిపోనివాడును రాగభయక్రోధములను వీడినవాడును అగు ముని స్థితప్రజ్ఞుడనబడును.

జ్వరము, శిరోరోగాదికము మొదలగు వానిచే ప్రాప్తమగు దుఃఖములు ఆధ్యాత్మికములు. వ్యాఘ్రసర్పాదుల వలన ప్రాప్తించెడి దుఃఖములు ఆధిభౌతికములు. అతివాయువు, అతివర్షము, అశనిపాతము మొదలగు వాటివలన కలుగు దుఃఖములు ఆధిదైవికములు. ధాతుసామ్యాదుల వలన గలిగెడి సుఖమాధ్యాత్మికము. మందవాయువు, నియతవర్షాదుల వలన గలిగెడు సుఖము ఆధిదైవికము. స్రక్చందనవనితాదులు, గోమహిష్యాదుల వలన గలిగెడి సుఖము ఆధిభౌతికము. అట్టి సుఖదుఃఖముల వలన వికారము నొందనివాడు స్థితప్రజ్ఞుడు. 'కిం ప్రభాషేత' (స్థితప్రజ్ఞుడు సమాధివ్యుత్థితుడై యెటుల మాట్లాడును?) అను ప్రశ్న మునకు 'దుఃఖేష్వనుద్విగ్న మనాః' అను శ్లోకము మొదలు రెండు శ్లోకములచె సమాధానమును చెప్పుచుండెను. రజఃపరిణామ సంతాపాత్మక చిత్తవృత్తి విశేషములు, ప్రారబ్ధకర్మ ప్రాపితములు అగునట్టి దుఃఖముల యందు దుఃఖపరిహారమునకు సమర్థుడు కాకపోవుటచే వ్యాకులమగు నంతఃకరణము కలవాడు 'ఉద్విగ్న మనస్కుడు' అనిపించుకొనును. దుఃఖేషు - సమాధినిష్ఠచే నాధ్యాత్మికాధిభౌతికాధిదైవికము వలన క్షోభించని మనస్సు కలవాడై, అట్లే 'సుఖేషు' సుఖప్రాపకములగు ఇష్టాన్న రసాదులు ప్రాప్తించునపుడు రసనాది ఇంద్రియలోలత్వము లేనివాడై యుండవలెను. 'వీతరాగభయక్రోధః' ఉపకారమునందు ప్రీతియు, అపకారమునందు అప్రీతియు, ఆసన్న మగు మరణహేతువునందు భయము అనెడి యీ మూడును స్వాత్మనిష్ఠచే నెవనికి దొలగునో వాడు వీతరాగభయక్రోధుడనిపించుకొనును. ప్రీత్యప్రీతి భయహేతువులకు, ప్రీత్యాద్యులకు, తత్కార్యములకును, అవిషయుడైనట్టియు, శ్రుతమును, దృష్టమును, స్పృష్టమును, సర్వమును ప్రత్యగ్దృష్టిచే బ్రహ్మముగనే తెలిసికొనెడివాడు ముని యనబడును. ఆకారమును దాల్చుటచే ముని కాడు. పై లక్షణములు కల ముని 'స్థితప్రజ్ఞః' సిద్ధుడని చెప్పబడును.

57,

యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ |

నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ||

యః = ఎవడు

సర్వత్ర = సమస్త విషయములందు (దేహజీవితాదుల యందు)

అనభిస్నేహః = అభిస్నేహము (స్పృహ) లేనివాడై

తత్తత్ = ఆ యా

శుభాశుభమ్ = శుభ అశుభములను

ప్రాప్య = పొంది

నాభినందతి = సంతసింపడో

నద్వేష్టి = ద్వేషింపడో

తస్య = అట్టి మునికి

ప్రజ్ఞా = (వివేకము వలన కలిగెడి) ప్రజ్ఞ

ప్రతిష్ఠితా = ప్రతిష్ఠితమగును.

వివేకవంతుడగు వివిదిషువునకు వివేకము వలన జనించెడి ప్రజ్ఞ యెటుల ప్రతిష్ఠితమగుననిన ఏ ముని దేహజీవితాదుల యందు కోరిక లేనివాడై ఆయా శుభము ప్రాప్తించినపుడు సంతసింపక, ఆయా అశుభము ప్రాప్తించినపుడు ద్వేషింపకుండునో హర్షవిషాదరహితుడగు నట్టివానికి ప్రజ్ఞ సుప్రతిష్ఠితమగును.

అనగా దేహజీవితాదుల యందు స్పృహ లేకుండుట, శుభాశుభములు బ్రాప్తించినపుడు హర్షవిషాదరహితుడగుట - ఇవియే స్థితప్రజ్ఞుని లక్షణములు. ఇవియే సాధకునకు అనుసరింపదగినవి.

'కిం ప్రభాషేత" అను ప్రశ్నకు ఇచ్చట సమాధానము ఈయబడినది.

ధనదారదేహజీవనాదులయందు అభిస్నేహము కలవాడు ధనదారాదులు వికలమైనచో, తాను వికలుడననియు, పూర్ణమైనచో తాను పూర్ణుడననియు, దైన్యదర్పములతో గూడి పూర్వాపర పర్యాలోచన లేనివాడై ఏమేమియో పలుకును. అట్లుకాక, ధనదారదేహజీవనాదులయందు అనభిస్నేహుడై, శుభమును పొంది సంతుష్టుడై, శుభమును పొందించువానిని ప్రశంసింపడో, అట్లే యశుభమును పొంది దుఃఖియై యశుభమును కలుగజేయు వానిని నిందింపడో వానికి ప్రజ్ఞ సిద్ధించుచున్నది.

సర్వదేహములయందు, జీవనాదులయందు ఏ ముని 'అనభిస్నేహః' స్నేహము లేనివాడో (ఏది యుండ నన్యదీయమగు హానివృద్ధులు తనయందారోపించ బడునో, అన్యవిషయకము, ప్రేమకపరపర్యాయము నగునట్టి తామసవృత్తివిశేషము స్నేహమనబడును. సర్వవిధములచే నట్టి స్నేహము లేనివాడని యర్థము. అనాత్మయందు స్నేహము లేకుండుట, పరమాత్మయందు స్నేహము కలవాడగుటకే. కాన భగవంతుడగు పరమాత్మయందు అన్ని విధములను అభిస్నేహము కలవాడై యుండవలెను.) తత్తత్ప్రారబ్ధకర్మప్రాప్తము, సుఖహేతువునగు శుభవిషయమును పొంది 'నాభినన్దతి' హర్షవిషాదపురస్సరముగ బ్రశంసింపడో, దుఃఖహేతువగు నశుభవిషయమును పొంది 'నద్వేష్టి' లోపల నసూయాపూర్వకముగ నిందింపడో (అజ్ఞునకు సుఖహేతువగు స్వకళత్రాదికము శుభవిషయమనబడును. అట్టి స్వకళత్రాది గుణకథనము పరప్రరోచనార్థము కానందున వ్యర్థము. కాన తద్గుణకథనాదిప్రవర్తకమగు ధీవృత్తిభ్రాంతిరూపాభినందనమనబడును.

అట్లే యసూయోత్పాదనద్వారమున దుఃఖహేతువగు పరకీయవిద్యాప్రకర్షాదికము వీనిని గూర్చి యశుభవిషయము. దాని నిందనివారింపని దగుటచే వ్యర్థము. కాన నట్టి విషయమును నిందించుటకు ప్రవర్తింపజేయునట్టి భ్రాంతిరూపములు అగునట్టి యాయభినందనద్వేషములు ప్రజ్ఞవలన విదారకమగు కారణము లేమిం జేసి యభ్రాంతుడు, శుద్ధసత్త్వుడు నగు స్థితప్రజ్ఞునియందు సంభవింపవు.) ఈ శ్లోకము కూడ 'కిం ప్రభాషేత' అను ప్రశ్నమునకు సమాధానముగ జెప్పబడెను.

58,

యదా సంహరతే చాయం కూర్మోఽ ంగానీవ సర్వశః |

ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ||

చ = మఱియు

కూర్మః = తాబేలు

సర్వశః = అన్ని వైపులనుండి

అంగాని = (తన) అంగములను

సంహరతే, ఇవ = ముడుచుకొనునట్లు

యదా = ఎప్పుడైతే

అయమ్ = ఇతడు (ఈ పురుషుడు)

ఇంద్రియార్థేభ్యః = ఇంద్రియార్థముల నుండి

ఇంద్రియాణి = ఇంద్రియములను

(సంహరతే) = అన్ని విధముల ఉపసంహరించుకొనునో

తస్య = (అప్పుడు) అతనియొక్క

ప్రజ్ఞా = బుద్ధి

ప్రతిష్ఠితా = స్థిరమైనది (అని భావింపవలెను).

'యదా సంహరత ఇతి | యదా సంహరతే సమ్య గుపసంహరతే చాయం జ్ఞాననిష్ఠాయాం ప్రవృత్తో యతిః కూర్మోంగానీవ సర్వశో యథా కూర్మో భయాత్స్వాన్యంగాన్యుపసంహరతే సర్వత ఏవం జ్ఞాననిష్ఠ ఇన్ద్రియాణిన్ద్రియార్థేభ్య స్సర్వవిషయేభ్య ఉపసంహరతే | తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితే త్యుక్తార్థ వాక్యమ్ ||

ఏ తీరున తాబేలు భయము వలన తన యవయవములను అంతటనుండి ముడుచుకొనునో, అదేవిధమున ఎపుడూ జ్ఞాననిష్ఠయందు బ్రవృత్తుడైన యతియు ఇంద్రియములను విషయములనుండి ప్రజ్ఞాస్థైర్యమునకు హేతువగుటం బట్టి తన ఇంద్రియములను శబ్దస్పర్శరూపరసగంధము లనెడి విషయములనుండి లెస్సగ నుపసంహరించుకొనునో (స్వవశమొనరించుకొనునో), అత్తరి యతనికి ప్రజ్ఞ ప్రతిష్ఠితమగును. అనగా ప్రజ్ఞాస్థైర్యములను గోఱెడివాడు ఇంద్రియములను తప్పక స్వాధీనము చేసుకొనవలెను.

'యదా సంహరతే' అను శ్లోకము మొదలు 'క్రోధాద్భవతి సంమోహః' అను శ్లోకము వరకు అగు నారు శ్లోకములచే 'కి మాసీత' అను యర్జునుని తృతీయప్రశ్నమునకు సమాధానము చెప్పుటకు శ్రీకృష్ణపరమాత్మ ప్రారంభించుచుండెను.

తీవ్రవైరాగ్యము, తీవ్రమోక్షేచ్ఛ, తత్పరత్వము అను నీ మూడును జ్ఞాననిష్ఠాసిద్ధికి కారణములు. ఐనను, ఇంద్రియనిగ్రహము లేనిదే వైరాగ్యాది జ్ఞాననిష్ఠ సిద్ధింపదు. కాన సాధకుడగు యతి ప్రయత్నము వలన ప్రజ్ఞాసిద్ధిచే నింద్రియజయమును సంపాదింపవలయునని 'యదా సంహరతే' అను శ్లోకముచే చెప్పుచుండెను.

జ్ఞాననిష్ఠ్య యందు ప్రవృత్తుడగు యతి - పరులవలన భయపడి కూర్మమేవిధమున తన సర్వావయవములను తత్తత్కాలముల యందు తనయందే యుపసంహరించుకొనునో, అట్లే తత్తద్విషయములనుండి రాగాది దోషప్రసక్తి భయము వలనను, సమాధివిఘ్నభయము వలనను, వాగాదికర్మేంద్రియములను, చక్షురాదిజ్ఞానేంద్రియములను ఎపుడు స్వయముగ తనయందు సమాధిస్థైర్యము కొఱకు తత్తత్ప్రవృత్తిని నివారించుకొనునో అపుడా మునికి ప్రజ్ఞ ప్రతిష్ఠితమగును.
మోక్షప్రాప్తికి ఇంద్రియనిగ్రహము అత్యంతావశ్యకము. ఈ సత్యమునే పతంజలి మహర్షి 'యోగశ్చిత్తవృత్తినిరోధః; తదా ద్రష్టుః స్వరూపేఽ వస్థానమ్' అను రెండు సూత్రముల ద్వారా వ్యక్తమొనర్చెను. అనగా ఎపుడు చిత్తము తన బహిర్ముఖ విషయప్రవృత్తులను త్యజించి, అందర్ముఖమగునో, అపుడది ఆత్మయందు చక్కగ స్థితిని బొందగలదని భావము.
'సర్వశః' అని చెప్పినందువలన ఏ ఒకానొక ఇంద్రియమునో నిగ్రహించుట చాలదనియు, అన్నిటిని నిరోధించ వలెననియు స్పష్టీకరించబడినది.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖

## వామన జయంతి – సెప్టెంబర్ 18 వ తేదీ



శ్రీ మహావిష్ణువు దుష్ట శిక్షణకై, శిష్ట రక్షణకై అనేక అవతారములు ఎత్తాడు. ఈ దశావతారాలలో ఐదవది వామనావతారము. ఈ అవతారమును విష్ణువు బలి చక్రవర్తిని అంతమొందించేదుకు ఎత్తాడు. బలిచక్రవర్తి ప్రహ్లాదుని మనువడు. వైరోచనుని కుమారుడు. బలిచక్రవర్తి విశ్వజిత్ యాగము చేయుట ద్వారా, బ్రాహ్మణులకు దానాలు చేయడం ద్వారా అమిత శక్తివంతుడే ఇంద్రునిపై దండెత్తి, ఇంద్రలోకాన్ని ఆక్రమిస్తాడు. దేవతల తల్లి అయిన అదితి, తన భర్తయైన కశ్యప ప్రజాపతి దగ్గరకు వెళ్లి తన పుత్రుల దీనస్థితిని వివరించింది.

బలిచక్రవర్తియే భోగభాగ్యములన్నీ అనుభవించుచూ దేవతలకు భాగమునిచ్చుట లేదని మొరపెట్టుకొన్నది. అంతట కశ్యపుడు నారాయణునిడిని పూజించమని 'పయోభక్షణము' అనే వ్రతమును ఉపదేశిస్తాడు. ఆ వ్రత ఫలితంగా భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు మధ్యాహ్నమున వామన రూపంలో విష్ణువు అదితి గర్భం నుండు జన్మిస్తాడు.

అడిగిన వారికి లేదనకుండా దానమిచ్చే స్వభావమున్న బలిచక్రవర్తి బలహీనత బ్రాహ్మణులకు దానం చేయడమని గ్రహించిన విష్ణువు వామన రూపంలో బలిచక్రవర్తి యజ్ఞశాలకు వెళ్తాడు. బలిచక్రవర్తి ఆ వామనునికి సాదర స్వాగతం పల్కి, అర్ఘ్యపాద్యాదులను సమర్పించి, ఏమి కావాలో కోరుకోమంటాడు. వామనుడు తనకు యాగం చేసుకోనేందుకు మూడు అడుగుల నేల కావాలని కోరతాడు. అందుకు బలిచక్రవర్తి సంతోషంగా అంగీకరిస్తాడు. దానం కోరి వచ్చినవాడు వామన రూపంలో ఉన్న రాక్షస విరోధి అయిన శ్రీమహావిష్ణువు అని అక్కడున్న రాక్షసుల గురువు శుక్రాచార్యుడు గ్రహిస్తాడు.

శుక్రాచార్యుడు బలిని పిలిచి వచ్చినవాడు విష్ణువు అని, అతనికి ఏ దానం చేయవద్దని, వెంటనే ఇక్కడ నుండి పంపివేయమని సూచిస్తాడు. అందుకు బలిచక్రవర్తి దానమిస్తానని పలికి, ధన ప్రాణాలపై వ్యామోహంతో ఆ దానం చేయనని పల్కలేనని అంటాడు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనను ఇచ్చినమాట మీద నిలబడి ఉంటానని, మాటను వెనుకకు తీసుకోలేనని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. అందుకు ఆగ్రహించిన శుక్రాచార్యుడు శీఘ్రకాలంలోనే రాజ్యభ్రష్టుడవు అవుతావని బలిని శపించి వెళ్ళిపోతాడు. అంతట బలి చక్రవర్తి వామనుని పాదాలు కడిగి, ఆ నీరును తల మీద చల్లుకుంటాడు. వామనుడు కోరిక మేరకు మూడు అడుగులు దానమిస్తున్నానని ప్రకటిస్తూ కలశంతో తన చేతి మీదగా వామనుని చేతిలోకి నీళ్ళు పోస్తుంటాడు. ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని శుక్రాచార్యుడు కలశ రంధ్రానికి అడ్డుపడతాడు.

ఇది గ్రహించిన వామనుడు అక్కడున్న దర్భ పుల్లతో రంధ్రాన్ని పొడవగా శుక్రాచార్యుడు తన రెండు కళ్ళల్లో ఒక కన్నును కోల్పోతాడు. దానం స్వీకరించిన వామనుడు కొద్దికొద్దిగా పెరుగుతూ యావత్ బ్రహ్మాండమంత ఆక్రమించి ఒక పాదము భూమి మీద వేసి, రెండవ పాదము ఆకాశమ్మీద వేసి, మూడో పాదం ఎక్కడ వెయ్యాలని బలిని అడుగుతాడు.

అప్పుడు బలి 'నా నెత్తి మీద వెయ్యి' అంటాడు. వామనుడు తన మూడో పాదాన్ని బలి నెత్తి మీద వేసి అధః:పాతాళానికి తొక్కేస్తాడు. అయితే బలి దాన గుణానికి సంతోషం చెందిన మహావిష్ణువు ఏటా అతను కొన్ని రోజులు భూమిపైకి వచ్చి తన రాజ్యాన్ని చూసుకునేట్టు వరమిస్తాడు. ఇప్పటికీ కేరళలో ఓనం పండగను బలి రాక కోసం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. వామన జయంతి నాడు వైష్ణవ ఆలయాలకు వెళ్ళి విష్ణువుని పూజిస్తే శుభప్రదం.

❖❖❖❖❖



# వినాయకుని దండకము

శ్రీమతి చావలి విజయ, సిడ్నీ



శ్రీకార దేవుండ శ్రీపార్వతీ పుత్ర లోకేశ విఘ్నేశ,విద్యాధి దేవుండ, సర్వోత్తమా, భారతాలేఖకా మమ్ము  కాపాడగారావె!
నీగుజ్జు రూపంబు నీపెద్ద తొండంబు నీ శూర్పకర్ణంబు నీయేకదంతంబు లంబోదరంబున్ సదా మూషికారోహణమ్మున్ మదిన్ దల్చి నీమందహాసంబు వీక్షింప వోమట్టితో బొమ్మచేయంగ నాశక్తి పూజించి నీరక్షనర్థింప నీసేవ చేయంగ నీనామపారాయణన్ జేసియున్నాను!
పున్నాగ, చేమంతి, మందార, గన్నేరు పూలంత కూర్చంగ మారేడు
దూర్వారయుగ్మంబు,గన్నేరు,దానిమ్మ,మామిళ్ల,జాజుల్ల,జామల్ల పత్రాల పొంకించి టెంకాయ పొన్నంటిపండ్లన్ మరిన్ గారెలున్ బూరెలుండ్రాళ్ల నైవేద్యమున్ చేసి యింపార కొల్వంగ నీకై తపించేను భక్తిన్ సదా నాదు కష్టాల తీర్చంగ నీమ్రోల వేచేను.
దేశాన యీనాడు పీడించు వైరస్ కరోనాను చెండాడ శారీర ధారుఢ్యమున్ ధైర్యమున్ కల్గ చేయంగ కాపాడు యీకష్ట వేళందు యిళ్లందు బందీలుగానున్న వేళందు సాహిత్య సంభాషణల్ సల్పి కావ్యాల సొంపుల్ని యాస్వాదనల్ చేయ సౌభాగ్యమున్నీయగన్ రావె కాలుష్యముల్ కాని స్వచ్ఛంపు గాలుల్లు, శబ్దాల హోరుల్లు లేనట్టి శాంతమ్ములన్ కూర్చి విద్యార్థులెవ్వేళ విద్యార్జనా ధ్యేయమున్ పెంచి పేదోడి నేత్రాల యానంద బాష్పాల వర్షించి దేశాన నేతైన వారంత శ్రేయస్సు కాంక్షించి స్వార్థాన్ని వీడంగ శ్రీరామరాజ్యంబు విచ్చేయ మా కోర్కె మన్నించి నీదివ్యరూపాన్ని దర్శించి నీవీక్షణముల్ ప్రసారింప శ్రద్ధాస్తుతుల్ చేయ నాసక్తి తోడన్ యికన్ పూజలున్ ప్రార్థనల్ చేసెదన్.
నావందనాలంది కార్యాల సిద్ధింప బుద్ధిన్ ప్రసాదించ విద్యాధి పూజన్ శుభారంభ వేళన్ సదా సంకటాలన్ని వారింప వేంచేయగా రావె లోకేశ! కాపాడగారావె విఘ్నేశ! సిద్ధేశ! దీపించు విజ్ఞాన జ్యోతుల్, నమస్తే నమస్తే నమః.

❖❖❖❖❖

# వాట్సాప్... వదంతులు....

శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్

అది మహానగరంలో ఒక అపార్ట్మెంట్.. మొత్తం 30 ఫ్లాట్స్ ఉంటాయి.. బిల్డర్ మధ్యలో వదిలేస్తే, అందరూ ఎవరికి వాళ్ళు వాళ్ళ ఫ్లాట్స్ స్వాదీనం చేసుకున్నారు.. చిన్న చిన్న పనులు ఏవీ పూర్తి కాలేదు... బిల్డింగ్ కట్టేటప్పుడున్న వాచ్ మెన్ ని కొనసాగించారు.. మంచి నీటి కనెక్షన్ తీసుకున్నారు.. చుట్టూ బండలు వేయించటం మొక్కలు నాటడం ఇలా ఒక్కో పని, ఏవైతే పెండింగులో వున్నాయో అవన్నీ, లాండ్ ఓనర్ ద్వారా పూర్తి చేయించుకుంటూ వచ్చారు..

ఇలాంటి పరిస్థితుల్లో అపార్ట్మెంట్ బాగోగులు చూసుకోటానికి, ఒక రోజు అందరూ కలిసి సొసైటీ ఫామ్ చేసి దానికి ప్రెసిడెంట్, సెక్రటరీ మరియు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. అప్పుడే రిటైర్ అయిన మురళీకృష్ణను సెక్రటరీ చేసారు.. అప్పటి నుండి అపార్ట్ మెంట్ లో ఏ చిన్న సమస్య వచ్చినా బాధ్యతగా చూసుకుంటూ, నిస్వార్థంగా, అందర్నీ సమన్వయపరుస్తూ ప్రతి పనినీ విజయవంతంగా పూర్తి చేస్తున్నాడు.. అందరూ సంతోషంగా కాలం గడుపుతున్నారు..

కరోనా సమయంలో లాక్ డౌన్ కారణంగా అపార్ట్మెంట్ లో మీటింగులు జరపటం లేదు... వాట్సాప్ లో ఒక గ్రూప్ పెట్టుకుని అందులోనే ఏ సమస్య వచ్చినా తెలియచేయడం.. దానికి పరిష్కారం ఆలోచించడం.. ఇలా సాగుతోంది జీవితం..

పొద్దస్తమానం ఇలా వాట్సాప్ లో ఉండటం వలన పాపం మురళీకృష్ణకు భార్యతో కూడా సమస్య వస్తోంది.. ఉన్న ఇద్దరూ మాట్లాడుకోకుండా ఇలా ఫోనులో ఉంటే ఎలా.. ఇలాగైతే తను వెళ్ళిపోతానని బెదిరించింది..

ఒక రోజు క్రింది ఫ్లాట్ నుండి ఒకతను మన అపార్ట్ మెంట్ లో ఎవరికో కరోనా వచ్చింది అని మురళీ కృష్ణకు ఫోన్ చేసి చెప్పాడు.. ఏం చెయ్యాలో తోచలేదు.. డైరెక్ట్ గా అడగలేడు.. కరోనా వచ్చింది అని చెప్పుకోలేక పోతున్నారు.. సరే ఇలా కాదని వాట్సాప్ లో మెసేజ్ పెట్టాడు..

"మన అపార్ట్మెంట్ లో ఎవరికో కరోనా వచ్చిందని తెలిసింది.. వచ్చిన వారు తమకు తాముగా సెల్ఫ్ క్వారంటైన్ లో ఉండి మిగిలిన వారిని సేవ్ చెయ్యగలరు".. అని మెసేజ్ పెట్టాడు..

ఈ మెసేజ్ చదివి కరోనా వచ్చినవాళ్ళు తలుపులు వేసుకోవడం బయటికి రాకుండా ఉండటం వలన ఎవరికి వచ్చిందో తెలుసుకుని మిగతావారు జాగ్రత్త పడ్డారు..

నిజమే కదా కరోనా వస్తే చెప్పుకోరు.. మనమూ తెలుసుకోలేము.. మన పొరుగువారి గురించి కాస్తయినా ఆలోచించాలి కదా.. మరి దీనికి పరిష్కారం ఏమిటి?. మురళీకృష్ణకు ఒక తలనొప్పిలా తయారయింది.. ఒకరోజు పొద్దున్నే లేవగానే మెసేజ్ చూసి ఒక్కసారి గట్టిగా అరవాలనిపించింది.. ఎవరితో మాట్లాడాలన్నా కరోనా వచ్చిందేమో అనే అనుమానం.. ఈ మధ్య ఒక వీడియో చూసాడు.. ఒకతను తన పుట్టినరోజు సందర్భంగా కేకు తెచ్చి కట్ చేస్తాడు.. ఇరుగూ పొరుగూ దూరంగా నిల్చుని హ్యాపీ బర్త్ డే అని చెపుతారు.. కేకు ఇచ్చినా ఎవరూ తీసుకోరు.. భగవంతుడు మానవజాతిని ఎటు తీసుకెళుతున్నాడు.. పక్కనే ఉన్నతను లిఫ్ట్ లో కూడా చేతికి పేపర్ చుట్టుకుని లిఫ్ట్ బటన్ నొక్కుతున్నాడు.. ఇంత భయంతో ఈ జీవితాలు కొనసాగించటం ఎలా?..

ఇంకొకతను తనకు కరోనా వచ్చిందని, తాను సెల్ఫ్ క్వారంటైన్ లో ఉంటున్నట్లు అందరికీ చెప్పమని మురళీకృష్ణకు పర్సనల్ గా మెసేజ్ పెట్టాడు.. వెంటనే ఆ మెసేజ్ గ్రూప్ లో ఫార్వర్డ్ చేసాడు.. దాని క్రింద ఈ మెసెజి పలానా అతను పంపాడు. అందరూ జాగ్రత్తలు తీసుకోండి అని... కానీ ఫార్వర్డ్ చేసిన మెసేజ్ మాత్రమే చూసి అందరూ మురళీ కృష్ణకు కరోనా అని ప్రచారం చేసారు ..

ఆ రోజు పనమ్మాయి మురళీ కృష్ణ ఇంట్లో పని అవగానే క్రింద ఫ్లోర్ కి వెళ్ళింది.. అక్కడ ఇద్దరు ఆమెను పట్టుకుని "నువ్వు మురళీకృష్ణ గారింట్లో పని చెయ్యకు ఆయనకు కరోనా వచ్చిందట.. గ్రూప్ లో మెసేజ్ పెట్టారు".. అంటూ ఆమెను పనికి వెళ్ళకుండా ఒత్తిడి చేసారు..

"ఏహే! సార్ కు కరోనా రాలేదు.. నేనిప్పుడే అక్కడినుండి వస్తున్నా".. అని గట్టిగా చెప్పింది.. అయినా ఎవరూ వినలేదు..

"ఇక్కడంతా చిన్న పిల్లలు ఉన్నారు.. నువ్వు చెయ్యొద్దు" అందరూ వాళ్ళు అనుకున్నదే నిజం అన్నట్లుగా నొక్కి చెప్పారు..

"నేనిప్పుడే సార్ ని అడిగొస్తా".. అంటూ మురళీకృష్ణ దగ్గరికి వచ్చింది..

"సార్! మీకు కరోనా వచ్చిందని మూడో ఫ్లోర్ లో అందరూ అనుకుంటున్నారు.. మీరు గ్రూప్ లో మెసేజ్ పంపించారట కదా".. అంటూ నేల మీద కూర్చుంది..

ఈసారి అవాక్కవడం మురళీకృష్ణ వంతు అయింది.. ఎప్పుడో 50 సంవత్సరాల క్రితం తీసిన "కలెక్టర్ జానకి" సినిమా మూలాలు ఇంకా ఉన్నాయి కదా అనుకుంటూ.. తనకు కరోనా రాలేదని అది రెండవ ఫ్లోర్ అతనికి వచ్చిందని వివరణ ఇస్తూ గ్రూప్ లో మార్చి మళ్ళీ మెసేజ్ పెట్టాడు...

వాట్సప్ మెసేజ్ సరిగా చదవకుండా, అర్థం చేసుకునే ప్రయత్నం చేయకుండా అపార్థం చేసుకోవటం అలవాటయింది ఈ మధ్య జనానికి.. లేదా ఇంకో నలుగురికి దాన్ని ఫార్వర్డ్ చేయడం.. ఒకటే వీడియో కాని మెసేజ్ కాని పది మంది పంపితే ఫోన్ లో చెత్త చేరదా.. ఫోన్ పాడయ్యే చాన్స్ వుండదా?. ఆధునికత అంటే ఇదేనా?.

❖❖❖❖❖

ACHIY HOMES
Your Happiness is Our Satisfaction BL No. 323075C
HIA 0431081640
www.achiyhomes.com.au Email: info@achiyhomes.com.au
Custom Built Homes
Dual Occupancy/Duplex
House & Granny Flat
Granny Flat
Knock Down & Re-Build

Telugu Association Inc

# సిడ్నీ తెలుగు వాహిని మూడవ సాహితీ సదస్సు

**Saturday 18 Sep 2021**

**2 PM TO 6 PM**

**Online Zoom Event**

## విశిష్ఠ అతిథులు





శ్రీ వంశీరామరాజు

పూజ్యగురువులు శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు



శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారు

శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారిచే
'పిల్లలరాజ్యం' పెయ్యేటి శ్రీదేవి కథలు
పుస్తక ఆవిష్కరణ



Dr. కె.వి. కృష్ణకుమారి అక్కయ్యగారు



శ్రీ భువనచంద్ర

FOR ZOOM DETAILS
CONTACT SMT.VIJAYA GOLLAPUDI
0438 293 687
VAHINI@SYDNEYTELUGU.ORG

# సర్వాంగ సుందరం

శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ, ఆస్ట్రేలియా

సర్వాంగ సుందరము భగవంతుని సృష్టి, ప్రపంచం నలుమూలలా కాంతును నీ ఉనికి
మనమున కలిగె సందేహము ఏలన, ఎటులన బహుముఖ రూపములో నిన్ను ఎవరిగా పూజింతు?
నాకు ఊహ తెలిసిననాటినుంచి నేను కొలిచే దైవాలు నిత్య స్మరణీయాలు
నన్ను మానవజన్మ లో ప్రతి అనుభూతిని పొందమంటూ సృష్టికి శ్రీకారం చుట్టిన బ్రహ్మ
భూమి పై మనగలగడానికి ఊపిరినిచ్చి నన్ను లోకానికి చూపిన జీవనదాయిని అమ్మ
నాకేమి కావాలో సమకూర్చి అనుక్షణం నను వెన్నంటి ముందుకు నడిపించిన నాన్న
నాలో అజ్ఞానపు అంధకారాన్ని పారద్రోలి విద్యను ప్రసాదించి బ్రతుకు త్రోవ చూపిన గురువులు
తూరువు తెలతెలవారుతుంటే వెలుగురేఖలతో మేలుకొలిపే ఆరోగ్యప్రదాత సూర్యభగవానుడు
ప్రతి పని ప్రారంభించే ముందు విఘ్నములు బాపుమని వేడగా కరుణించే ఏకదంత వినాయక
నీ ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అనుజ్ఞ ఇవ్వమని కోరే ఈశా పరమేశా!
ఆదిశక్తిగా అనేక రూపములలో కొలుతు లలితా దేవిగా, దుర్గగా, కాళికగా నవరాత్రులలో నిండైన నీ రూపం
సకల కళలు, విద్యలనొసగె వాణీగీర్వాణి మంచి వాక్కునిమ్మని ప్రార్థింతు నిను సరస్వతీ నమస్తుభ్యం అని
దుష్టశిక్షణ, శిష్టరక్షణగా జనులను రక్షింప ఏతెంచిన నిను వేడితి శ్రీరామ, శ్రీకృష్ణ, మహావిష్ణువుగా
అష్టైశ్వర్యాలతో, సౌభాగ్యాలతో తులతూగే వరమునిమ్మని చేసితి వరలక్ష్మి వ్రతములెల్ల శ్రీ మహాలక్ష్మికి
జీవనపు తోడుగా, నీడగా ఉంటూ కుటుంబం అనే గొడుగులో రక్షణ నిచ్చే పతియే ప్రత్యక్షదైవంగా,
ఆభ్యంగన స్నానమొనర్చి ఇంటి పెరట వెలసిన విష్ణుప్రియమైన తులసీ నీ కోట చుట్టూ ప్రదక్షిణ చేతు
సర్వ దైవముల కటాక్షములను గ్రోలెద సమన్వయమున సమానముగా, ఎక్కువ తక్కువ భేదములేక
సర్వేశా! నీ సృష్టిలోపమేమి లేదు దృష్టిలోపము కలుగు మాయ పొరలు క్రమ్మిన క్షణం వివేచన మరిచి
మమకార పాశములను విడనాడవలెనని ప్రయత్నించి భంగపడెదను సంసారసాగరంలో మునిగితి
సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడినపుడు, మానవరూపమున మిత్రునిగా సహాయమిడెదవు
ఆరోగ్యము క్షీణించిన, వైద్యుని రూపమున ఏతెంచి ఆయుష్షు పెంచి, జీవితం పై ఆశ సడలకుండ చేసెదవు
దశ, దిశ నిర్దేసింపుమని ఎల్లెడల నిను తలచిన మనమున అంధకారబంధురము పటాపంచలౌను
నీవు మానవకోటికి ప్రసాదించిన భగవద్గీత చేతపట్టితి, వివేకము కలిగె, తీరుతెన్నుల మర్మమెరిగితి
అనుక్షణం నీ నామ స్మరణమొనర్చి కర్తవ్యము చేతునె, ఫలితము నీకర్పింతు కైంకర్యమునకై
నీవు ప్రసాదించిన మానవ జన్మ పరమార్థము తెలిసికొంటి,
ప్రతి క్షణం చైతన్యంతో జీవితాన్ని ఆస్వాదించే నిరంతర అన్వేషిణినైతి,
నిను చేరుటకై 'ఓం నమో నారాయణాయ!' అనుచూ సాధన చేతును మోక్ష ప్రాప్తికై!

❖❖❖❖❖

Telugu Association Inc.

# We 're checking in to make sure you're OK

## Join our R U OK? event

## ZOOM EVENT
## SAT 11 SEP 2021
## 7PM -9 PM

Mental Wellbeing

Sharing Ideas

Telugu Trivia

Wear something yellow in support of R U OK? event

# అఖిలార్ధ ప్రదాతా, గణపతి!

శ్రీ పెయ్యేటి రంగారావు,హైద్రాబాద్



ఎలుక నెక్కిన ఏలికా

కుడుముల తినుచు నా

ఇడుముల బాపవయా ||

నిను మది తలువకను

తొలి నిను కొలువకను

ఏ పూజలను చేయనయ్యా

కరుణించి కాపాడవయ్యా ||

నోరారా నిను నుతియింతునయా

పత్రి పూజతో తృప్తి నొందుమయా

పూవులతో నిను పూజింతునయా

కోర్కెల బాపి దరి జేర్చుమయా ||

అమ్మ భవానీ వరపుత్రుడవు

మిత్తిని గెలిచిన మృత్యుంజయుడవు

తాపత్రయముల బాపగ రావా

ఆపన్నుడను (ఆపన్ననయా) ఆదుకోవయ్యా ||

నాకెందులకీ ఇహలోక సుఖములు

వలదయ్యా ఈ పార్థివ బంధములు

కన్నుల నీరిది ఇంకకున్నది

శరణు శరణని ఎద వేడుచున్నది ||

మిత్తి జీవికి తప్పనిదయ్యా

ముక్తి కోరుట నా నైజమయ్యా

అమ్మకు చెప్పి, అయ్యను వేడి

భవబంధమ్ముల బాపగదయ్యా ||

గణపతి! గణపతి!

వరసిద్ధి గణపతి!


గణపతి! గణపతి!

లక్ష్మీగణపతి!

అఖిలార్థ ప్రదాతా, గణపతి!

శరణం, శరణం! త్వమేవ శరణం ||

❖❖❖❖❖



తెలుగు బడి
Telugu Association Inc Sydney
Telugu Language School, Telugu Badi
An initiative of Telugu Association Inc.
Telugu Association Inc.
JOIN
TELUGU BADI
For Enrolment forms visit
Term Starting from
Sunday 31 Jan 2021
www.sydneytelugubadi.org
Email: school@sydneytelugu.org
COVID SAFE PLAN
Telugu School Locations
Strathfield South
Kellyville
Wentworthville
Eastwood
Quakers Hill
Online Classes
TEACH YOUR CHILD TELUGU
SUNDAY CLASSES 10AM-12 PM
NSW Community Language Certified Teachers
+150 Students
+6 Locations
Locally Developed New Curricullum
• Early Stage 1
• Early Stage 2
• Level 1
• Level 2
• Level 3
• Co-Curricular Activities
Operated in Association with
• NSW Federation of Community Languages
• NSW Department of Education
• Department of Social Service
Made with PosterMyWall.com


❖❖❖❖❖



Sweet UTSAV
Sweet UTSAV
When Only The Best Will Do
6/17 Brumby Street, Seven Hills, NSW, 2147 Tel: (02) 8608 7146 Mob: 0450 740 277


❖❖❖❖❖

# వడ్లగింజలో బియ్యపుగింజ

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి

' హలో......'

' హలో! హలో........'

' హలో....హలో.....భారతీ!.......'

' ఆ! హలో.......అమ్మా! నువ్వా!........బాగున్నావా? కాళ్ళనొప్పులు తగ్గాయా? ఏమిటీ, ఈ మధ్య ఫోను చేయడంలేదు? నాకేమో కంగారుగా వుంటోంది. బామ్మ, చెల్లి, శ్రావణి ఎలా వున్నారు? ఉండు, స్పీకర్ ఆన్ చేస్తా. సతీష్ కూడా వింటాడు. ఊ, మాట్లాడు.'

' మీరంతా ఎలా వున్నారు?'

' అంతా బాగానే వున్నాం. మీరెలా వున్నారు? ఈమధ్య ఫోను డెడ్డయింది.'

' ఔను భారతీ. మా ఫోనూ డెడ్డయింది. నీ మాట వినిపించటల్లా. గట్టిగా మాట్లాడు.'

' చాలా గట్టిగా గొంతు చించుకు మాట్లాడుతున్నా. మీ ఫోను ఫాల్టేమో! బాగా డిస్టర్బెన్స్ కూడా వస్తోంది.'

' రోజా ఎలా వుంది? ఏమన్నా సంబంధాలు చూస్తున్నారా?'

' ఆ? ఏమిటీ..........? రోజాకా? అప్పుడే పెళ్ళేమిటమ్మా? ఇంటర్ పరీక్షలు మొన్నేగా రాసింది? ఐనా పాతకాలంలోలా మాట్లాడతావేమిటి? ఇప్పటి రోజుల్లో ఆడపిల్లలు కూడా పెద్దచదువులు చదివి, అమెరికాలు, ఆస్ట్రేలియాలు వెడుతున్నారు. ఇప్పుడు ఎమ్.సెట్.కోచింగ్ తీసుకుంటోంది. ఉదయం నించి, సాయంత్రం దాకా ట్యూషను. ఆ సిటీబస్సుల్లో వెళ్ళిరావడం. ఒకటే తిరుగుడై పోతోంది. ఈమధ్య నాలుగు రోజులనించి బాగా ఫీవర్ గా కూడా వుంటోంది. అలాగే నీరసంగా ట్యూషన్లకెడుతోంది. వెళ్ళద్దని చెప్పినా వినదు.'

' డాక్టరుకి చూపించి మందులు వాడు.'

' ఆ....ఆ....మందులు బలవంతంగా మింగిస్తున్నాంలే. నువ్వేం కంగారు పడకు. సరిగా తిండి తినదు. చెబితే కోపం. నా మాటంటే లెక్క లేకుండా పోతోంది ఈ ఇంట్లో ఎవరికీ. మీ అల్లుడుగారు కాన్ ఫరెంసుకి అమెరికా వెళ్ళారు. ఇంకో నెల్లాళ్ళు అక్కడే వుండాలి. ఇక ఇంటి సంగతులేం పట్టించుకుంటారు? ఇంటా బయటా అన్ని పనులూ నేనే చూసుకోవాలి.'

' సతీష్ ఎలా వున్నాడు?'

' సతీషా? వాడికేం, బాగానే వున్నాడు. ఏ.జి.బి.ఎస్ సి.లో చేరాడు. బానే చదువుతున్నాడు. అన్నట్టు రమణికి సంబంధాలు చూస్తున్నారా? నాన్నగారు కేంపు నించి వచ్చాక ఒకసారి ఫోను చెయ్యమను. చాలా రోజులైంది

మాట్లాడి. అన్నట్టు సెల్ కొన్నారట కదా? ఫోను చెయ్యచ్చుగా? సరే, ఉంటా. ఫోను సరిగా వినిపించటల్లా. బాగా గరగర సౌండ్ వస్తోంది. మళ్ళీ ఎక్స్ ఛేంజి వాళ్ళకి కంప్లైంట్ ఇయ్యి.'

*************************

' **************'

' ఊ, హలో......'

' హలో, భారతీ, ఏమిటీ, అంత డల్ గా మాట్లాడుతున్నావు?'

' ఏమీ లేదు. మనసేం బాగా లేదు. అందుకే మాట్లాడలేక పోతున్నాను.' (వెక్కి వెక్కి ఏడుస్తోంది)

' భారతీ, భారతీ! ఏమైందమ్మా?'

' రోజీ పోయింది.'

' అయ్యో, ఎలా?'

' .................'

' హలో.....హలో.....హలో, హలో.......ఊ, మళ్ళీ ఈ పాడుఫోను డెడ్డయినట్లుంది.'

********************

' రోజా పోయిందని ఫోన్లో చెప్పగానే నా మనసాగలేదే తల్లీ. ఫోన్లో నీ మాటతీరు చూసి భయమేసిందే అమ్మా. మీ నాన్నగారు రాగానే వెంటనే ఇంటికి తాళం పెట్టి టాక్సీ చేసుకుని బయలుదేరాం. అయ్యో, ఈ వయసులో నీకెంత కష్టం కలిగిందే అమ్మా! అదేం డాక్టరమ్మా? ఆ మాత్రం జ్వరం కూడా తగ్గించలేక పోయాడా? సిటీలో డాక్టర్లు బాగా డబ్బులు గుంజుతారు గాని, వైద్యం సరిగ్గా చెయ్యరు. ఫోన్లో రోజాకి జ్వరం అని చెప్పగానే నా మనసాగలేదు. వెంటనే వచ్చేద్దామనే అనుకున్నా. మళ్ళీ నువ్వు ఏ సంగతీ ఫోను చేసి చెప్పలేదు. నేనే నీకు ఫోను చేద్దామనుకుంటే, పాడు ఫోను, అదీ చచ్చూరుకుంది. మొన్న నీతో మాట్లాడుతుండగా ఫోను మళ్ళీ డెడ్డయింది. ఇంక పిన్నీ, బాబాయ్, అక్క, బావ, వదిన, అన్నయ్య అందరికీ రమణి సెల్ ఫోన్లో చెప్పింది. ఈపాటికి వాళ్ళూ బయలుదేరి వస్తూంటారు. కంగారు పడుతుందని అమ్మమ్మకి చెప్పలేదు. హయ్యో, హయ్యో! ఉట్టి జ్వరానికి ప్రాణం తీసుకుపోవాలా ఆ దేముడు? అప్పుడే నీకు నూరేళ్ళూ నిండాయా తల్లీ? నిన్ను నేనేమని ఓదార్చగలనే భారతీ? నీ బాధ ఎలా తీరుతుందే అమ్మా? హయ్యో, ఎంత ఘోరం జరిగిందే అమ్మా?'

' అయ్యో, అయ్యో! ఏమిటమ్మా భారతీ? టి.వి.లో న్యూస్ ఛానెల్ లో రోజా ఇంజక్షనుకి రియాక్షనొచ్చి పోయిందని వార్త చూసి స్పృహ తప్పి పడిపోయాను. తరవాత రమణి కూడా ఫోను చేసి చెప్పింది. అప్పుడు బాబాయిగారు ఎలాగో తీసుకొచ్చారు. ఇప్పుడు నీకీ కష్టమేమిటే అమ్మా?'

ఆటో దిగి లోపలికొస్తూనే పిన్ని శ్రావణి ఒకటే ఏడ్చేస్తోంది.

గుమ్మంలో మరో ఆటోలోంచి దిగుతూనే భారతి అన్న, వదిన వస్తూనే ఏడుపు లంకించుకుని, తర్వాత సాధింపుల భాగవతం మొదలుపెట్టారు.

' ఏం, రోజాకి ఒంట్లో బాగుండకపోతే మాకు కబురు చేయనక్కర్లేదా? అందరిళ్ళలోనూ ఫోనులున్నాయి. మాకు మాత్రం ఫోను చెయ్యరు. ముంబైలో వున్నంత మాత్రాన మేం రామనుకున్నారా? మేమంటే అసలెవరికీ గిట్టదు. పోనీ ముంబై తీసుకువస్తే అక్కడ మంచి వైద్యం చేయించే వాడినిగా? నాకు అక్కద డాక్టర్లందరూ తెలుసు. అన్నీ చేతులారా చేసుకుంటారు. మాట్లాడితే దేముడిని తిట్టేస్తారు. విధి అని, జాతకాలని, ఖర్మ అని, వాస్తు బాగాలేదని, దేముడే చేసాడని, మనకి ప్రాప్తం లేదని, ఋణం తీరిపోయిందని, ఇలా నోటికొచ్చిన చెత్త వాగుడు వాగి, ఆత్మవంచన చేసుకుంటూ బతికేస్తారు.. కాని మనం చేయాల్సిన ప్రయత్నాలు ఏవిధంగా చేస్తే బాగుంటుందో ఆలోచించి చెయ్యరు.'

' ఒరే అన్నయ్యా! అక్కయ్యసలే బాధలో వుంటే ఓదార్చాల్సింది పోయి నీ సాధింపులేమిట్రా? తరవాతందరూ ఇలాగే మాట్లాడతార్లే.' అంది రమణి.

' చూడమ్మా చూడు. ఆ రాక్షసి ఎలా మాట్లాడుతోందో! నేనన్న దాంట్లో తప్పేముంది?'

' అవున్రా. తప్పా, తప్పున్నరా? ఓమూల అది బాధలో వుంటే ఇప్పుడు సాధింపులు మొదలెడతావా? వుట్టి జ్వరానికి హైదరాబాద్ నించి ఎక్కడో ముంబైకి తీసుకురావాలా? అక్కడయితే బతుకుతుందా? ఒంట్లో బాగుండని పిల్లని అసలంత దూరం ఎలా తీసుకొస్తార్రా? అప్పుడయితే దార్లోనే ప్రాణం పోయుండేది. అప్పుడూ నువ్వు తిట్టుండేవాడివి. ఈమాత్రం జ్వరానికి ముంబై తీసుకు రావాలా, అక్కడే డాక్టర్లకి చూపించివుంటే దక్కేది కదా అని వుండేవాడివి. నాయనా! అందుకే విధిరాత అని, ప్రాప్తం లేదని, ఇలా అనేకరకాలుగా మనసుకి సర్ది చెప్పుకోవడం. విధి అంటే వేరేగా ఏమీ వుండదు. మనుషులు చేసే పాపకర్మల ననుసరించే బుద్ధి కూడా వుంటుంది. ఆ విధంగానే జాతకాలు కూడా రాయబడతాయి. విధి ఎలా వుంటుందో ముందరే తెలిసుంటే ఏ ప్రమాదాలూ జరగకుండా మనిషి ముందరే జాగ్రత్త పడతాడు. కాని జరగబోయేది ముందరే తెలిసుంటే మనిషెందుకవుతాడు? దేముడే అవుతాడు. పోనీ వైద్యం చేయించకుండా ఏంలేదుగా? అది మాత్రం ఏం చేస్తుంది? నాకు ఫోన్లో అన్నీ చెప్పిండీ.' తల్లి సర్దిచెప్పింది.

' ఔన్లే, అందరికీ అంటే ఫోనులు చేస్తావు. నాకైతే చెయ్యవు. నేనసలు అమెరికా ఛాన్ సు వచ్చి వెళిపోతానంటే, నిన్ను చూడకుండా వుండలేను, వద్దు, ఇండియాలోనే వుండు అంటూ నన్ను వెళ్ళనివ్వలేదు. నీగురించి అన్నీ వదులుకుని ఇండియాలోనే వుండిపోయాను. ఐనా నన్నెవరూ లెక్క చెయ్యరు.'

' మా ఫోనూ చచ్చూరుకుంది నాయనా. నిన్ననే బతికింది. పైగా నీకు ఫోను చెయ్యడం అంత బుద్ధితక్కువ పని ఇంకోటి లేదు. ఎప్పుడూ నీ ఫోనుకి ఎంగేజే తప్ప ఓల్డేజి రాదు. లేకపోతే, ఈ నంబరు ఒకసారి సరిచూసుకోండనో, ఈ నంబరు మీద ప్రస్తుతం ఏ టెలిఫోనూ పని చెయ్యటల్లేదనో, కవరేజి ఏరియాలో లేదనో, ప్రస్తుతం స్పందించుటలేదనో మూడు భాషల్లోనూ ఒక తియ్యని గొంతు వినిపిస్తుంది. ఇంక నీకేం ఫోను చెయ్యాలి? నువ్విక్కడుండి ఉద్ధరించేదేం లేదు. నీ సాధింపులు పడేకన్న అమెరికాయే వెళ్ళు.' తల్లి అంది.

తల్లి మాట్లాడే మాటలకి భారతి ఫక్కున నవ్వింది.

' అయ్యో భారతీ! అన్నయ్య మాటలు నువ్వేం పట్టించుకోకు. వాడలాగే అడ్డదిడ్డంగా వాగుతాడు. చూడు, ఎలా నీరసపడిపోయావో. కొంచెం అన్నం తిను.'

' నాకేం, నేను బాగానే వున్నాను. మీరందరూ ఎందుకింతగా బాధపడుతున్నారో అర్ధం కావటల్లేదు. ఈమాత్రానికి మీరందరూ రావాలా? ఎప్పటికైనా అందరం పోయేవాళ్లమే. కొన్నాళ్ళకి నేనూ చచ్చిపోతాను. నువ్వూ చచ్చిపోతావు. ఆ చెట్టూ పోతుంది. అదిగో, ఆ వెళ్ళే ఆవూ చచ్చిపోతుంది. ఈ పిల్లీ చచ్చిపోతుంది. ఆ ఆటోవాడూ చచ్చిపోతాడు. పుట్టిన ప్రతి జీవీ మరణించక తప్పదు. కాదంటే కొంచెం ముందూ వెనకా. అంతే. రైలు ప్రయాణం లాంటిదీ జీవితం. స్టేషను రాగానే దిగిపోతారు. ఎవరికెవరు? అంతా ఋణానుబంధం! అంతే. చచ్చిపోతే ఏమీ తెలియదు. దీర్ఘనిద్రలోకి వెళ్ళిపోతారు. బతికున్నవాళ్ళే పోయినోళ్ళకోసం ఏడుస్తారు. అల్లా ఎన్నేళ్ళేడుస్తారమ్మా? మిగతా పనులు చేయవద్దా? పోయినోళ్ళతో మనమూ పోతే ఈ ప్రపంచంలో ఎవరూ మిగలరు. ప్రతి చిన్నవిషయానికీ అలా బాధ పడిపోతుంటే ముందుకు సాగలేం. మీ ఏడుపులూ, గొడవలతో నాకు పిచ్చెక్కేటట్లుగా వుంది. అసలు మీరందరూ వచ్చి ఎందుకేడుస్తున్నారో నాకు అర్ధం కావటల్లేదు.' అంటూ భారతి కంచం నిండా అన్నం వడ్డించుకుని టేబులు మీద వున్న ఆవకాయ, కందిపొడి, ఆంధ్రమాతని అన్నీ శుభ్భరంగా కలుపుకుని, గడ్డ పెరుగు వేసుకుని సుష్టుగా భోంచేసి గదిలోకి వెళ్ళి హాయిగా ముసుగు తన్ని పడుకుంది.

భారతి వేదాంతధోరణికి అందరూ విస్తుపోయి చూస్తూ నిలుచుండి పోయారు. భారతి పరిస్థితి అర్ధం కాక డాక్టర్ని పిలిపించారు. ఆయన మరేం ఫరవాలేదంటూ మందులు రాసిచ్చారు.

' ఈ డాక్టర్లు అలాగే అంటారమ్మా. ఎంత ప్రాణం మీదకొచ్చినా మరేం ఫరవాలేదనే అంటారు. భారతిని నేను ముంబై తీసికెళ్ళి మంచి డాక్టర్లకి చూపించి వైద్యం చేయిస్తానుండు.' అంటూ భారతి అన్న మోహను మళ్ళీ పాత పాట మొదలుపెట్టాడు.

భారతి సుష్టుగా భోంచేసి పడుకున్నా మిగతా అందరూ బాధలో భోజనాలు చేయక నీరసంతో పడుంటే, భారతి పిన్ని శ్రావణి అందరికీ టిఫిన్లు తినిపించి కాఫీలు ఇచ్చింది. అందరూ బాధ పడుతూంటే భారతి ఏ బాధా లేకుండా సుష్టుగా భోంచేసి హాయిగా పడుకోవడం - ఆమె వింత ప్రవర్తన ఎవరికీ ఏంఈ అర్ధం కాలేదు.

ఇంతలో ఆటోలోంచి ఒక నడివయస్సాయన, పంజాబీ డ్రస్సు వేసుకున్న పదహారేళ్ళ అమ్మాయి దిగారు. ఆ అమ్మాయి చేతిలో కుక్కపిల్ల, మరో చేతిలో బుక్సు వున్నాయి. కుక్కపిల్లని ఒకటే ముద్దులాడుతోంది ఆ అమ్మాయి.

' అరే, అందరూ ఇక్కడే వున్నారే? పెళ్ళి సడెన్ గా కుదిరింది. వారం రోజులు కూడా టైము లేదు. శుభలేఖలు అందకపోయినా రమ్మని చెబుదామని ఫోను చేద్దామంటే......' లైన్ స్ ఆర్ బిజీ, డయల్ ఆఫ్టర్ సమ్ టైము' అంటూ ఓ అందమైన గొంతు వినిపిస్తూంటుంది. ఒక్కోసారి రేడియో ప్రోగ్రాంసు వినిపిస్తూంటాయి. మరోసారి క్రాస్ కనెక్షన్ స్ వినిపిస్తూంటాయి. అన్నయ్య కేంపులో ఉన్నారని ఆ మధ్య చెప్పావుగా? అక్కడికి ట్రై చేసాను. లక్కీగా దొరికాడు. కేంపు పూర్తి చేసుకుని అప్పుడే ఊరికి బయలుదేరుతున్నాడుట. పెళ్ళికి అందర్నీ రమ్మని చెప్పాను. పోనీలే, శుభలేఖలు అందక పెళ్ళికి రారేమోనని భయపడ్డాను. అన్నయ్య అందర్నీ తీసుకొచ్చాడు. నాకు చాలా సంతోషంగా వుంది.' అంటూ అందరికీ పెళ్ళి శుభలేఖలు ఇచ్చాడు భారతి బాబాయ్ కృష్ణమూర్తి.

కాని అతను చెప్పే మాటలు వినిపించుకోకుండా అసలు బాధ మర్చిపోయి, ' చిట్టిరాజా1 బుజ్జి రాజా1 మళ్ళీ

మనింటికొచ్చేసాం.  ఇంక నువ్విక్కడే వుండువు గాని.  సరేనా?' అంటూ కుక్కపిల్లని ముద్దులాడుతున్న అమ్మాయిని చూస్తూ అంతా తెల్లబోయి నుంచున్నారు.

' ఏమిట్రా అబ్బాయ్ ఈ కార్డు?  ఇంట్లో అందరూ కులసాగా వున్నారా?  మీ ఇంటికి తీసికెళ్ళరా నన్ను.  ఇక్కడేమిటో అందరూ విచారసముద్రంలో మునిగి వున్నారు.  ఎందుకో విషయం చెప్పరు.' అంది ఎనభయ్యేళ్ళ ముసలితల్లి.

' ఆ, అందరూ బాగున్నారు.  అమ్మాయికి పెళ్ళి..........పెళ్ళి కుదిరింది.  ఇదే మొదటి శుభకార్యం కదా, నీ కోడలికి సలహాలు చెబుదూ గాని, నాతో వచ్చెయ్ మా ఇంటికి.' అంటూ గట్టిగా అరిచినంత పని చేసి, మెళ్ళో తాళి కడుతున్నట్టుగా చూపించి ఆ చెవిటితల్లికి అర్థమయ్యేలా చెప్పేసరికి గొంతు జీరబోయి గ్లాసుడు నీళ్ళు తాగాడు.

' హాయ్ అమ్మమ్మా!  మామయ్యా!  అత్తయ్యా!  తాతగారూ!  భారతమ్మమ్మా!  హాయ్ రమణీ!  ఏమిటీ అందరూ ఒక్కసారిగా ఊడిపడ్డారూ?  ఏమిటీ విషయం?  ఏమైంది మీకు?  ఏ దెయ్యాన్నో, భూతాన్నో చూసినట్టు గుడ్లప్పగించి నన్నందరూ అలా వింతగా చూస్తున్నారేమిటి?  మమ్మీ ఎక్కడ?  హయ్ మమ్మీ!  మన రోజీ పోయిందని చాలా దిగులు పడుతున్నావుగా?  అందుకే నీకేం తెచ్చానో చూడు?  ఇదుగో, బుజ్జి కుక్కపిల్లని తెచ్చాను ట్యూషను నించి వస్తూ.  ఇదివరకు మా ఫ్రెండు అడిగితే రోజీ కుక్కపిల్లల్ని రెండింటిని ఇచ్చాంగా?  అందులో రాజా అన్న కుక్కపిల్లని తెచ్చాను.' అంది రోజా.

ఆ కుక్కపిల్ల గమ్మున సరోజ చేతిలోంచి ఒక్క ఉదుటున దూకి భారతి ఒళ్ళో కూచుని ఆమె ఒళ్ళంతా ప్రేమగా నాలికతో నిమిరింది.

జరిగిన ఘోరాతి ఘోరమైన పొరపాటుకి నవ్వాలో, ఏడవాలో తెలియని పరిస్థితిలో అందరూ చేష్టలుడిగి నుంచున్నారు.  అందరూ తేరుకుని, ' సరోజా!  నువ్వు బాగున్నావా?  జ్వరం తగ్గిందా?' అంటూ ఆమెని గట్టిగా పట్టుకుని ఏడ్చేసారు.

' ఆ, ఏదో మామూలు జ్వరంలే.  ఏం, మమ్మీ చాలా ఎక్కువగా చేసి చెప్పేసిందా?  ఆవిడకంతా కంగారే.  ఆవిడ కంగారు పడి అందర్నీ కంగారు పెట్టేస్తుంది.  రోజీ పోయాక ఆవిడ మనసేం బాగా లేదు.  ఆ డాక్టరు ఇచ్చిన ఇంజక్షనుకి రియాక్షను వచ్చి పాపం రోజీ చచ్చిపోయింది.  సతీషు, నేను కాలేజికి వెళ్ళిపోతే ఆవిడకి దాంతోనే కాలక్షేపం.  అందుకే మమ్మీకి అదంటే ప్రాణం.  అది పోయినప్పుడు బాగా ఏడ్చేసింది.  అందుకే మమ్మీ బాధ చూడలేక దాని పిల్లనే తీసుకు వచ్చాను.'

' ఛీ, ఛీ!  సరిగ్గా ఒకళ్ళ మాట ఒకళ్ళు వినిపించుకోక పోవడం మనింట్లో అందరికీ ఓ పెద్ద దురలవాటు.  కుక్క చచ్చిపోతే ఏమీ లేనిదానికి ఇంత రాద్ధాంతం చేస్తారా?  ఐనా, ఏమిటి భారతీ?  నీ కూతురు పేరు సరోజ ఐతే రోజా అని పిలవాలా?  పోనీ రోజా అని పిలుచుకుంటున్నావు, కుక్కకి కూడా రోజీ అనే పేరు పెట్టాలా, ఇంకో పేరేదీ దొరకనట్టు?  మళ్ళీ ఇప్పుడు దీనికి రాజా అని పేరు పెట్టుకున్నారా?  పేర్లు కొంచెం సరిగ్గా చూసుకుని పెట్టుకోనక్కర్లేదా?  ఏం?  ఫోన్లు చేసుకునేటప్పుడు వివరంగా మాట్లాడుకోవచ్చుగా?  వడ్లగింజలో బియ్యపుగింజ!  ఏమీ లేనిదానికి పుట్టినే ఇంత రాద్ధాంతం చేసారు.  అనవసరంగా బోలెడు డబ్బు ఖర్చు పెట్టి ముంబై నించి ఫ్లైట్ లో కూడా వచ్చాం కదే?' అంటూ గట్టిగా అరవడం మొదలుపెట్టాడు మోహను.

' నీ పిసినారితనం పాడుగానూ!  నీ ముంబై వాగుడు కట్టిపెట్టి నా మాట కొంచెం విను.  ఇందులో భారతి తప్పేం లేదులేరా.  అది సరిగ్గానే చెప్పింది.  కంగారులో నేనే పొరపాటుగా విన్నాను.'

' మామయ్యా! నేను చెబుతానుండు. మా కాలేజిలో ముగ్గురు సరోజలున్నారు. ఒకరు సి.సరోజ, ఇద్దరు టి.సరోజలు వున్నారు. అందుకే ఒకర్ని సి.సరోజ అని, మరొక అమ్మాయిని టి.సరోజ అని, నన్ను రోజా అని పిలుస్తారు. అదే ఇంట్లో కూడా అలవాటై పోయింది. ఇంక కుక్క సంగతంటావా? ఇంతకు ముందే ఇంకొకళ్ళ ఇంటినుంచి తెచ్చేసరికే దాని పేరు రోజీ. అందుకని దాని పేరు మార్చడం కుదరలేదు.'

' ఐనా ఒరేయి, మంచి జరిగిందని సంతోషించక, ఆ ఏడుపు మొహం ఏమిట్రా కోపిష్టి సన్నాసీ? బాబాయి కూతురు రత్నమాల పెళ్ళికి అందరం ఎలాగూ వెళ్ళాలి కదా? జరిగిన పొరబాటుని పీడకలగా భావించి, ఏదీ, అందరూ హాయిగా నవ్వండి.' అంటూ వాతావరణాన్ని మార్చే ప్రయత్నం చేసింది భారతి తల్లి.

అందరూ ఎంతో సరదాగా నవ్వుతుంటే భారతి పిన్ని శ్రావణి కూడా మనసులో అనుభవించే నరకబాధని అణిచిపెట్టుకుని ఎవరికీ కనబడకుండా కళ్ళు తుడుచుకుని, పైకి మాత్రం గలగలా నవ్వేసింది. ఆ నవ్వు వెనక దేశ సరిహద్దుల దగ్గర జరిగిన పరస్పర కాల్పుల్లో తన కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించి వీరమరణం చెందాడని సంతోషించాలా, లేక జీవితమంతా గర్భశోకంతో ఆ తల్లి నరకయాతన పడాలా?

ఇంతలో భారతి శ్రావణి బుజం మీద చెయ్యి వేసి, ' పిన్నీ! రా వెడదాం. అందరం కలిసి హోటల్లో డిన్నర్ చేద్దాం.' అంది.

' లేదమ్మా, ఇప్పుడు మీ బాబాయ్, నేనూ కలిసి మా ఊరెళ్ళిపోతాం. నన్ను వదిలెయ్ తల్లీ.' అంది.

' అదేమిటమ్మా? వీరమాతవి, అమ్మాయి పెళ్ళికి నువ్వు లేకపోతే ఎలాగ? ఏదైనా సమస్య వస్తే అందరికీ మంచి సలహాలిస్తూ, సందడి చేస్తూ సరదాగా కబుర్లు చెబుతూ వుండే నువ్వంటే మాకు ఎంతో ధైర్యం. నువ్వే పెళ్ళికి ముఖ్యంగా వుండాలి.' అన్నాడు భారతి బాబాయ్.

' ఏమిట్రా అబ్బాయ్! పొద్దుట్నించీ ఏమిటో అందరూ ఎంతో బాధ పడిపోతున్నారు, ఏడుస్తున్నారు, కాసేపేదో గొడవ పడుతున్నారు, ఇప్పుడందరూ ఎంతో ఆనందంగా నవ్వుకుంటున్నారు? విషయం ఏమిటో చెప్పరా.' అంటూ ఆదుర్దాగా అడిగింది కొడుకుని ఆ బ్రహ్మచెమిటి ముసలితల్లి.

ఆమెకేమని చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థం కాక కోడల్ని అడగమన్నాడు భారతి తండ్రి.

కోడల్ని అడిగితే కొడుకు మోహానుకి అప్పజెప్పింది.

' ఏమిరా, ఏమిటీ విషయం? నువ్వయినా చెప్పు నాయనా. నాకు కంగారుగా వుంది.'

' నానమ్మా, నీకు ఏం చెప్పినా వినపడి చావదు. చెవిలో పెట్టుకునే మిషను కొన్నాను. పెట్టుకోవచ్చుగా?'

' ఆ...అవున్రా. ఆ మాయదారి బట్టల మిషనోటి కొని పడేసావు. అందరూ బట్టలు చేత్తో ఉతకటం మానేసి, ఆ మిషన్లో పడేస్తున్నారు. అందుకే మరకలు పోక చీరిట్లా ఏడిసింది. ఏమైనా చేత్తో ఉతికినట్టుంటాయా? ఈ మిషన్లొచ్చాక బాగా బద్ధకాలు పెరిగిపోతున్నాయనుకో. పనులు చేయడం మానేస్తున్నారు. ఐనా...అసలు విషయం ఏమిటో చెప్పకా....ఇప్పుడు బట్టలమిషను గొడవెందుకూ....అసలే కంగారు పడి చస్తూంటే?'

' అమ్మా, మీరు చేసిన నిర్వాకానికి నానమ్మను కూడా వెంటేసుకు రావాలా?'

' అమ్మో! ఆవిడ్ని తీసుకురాకపోతే ఊరుకుంటుందట్రా? నా ప్రాణాలు తోడేయదూ? ఆమె దెప్పుళ్ళు పడేకంటే తీసుకురావడమే మేలు. భారతిని చూసొస్తా, ఇంటో జాగ్రత్తగా వుండండి అంటే, నాకూ భారతిని చూడాలనుంది అంటూ బయలుదేరింది. పైగా ఈ వయసులో కూడా ప్రయాణమంటే చాలు, ఉరకలేస్తూ తయారవుతుంది. ఏమే శ్రావణీ! ఆవిడకి నువ్వే ఎలాగో చెప్పమ్మా, మావల్ల కాదు గానీ.......' అంటూ శ్రావణికి అప్పజెప్పింది భారతి తల్లి.

' అమ్మా శ్రావణీ! నువ్వన్నా చెప్పమ్మా ఏమైందో.'

శ్రావణి శాయశక్తులా కంఠాన్నంతా విప్పి, ఆవిడకి వినబడేలా, సరిగ్గా అర్థమయ్యేలా గొంతు చించుకుని చెప్పసాగింది.

' భారతి కొడుకు సతీష్ వున్నాడు కదా? వాడు అగ్రికల్చరల్ బి.ఎస్.సి. చదువుతున్నాడు కదా? అంటే వ్యవసాయానికి సంబంధించిన చదువన్నమాట.'

' ఇప్పుడు వాడి చదువు గొడవెందుకు? నేనడిగిన దానికి సమాధానం చెప్పక?'

' ఊ, అదే చెబుతున్నా వినండి. వాడు వ్యవసాయ శాస్త్రం చదువుతున్నాడు కదా? వడ్లగింజల్లో బియ్యపుగింజలుంటాయని తెలుసుకున్నాడు. అందుకే ప్రాక్టికల్ గా చూద్దామని......... వడ్లగింజలన్నీ ఒలిచి బియ్యంగింజలు తీస్తున్నాడు.'

' ఈమాత్రం దానికి అంతలా నవ్వుతారెందుకు మరి? వాడు చదువుకుని వడ్లగింజల్లో బియ్యపుగింజలుంటాయని తెలుసుకున్నాడు. అప్పుడంటే మనం అనుభవంతో తెలుసుకున్నాం. పూర్వం వడ్లు దంచి తీసిన ఆ దంపుడుబియ్యంతోనే కదా, అన్నం వండుకునే వాళ్ళం? అప్పట్లో మూడు నెలలకోసారి పనివాళ్ళు వచ్చి గాదెలో ధాన్యం తీసి, వడ్లు దంచి బియ్యం చేసేవారు. ఆ దంపుడుబియ్యంతో వండిన అన్నం ఎంతో రుచిగాను, బలవర్ధకంగాను వుండేది. అందుకే ఎనభై ఏళ్ళు వచ్చినా నేనెంత బలంగా వున్నానో చూడు? కాళ్ళనెప్పులు, చత్వారాలు ఏవీ లేవు నాకు. మీరూ వున్నారు, ఎందుకూ? నువ్వు, నీ అక్క కాస్త పని చేసి కాళ్ళు నెప్పి, నడుం నెప్పి అంటూ మూలుగుతారు. ఇహ సతీష్ గాడితో సహా మీకందరికీ ఇప్పట్నించే కళ్ళజోళ్ళు! అది సరే, పొద్దుట్నించీ ఒకటే ఏడుస్తున్నారెందుకు మరి?' అని ఆవిడ మళ్ళీ సందేహం వ్యక్తం చేసింది.

మళ్ళీ ఆవిడకి ఏం సమాధానం చెప్పాలా అనుకుంటూ, ' అదా.........అదీ....అదీ....ఆ....సరోజ కాలేజికి వెళ్ళి ఇంకా రాలేదని కంగారు పడుతున్నారు అందరూ. ఈలోగా మీ రెండో అబ్బాయిగారింటి కెళ్ళిందిట. అందుకే ఇద్దరూ ఆటోలో కలిసి వచ్చారు.'

' ఏమిటీ, కుక్కపిల్లని కొనడానికి వెళ్ళి ఇంత లేటయిందా? అవున్లే, ఇంట్లో కుక్క వుంటే మంచిదే. దొంగల భయం వుండదు. బుజ్జిముండ, తెల్లగా, ముద్దుగా బాగుంది.' అంటూ ఆవిడకి ఇంకోలా వినిపించి అంది ఆ చెవిటితల్లి.

ఇంక ఆవిడతో మాట్లాడలేక దగ్గొస్తుంటే, ' ఇదిగో పిన్నీ! అమోఘమైన నీ సమయస్ఫూర్తికి మెచ్చితిని. ఇప్పటికే బాగా అలిసిపోయావు. ఈ కూల్ డ్రింక్ తాగు.' అంటూ రమణి కూల్ డ్రింక్ అందించింది.

ఈలోగా టి.వి.లో ' బ్రేకింగ్ న్యూస్ ' అంటూ యాంకరు చెబుతోంది.

' మొన్న రోజా అనే కాలేజి అమ్మాయి జ్వరం వస్తే డాక్టరు ఇచ్చిన ఇంజక్షనుకి రియాక్షను వచ్చి చనిపోయిందని పొరబాటుగా చెప్పినందుకు చింతిస్తున్నాం. ఇప్పుడు మా విలేఖరి అందించిన వివరాల ప్రకారం, పోయింది అమ్మాయి కాదు, పెంపుడు కుక్క. ఆ కుక్క పేరు రోజీ. దానికి రియాక్షను వచ్చి చనిపోయింది.'

అందరూ ఆ వార్త విని అవాక్కయ్యారు.

సరోజకి అప్పుడు అర్థమయింది వీళ్ళంతా ఎందుకొచ్చారో.

తరువాత రత్నమాల పెళ్ళి వైభవంగా జరిగింది.

❖❖❖❖❖



పాఠకులందరికీ వినాయకచవితి పర్వదిన శుభాకాంక్షలు


Adyar Ananda Bhavan
SWEETS & SNACKS
A2B
VEG. RESTAURANT
SYDNEY
Adyar Ananda Bhavan
Vegetarian Restaurant
Multi Cusine
OUR DELICIOUS FOOD AT YOUR CITY
Adyar Ananda Bhavan brings you exciting vegetarian food, making us a perfect place for dining with family or just a quick bite on the go. Food at our pure vegetarian restaurant is made using the fresh ingredients ensuring that we serve the healthiest food. For serving superior quality food at fair prices, Adyar Ananda Bhavan is reckoned among the best veg restaurants in Chennai and all over India and abroad.
Call Us At
(+02) 9633 2767
ORDER NOW
116 Wigram St
Harris Park
www.a2bsydney.com.au

❖❖❖❖❖


AMARAVATHI
DINE IN • RESTAURANT
Opening Hours
Mon-Sun: 11:00 am – 10:30 pm
Contact Details
AMARAVATHI Harris Park
42 Marion Street, Harris Park NSW 2150
02 8606 2279
AMARAVATHI Wentworthville
Shop 3 / 1-5 Dunmore Street, Wentworthville NSW 2145
02 8606 3333

# వినాయక పూజ పత్రి – ఆరోగ్య ప్రయోజనాలు

వెబ్ సేకరణ: శ్రీమతి విజయ గొల్లపూడి



వినాయక చవితి నాడు చేసే పూజలో పత్రాలు ప్రధానమైనవి. విఘ్నేశ్వరుని 21 రకాల ఆకులతో పూజించడం ఆనవాయితీ. అయితే ఈ 21 ఆకుల పేర్లేంటని తెలుసుకోవాలంటే

**1.మాచీ పత్రం:** ఓం సుముఖాయ నమః మాచీ పత్రం పూజయామి ఈ ఆకుల్ని నీళ్ళలో తడిపి కళ్ళకి కట్టుకుంటే నేత్ర రోగాలు నయం అవుతాయి. అలాగే చర్మ వ్యాదులకి కూడా అద్భుత మందుగా పనిచేస్తుంది. ఆ ఆకుల్ని పసుపు, నువ్వుల నూనెతో కలిపి ముద్దగా నూరి చర్మ వ్యాదులకి రోజూ పూస్తే తొందర్లోనే నయమవుతాయి. అలాగే రక్తపు వాంతులకు, ముక్కునుంచి రక్తం కారడం వంటివి కూడా అరికట్టవచ్చునట. దీనిద్వారా ఆస్తమా నియంత్రించబడుతుంది




**2.బృహతీ:** ఓం గణాధిపాయ నమః బృహతీ పత్రం పూజయామి! బృహతీ పత్రాన్ని వాకుడాకు, నేలమునగాకు అంటారు. దీనిలోనూ ఎన్నో వ్యాధులను తగ్గించగల ఔషదీయ గుణాలున్నాయి, కంఠ రోగాలు, శరీర నొప్పులు, ఎక్కిళ్ళు, కఫ, వాత దోషాలు, అస్తమా, దగ్గు, సైనసైటిస్ తగ్గించడంలో, అరుగుదలకు, గుండె పనితీరు మెరుగుపరిచేందుకు, ఈ చూర్ణం దురదలు, నొప్పి నివారిణిగా, ఈ కషాయంతో నోటి దుర్వాసన, మరియు రక్త శుద్ధి ఇలా ఎన్నెన్నో ప్రయోజనాలు ఉన్నాయి




**3.బిల్వ పత్రం:** ఓం ఉమాపుత్రాయ నమః బిల్వ పత్రం పూజయామి బిల్వ పత్రం అంటే మారేడు ఆకు. మూడు ఆకులుగా, ఒక ఆకుగా ఉంటాయి. బిల్వపత్రం అనగా మారేడు. ఈ మారేడు వృక్షాన్ని లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. ఇది ఆ పరమేశ్వరునికి అత్యంత ఇష్టమైన పత్రం. ఈ పత్రానికి నిర్మాల్య దోషం లేదు.ఈ పత్రాన్ని ఆ పరమేశ్వరునికి సమర్పించిన రోజే కాక మరునాడు

కుడా ఉపయోగించవచ్చు.ఆరోగ్యరీత్యా కూడా ఇది ఎంతోఉపయోగపడుతుంది. మధుమేహం కలవారు రోజు రెండు ఆకులను నెమ్మదిగా నములుతూ ఆ రసాన్ని మింగితే దివ్యౌషధంగా పనిచేస్తుంది.




4.గరిక:' ఓం గజాననాయ నమః దూర్వాయుగ్మం ' సమర్పయామి

దూర్వాయుగ్మం అనగా గరిక. అనగా రెండు కొసలు కలిగిఉన్న జంటగరికను దూర్వాయుగ్మం అని అంటారు. గణపతికి అత్యంత ఇష్టమైన వస్తువులలో ఈ గరిక అతి ముఖ్యమైనది.ఒక్క గరికెపోచ సమర్పిస్తే మహాదానందపడిపోతాడు మహాగణపతి. ఇది ఎక్కడపడితే అక్కడ పెరుగుతుంది. హిస్టీరియా ఉన్నవారికి దివ్య ఔషధం ఈ గరిక. పైత్యపు తలనొప్పిని తగ్గించుకోవడానికి ఈ గరికను మెత్తగా రుబ్బి నుదిటిమీద లెపనమ్లా వేసుకొంటారు.గరికను పచ్చడిగా చేసుకొని తింటే మూత్రసంబందిత వ్యాధులు తగ్గుతాయి. రక్త, చర్మ సంబంధిత వ్యాధులను, ముక్కునుండి రక్తం కారుటను నిరోధిస్తుంది.




5.ఉమ్మెత్త: ఓం హరసూనవే నమః దత్తూర పత్రం పూజయామి దత్తూర పత్రం ను మనం ఉమ్మెత్త అని కూడా అంటూ ఉంటాము..మానసిక వ్యాధిని నివారించాడంలోను, జ్వరాలు, చర్మరోగాలు, అల్సర్లు, చుండ్రు నివారణలోనూ దివ్యౌషధంగా పని చేస్తుంది. కీళ్ళ రోగాలను నయం చేస్తూ నరాలకు గట్టిదనాన్ని ఇస్తుంది.



6.బదరీ: ఓం లంబోదరాయ నమః బదరీ పత్రం పూజయామి

బదరీపత్రం అనగా రేగు ఆకు. ఈ చెట్టును సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుని స్వరూపంగా భావిస్తారు. సంక్రాంతి సందర్భంలో చిన్నపిల్లలకు పోసే భోగిపళ్ల కార్యక్రమంలో ఈ రేగుపళ్ళు అతి ముఖ్యమైనవి. జుట్టు ఆరోగ్యంగా పెరగటంలో రేగు ఆకులు మంచి ఔషధంగా పనిచేస్తాయి.



**7. అపామార్గ:** ఓం గుహాగ్రజాయ నమః అపామార్గ పత్రం పూజయామి.

అపామార్గ పత్రం అనగా ఉత్తరేణి. దీని ఆకులు నూరి పైపూతగా రాస్తే చర్మవ్యాధులు తగ్గుతాయి. దీని కొమ్మలతో పళ్ళు తోముకుంటే దంతవ్యాధులు నశించి చిగుళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఊబకాయానికి, పైల్స్ కు, వాంతులకు మంచి ఔషదంగా పనిచేస్తాయి .దీని ఆకులు నూరి రసం గాయాలకు రాస్తే రక్తం కారడాన్ని అరికడుతుంది. యజ్ఞ యాగాలలో ఈ చెట్టు పుల్లలు వేస్తారు దీని పొగ పీల్చడం వలన శ్వాస సంబంధిత వ్యాధులు తగ్గిపోతాయి.




**8.తులసి:** ఓం గజకర్ణాయ నమః తులసీ పత్రం పూజయామి

విష్ణుమూర్తికి ప్రీతికరమైనది, శ్రీ మహా లక్ష్మీస్వరూపం.తులసి ఆకులు,కొమ్మలు, వేర్లు అన్నింటిలోను ఎన్నో ఔషధ గుణాలున్నాయి. చర్మరోగాలను నయం చేస్తుంది.రోజు తులసిఆకులు నమలడం వలన పంటి చిగుళ్ళకున్న రోగాలు తగ్గి అరుగుదాలను, ఆకలిని పెంచుతాయి. తులసిరాసాన్ని తేనెతో కలిపి తీసుకోవడంవలన కఫం వలన వచ్చే దగ్గు, ఆయాసం తగ్గుతాయి. ఈమధ్య జగిన పరిశోధనలలో రోజుకు 22 గంటలు ప్రాణ వాయువు నిచ్చే చెట్టు తులసిమాత్రమే అని తేలింది.ఇంతగొప్ప లక్షణం మరే ఇతర మొక్కలకు లేదు. ఉత్తప్పుడు ఎప్పుడూ తులసితో గణేశుని పూజించరాదు. పురాణాల ఆధారంగా ఒక్క వినాయక చవితిరోజునే మనం తులసీదళాలతో ఆ స్వామిని పూజించాలి.




**9. మామిడి ఆకు:** ఓం ఏకదంతాయ నమః చూత పత్రం పూజయామి.

చూతపత్రం అనగా మామిడి ఆకు.దీనిని దేవతా వృక్షం అనికూడా అంటారు. లేత ఆకులను పెరుగుతో కలిపి మెత్తగా నూరి తింటే అతిసారం తగ్గుతుంది. మామిడి లేత చిగుళ్ళను తింటే చిగుళ్ళ వాపు సమస్య తగ్గుతుంది . మామిడి జిగురులో ఉప్పు వేసి వేడిచేసి కాళ్ళ పగుళ్ళకు, చర్మవ్యాధులకు పూస్తే తగ్గుముఖం పడతాయి. చెట్టునుంచి కోసిన కొన్ని గంటల వరకు ప్రాణవాయువు ను విడుదలచేస్తాయి.



**10. గన్నేరు:** ఓం వికటాయ నమః కరవీర పత్రం పూజయామి

కరవీరపత్రం అనగా గన్నేరు. ఏదైనా పువ్వులు కోస్తుంటే అవి క్రింద పడితే పూజకు పనికి రావు కాని గన్నేరు పువ్వులు కోసే సమయంలో క్రింద పడితే పరవాలేదు. వాటిపై నీళ్ళు చల్లి సమర్పించవచ్చు.గన్నేరు చెట్టు నుంచి వచ్చే గాలి పీల్చినా అది అనేక

రోగాలు దూరం చేస్తుంది. మనకి జ్వరం వచ్చినప్పుడు గన్నేరుఆకులు కోసి పాలు కారడం తగ్గాక తడిబట్టలో పెట్టి శరీరానికి కట్టుకుంటే జ్వర తీవ్రత తగ్గుతుంది.




11. విష్ణుక్రాంత: ఓం భిన్నదంతాయ నమః విష్ణుక్రాంత పత్రం పూజయామి

ఇది నీలం, తెలుపు పువ్వులుండే చిన్న మొక్క. నీలం రంగు పువ్వులుండే మొక్కను విష్ణుక్రాంత అని పిలుస్తారు. ఇది జ్వరం, కఫం, పడిశం, దగ్గు, ఉబ్బసం వంటి వ్యాధులను తగ్గించడానికి, జ్ఞాపక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడుతుంది.




12. దానిమ్మ: ఓం వటవే నమః దాడిమీ పత్రం పూజయామి

దానిమ్మ పత్రాన్ని దాడిమీ పత్రం అంటారు. దానిమ్మ ఆకు తింటే చర్మం కాంతి వంతమవుతుంది. దానిమ్మరసాన్ని శరీరం మీద రాయడం చేత అలర్జీలు. కీటకాలు కుట్టడంవలన వచ్చిన దద్దుర్లూఅవి తగ్గుతాయి. దానిమ్మపండు ఆకలిని పెంచి అరుగుదలను ఇస్తుంది.విరోచనాలను తగ్గిస్తుంది.దీని ఆకులకు నూనె రాసి కల్లవాపులు ఉన్నచోట కడితే తగ్గుతాయి. దానిమ్మ ఆకులు దంచి కషాయం చేసుకుని అందులో పంచదార తగినంత వేసి తాగితే దగ్గు, నీరసం, ఉబ్బసం,అజీర్తి వంటి రోగాలనుంది ఉపసమనం లభిస్తుంది.




13. దేవదారు: ఓం సర్వేశ్వరాయ నమః దేవదారు పత్రం పూజయామి

దేవతలకు అత్యంత ఇష్టమైన పత్రం దేవదారు. పార్వతీ దేవికి అత్యంత ఇష్టమైనది. దీని మానుతో చెక్కే విగ్రహాలకు సహజత్వం వుంటుంది.ఆరోగ్యరీత్యా చూస్తే ఇది అజీర్తి, చర్మసంబంధ వ్యాధులు తగ్గిస్తుంది.ఈ చెట్టు ఆకులను ఆరబెట్టి, ఆరిన ఆకులను కొబ్బరి నూనెలో వేసి కాచి చల్లార్చి ఆ నూనెను తలకి రాసుకుంటే మెదడు చల్లబడి కంటి సంబంధ రోగాలు దరిచేరవు. ఈ చెట్టు మానునుంచి తీసిన నూనె చుక్కలు వేడినీటిలో వేసుకొని ఆ నీటితో స్నానం చేస్తే శ్వాసకోశ వ్యాధులు నయమవుతాయి.



14. మరువము: ఓం ఫాలచంద్రాయ నమః మరువక పత్రం పూజయామి

మరువక పత్రం అనగా మరువము.ఇది మంచి సువాసన కలిగి వుంటుంది. మనం నిత్యం దీనిని పువ్వుల దండలలో వాడటం చూస్తాము.శరీరం దుర్వాసన వస్తుంటే వేడినీళ్ళలో మరువం వేసుకుని స్నానం చేస్తే ఆ దుర్వాసన తొలగిపోతుంది.




15. వావిలి ఆకు: ఓం హేరంబాయ నమః సింధువార పత్రం పూజయామి

సింధువార పత్రం అనగా వావిలి ఆకు. వావిలి ఆకులు వాత సంబంధమైన నొప్పులకు, శరీరముపైన వాపులను తగ్గించుటకు వాడతారు. దీని పువ్వులను కలరావ్యాధిని, జ్వరమును, కాలేయపు మరియు గుండె జబ్బులను నివారించుటకు వాడతారు.పత్రాలు కషాయం కాచి, మిరియాలు పొడి కలిపి ఇస్తే జలుబు, తల భారంతో వచ్చే జ్వరం త్వరగా తగ్గుతుంది.  పత్రాల రసంలో అల్లరసం కలిపి ముక్కులో వేస్తే పార్శ్వపు తలనొప్పి తగ్గుతుంది. వావిలి చెట్టు కొమ్మలను కొడవలి పిడులకు విశేషంగా ఉపయోగిస్తారు.



16. జాజి పువ్వులు: ఓం శూర్పకర్ణాయ నమః జాజీ పత్రం పూజయామి

ఇది జాజి అనే మల్లిజాతి మొక్క. ఇది అన్ని చోట్లా దొరుకుతాయి. ఇందులో సన్న జాజి, విరజాజి రెండు రకాలు కలవు. వీటి పువ్వుల నుంచి సుగంధతైలం తీస్తారు.

జాజి చర్మరోగాలనివారణకుమంచి దివ్యఔషదం. జాజిమొగ్గలతోనేత్రవ్యాదులునయంచేస్తారు. జాజి కషాయాన్ని రోజు తీసుకోవడంవలన క్యాన్సర్ నివారణ అవుతుందని చెపుతున్నారు.



17. దేవకాంచనం: ఓం సురాగ్రజాయ నమః గండకీ పత్రం పూజయామి

గండకీపత్రం అనగా దేవకాంచనం. దీని ఆకులరసం మూర్ఛ రోగాన్ని తగ్గిస్తుంది. అధికమూత్రాన్ని తగ్గిస్తుంది. థైరాయిడ్ వ్యాధికి చక్కని ఔషధం ఈ గండకీ పత్రం. దీని ఆకులు మొండి,దీర్ఘవ్యధులకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దగ్గు, జలుబులను తగ్గిస్తుంది.



18. జమ్మి: ఓం ఇభ వక్త్రాయ నమః శమీ పత్రం పూజయామి

శమీపత్రం అనగా జమ్మి ఆకు. తమకు విజయాలు వరించాలని విజయ దశమి రోజున ప్రజలు జమ్మి చెట్టు వద్దకు వెళ్ళి పూజలు చేసి, ఆ చెట్టు ఆకులను తీసుకు వచ్చి, పెద్దవారికి ఇచ్చి వారి ఆశీస్సులను తీసుకుంటారు. జమ్మి ఆకుల నుండి పసరు తీసి దానిని పుళ్ళు ఉన్న చోట రాస్తే కుష్టువ్యాధి నశిస్తుంది. కొన్ని జమ్మి ఆకులు, కొంచం చెట్టు బెరడు, రెండు మిరియాలు నూరి మాత్రలు చేసుకొని మజ్జిగతో వేసుకుంటే అతిసార వ్యాధి తగ్గుతుంది. జమ్మి చెట్టు బెరడు దగ్గు, ఆస్తమా లకు మందుగా పనిచేస్తుంది




19. రావి: ఓం వినాయకాయ నమః అశ్వత్థ పత్రం పూజయామి

అశ్వత్థ పత్రం అనగా రావిఆకు. రావి సాక్షాత్ శ్రీమహావిష్ణువు స్వరూపం. తులసిలేని ఇల్లు వేపలేని వీధి,రావిచెట్టులేని ఊరు ఉండదన్నది మన పెద్దల మాట. రావి ఆకులు హృదయసంబంధమైన రోగాలకు ఉపయోగిస్తారు.ఎండిన రావిపుల్లలను నేతితో కాల్చి భస్మం చేసి దానిని తేనెతో కలిపి తీసుకుంటే శ్వాస సంబంధవ్యాదులు నివారణ అవుతాయి.జీర్ణశక్తిని జ్ఞాపకశక్తిని పెపోదించే గుణం గల ఆకులు రావిఆకులు.



20.తెల్లమద్ది: ఓం సురసేవితాయ నమః అర్జున పత్రం పూజయామి

అర్జున పత్రం అనగా తెల్లమద్ది.మద్ది చెట్టు హృదయసంబంధిత రోగాలకు దివ్య ఔషదం.ఇది శరీరానికి చలువ చేస్తుంది. రక్తనాళాలను గట్టి పరుస్తుంది. ఆకుల రసం కురుపులను తగ్గిస్తుంది. ఈ అర్జునపత్ర బెరడు రుబ్బి ఎముకలు విరిగినచోట పెడితే తొందరగా నయం అవుతుంది. కీళ్ళనొప్పులు, మలాశయ దోషాల నివారణలో బాగా ఉపయోగపడుతుంది.



.

21.జిల్లేడు: ఓం కపిలాయ నమః అర్క పత్రం పూజయామి.

అర్కపత్రం అనగా జిల్లేడు. ఈ చెట్టు గణపతి స్వరూపం.రథసప్తమి రోజు జిల్లేడు పత్రాలు ధరించి నదీస్నానము చేస్తే చాలా పుణ్యమని హిందువుల నమ్మకం. పాలను పసుపుతో కలిపి ముఖానికి రాసుకుంటే ముఖవర్చస్సు పెంపొందుతుంది.లేత జిల్లేడు చిగుళ్ళను తాటి బెల్లంతో కలిపి కుంకుడు గింజంత మాత్రలుగా చేసి ఆ నాలుగు రోజులు ఉదయం ఒకటి, సాయంత్ర ఒకటి చొప్పున సేవిస్తే స్త్రీల బహిష్టు నొప్పులు తగ్గుతాయి.చర్మ సమస్యలను తగ్గిస్తుంది. శరీర సమస్యలకు ఉపయోగపదుతుంది. కీళ్ళ సమస్యలను తగ్గిస్తుంది. జిల్లెడుతో చేసిన నునె చేవుడుకు ఔషధం గా ఉపయోగపడుతుంది.ఇది రక్త శుద్ధిని చేస్తుంది.

"ఓం వరసిద్ధి వినాయక స్వామినే నమహః ఏక వింశతి పత్రాణి సమర్పయామి" అని పూజిద్దాము.




❖❖❖❖❖

# పౌరుషిణి

శ్రీమతి కమల పరచ, కాలిఫోర్నియా, అమెరికా

"మాధవాయ్ పెళ్ళాం పీయూసీ నే చదివిందిట" అని వినిపించిగానే, కొత్తపెళ్ళికూతురైన నన్ను చూసేందుకు వచ్చిన పేరంటాళ్ళ మధ్య తల వంచుకొని కూర్చున్న నేను చివుక్కున తల ఎత్తి చూసాను. అన్నావిడ ఎవరో తెలీదు కాని, అందరూ ముసిముసి గా నవ్వుకుంటూ ఉష్ . . .  ఉష్ అని ఆవిడకు సైగ చేయటము కనిపించింది. మాధవ అంటే ఎవరో కాదు మా ఏమండీ నే. ఆయనను ఇంట్లో మాధవా అని పిలుస్తారు. ఓరగా గోడ దగ్గర కుర్చీలో కూర్చున్న ఏమండీ వైపు చూసాను. ఆయన దవడ కండరం బిగుసుకుంది. ఏమి ఉపద్రవం జరుగుతుందో అని భయపడ్డాను కాని ఏమీ జరగలేదు. అమ్మయ్య అనుకున్నాను కాని అమ్మయ్య కాదు అని ఆ తరువాత నాలుగు నెలలకు తెలిసింది.

ఏమండి 1962 చైనా యుద్దం అప్పుడు ఎమర్జెన్సీ లో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం డిస్కంటిన్యూ చేసి ఆర్మీ లో, షార్ట్ సర్వీస్ కమీషన్ ఆఫీసర్ గా చేరారు. ఐదు సంవత్సరాలు సర్వీస్ అయ్యాక, ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యి, పర్మినెంట్ అయ్యారు. ఇంజనీరింగ్ పూర్తి కాలేదు కాబట్టి , పూనాలో ఒకటిన్నరసంవత్సరము, సికింద్రాబాద్ లో ఒకటిన్నర సంవత్సరమూ మిలిట్రీ ఇంజనీరింగ్ కాలేజ్ ట్రైనింగ్ ఇచ్చి, ఏ.యం.ఐ డిగ్రీ ఇచ్చారు. మేము మా పెళ్ళైన నాలుగు నెలలకు హైదరాబాద్ నుంచి ఏమండీ పని చేస్తున్న పటియాలా కు వెళ్ళి ఓ నెల హాపీగా డిల్లీ, ఆగ్రా, సిమ్లా అన్నీ తిరిగి, జూన్ లో ఒక పెద్ద నల్లపెట్టెలో వంట సామానులూ, ఇంకో పెద్ద నల్లపెట్టెలో ఏమండీ యూనిఫాంలూ, షూష్,బెల్ట్ లూ, ఒక సూట్కేస్ లో నా బట్టలూ, ఇంకో సూట్కేస్ లో ఏమండీ బట్టలతో కొత్త కాపురానికి పూనా వెళ్ళాము. వెళ్ళగానే మాకు క్వాటర్ దొరకలేదు. ఏమండిగారి పాత బాస్ కల్నల్. కుమార్ మాకు మెస్ లో టెంపరరీ ఎకామిడేషన్ ఏర్పాటు చేసి "ఒక్క నెలే కదా ఈ రెండు రూములల్లో సద్దుకోండి" అని చెప్పారు. రెండు రూములన్నపేరే కానీ పెద్ద పెద్ద గదులు. ఒకొక్కటి ఓ ఇల్లంత ఉన్నాయి. రెంటికి మధ్య ఆర్చ్ లా ద్వారం. తలుపులేదు. ఐతే ఏమి లే అనుకున్నాము. వెనుక వైపు సన్నటి వరండా. ముందు పెద్ద వరండా, ఎత్తైన రాతి గోడలు, ఎప్పుడో బ్రిటిష్ వారు కట్టిన బంగళా అది. రెండు పెద్ద పెద్ద చెక్క అలమారాలు, మంచాలు అన్ని హంగులూ ఉన్నాయి. అప్పుడే ఇంకో కోర్స్ ఆఫీసర్ కాప్టెన్. రామానుజం కు కూడా క్వాటర్ దొరక లేదని, ఒక్క నెలకు ఎవరు రెంట్ కు ఇస్తారని దిగులు పడుతుంటే ఏమండి వాళ్ళకో రూం ఇచ్చారు. ఇద్దరూ కలిసి చెక్క అలమారాని ఆర్చి మధ్యకు జరిపారు. ఇద్దరమూ చేరో రూం లో సద్దుకున్నాము.

అంతా సద్దుకోవటం అయ్యాక ఓ రోజు పొద్దున్నే ఏమండి బయటకు వెళుదామని తీసుకెళ్ళారు. ఎక్కడికా అని నేను అనుకుంటూ ఉండగానే, ఓ పెద్ద కాంపౌండ్ ముందు స్కూటర్ ఆపారు. ఏమిటా ఇది అని నేను తలేత్తి చూస్తే "వాడియా కాలేజ్ " అని పెద్ద బోర్డ్ కనిపించింది. లోపల అమ్మాయిలూ, అబ్బాయిలూ కబుర్లు చెప్పుకుంటూ, మహా స్టైల్ గా, తిరుగుతున్నారు. ఏమండి ఆఫిస్ రూం లోకి వెళ్ళి అప్లికేషన్ ఫారం

తీసుకొచ్చారు.  ఇద్దరమూ ఒక చెట్టు కింద అరుగు మీద కూర్చున్నాము. చుట్టూ అందరినీ చూస్తూ "ఈ ఫారం లు ఎందుకండి? ఇక్కడి కిఎందుకు వచ్చాము?" అని చిన్నగా అడిగాను.

"నీకే. నా డిగ్రీ పూర్తయ్యే వరకూ నీ డిగ్రీ కూడా అవుతుంది. ఇక్కడి నుంచి నీకు కూడా సెకెండ్ ఇయర్ లో, సికింద్రాబాద్ కు ట్రాన్స్ఫర్ చేయించుకోవచ్చు" అని చెపుతూనే చకచకా ఫారం పూర్తి చేసి , "ఇక్కడ సంతకం చేయి." అన్నారు.

అప్పటికే ఆ కాలేజ్ వాతావరణం చూస్తున్న నాకు వణుకు వస్తోంది. "అమ్మో ఇక్కడా, నేను చదవను. అబ్బాయిలను చూస్తుంటే భయం గా ఉంది." అన్నాను భయంభయం గా.

"ఏం ఎందుకు భయం. అబ్బాయిలేమన్న కొడతారా నిన్ను" అన్నారు .
"ఉమ్హూ వద్దు, నాకు భయమేస్తోంది. వెళ్ళిపోదాము" అన్నాను.
"ఐతే బి. యే చదవవన్నమాట. ఎప్పటికీ మాధవాయ్ పెళ్ళాం పి.యూ.సీ గా నే ఉంటావన్న మాట. నీ వల్ల కాదు చదవటం అంతేనా పద" అని సీరియస్ గా అంటూ లేచారు.
నాకు చక్ మంటూ పేరంటాళ్ళ మాట గుర్తొచ్చింది. దాని ఎఫెక్ట్ అన్నమాట ఇది. అంతే నాలోని పౌరుషిణి తలెత్తింది. పౌరుషిణి ఏమిటా? పౌరుషం తలెత్తింది అంటే బాగుండదని, నేను అమ్మాయిని కాబట్టి పౌరుషిణి అని కొత్త పదం కనిపెట్టా. పదం బాగుంది కదా పౌరుషంగా! ఏమండి చేయి పట్టుకొని ఆపాను. ఆయన చేతిలోని ఫారం ను తీసుకున్నాను. సంతకం చేసాను."పదండి ఆఫీస్ లో ఇద్దాము" అన్నాను.
నేను కాలేజ్ నుంచి వచ్చేసరికి, మిసెస్. వనజారామానుజం వేడివేడిగా అన్నం, సాంబార్, బీన్స్ కొబ్బరో, క్యాబేజ్ కొబ్బరో ఇలా వెరైటీ వెరైటీ గా కూరలూ వండి ఉంచేది. ఉష్ . . ఎవరికీ చెప్పకండి ఇది రహస్యం. మెస్ లో ఉన్నప్పుడు వండుకోకూడదు. ఏమి చేయాలి చెప్పండి నూనెలూ, మసాలాలూ ఓడుతుండే కూరలు, రొట్టెలు తినలేక ఎన్ని రోజులు ఉపవాసం ఉండి ఏమండీలతో చివాట్లు తిని బతకగలము! ఏమండీలకైతే అలవాటు కాబట్టి తినేసేవారు.మరైతే మెస్ నుంచి వచ్చిన భోజనం వేస్ట్ చేసారా అని కోపంగా చూడకండి. ఏమి చేసామంటే. . . అక్కడ పని చేసే స్వీపర్ లూ వాళ్ళూ అంతా సిపాయిలే కదా! వాళ్ళ తో ఇంట్లో పని చేయించుకోవటం ఏమండీకి ఇష్టం ఉండేదికాదు. అందుకని ఆ బెద్ద భూతం లాంటి గది, ఈ బ్రిటిషర్స్ షోకు కూల వాళ్ళు కట్టుకున్న పెద్ద బాత్ రూం, బాత్ టబ్ తో సహా కడుక్కొని, గిన్నెలు తోముకొని, రాత్రి వంట నా డ్యూటీ కాబట్టి వండి వార్చేసరికి చుక్కలు కనిపించేవి! అలా చుక్కలు చూస్తున్న ఓ రోజు నాన్నగారు ఫోన్ చేసి"ఎట్లా ఉన్నావమ్మా?"అని అడగటం ఆలశ్యం నాన్నగారూ ఇట్లా ఉన్నానండి అని బేర్ మన్నాను. పాపం పితృహృదయం భారమైపోయి వెంటనే గురువులు అని ఓ పనిపిల్లాడిని రైలెక్కించి పూనాకు పంపేసి భారం దింపుకున్నారు. గురువులు పని తో నేను వనజా హాపీ, మేము పెట్టే మసాలాకూరలతో వాడు హాపీ. ఇలా హాపీ హాపీ గా గడిచిపోతుండగా గురువులు నాయనమ్మ వాడి మీద బెంగెట్టుకోవటం తో వాడిని తిరిగి పంపక తప్పలేదు. వాడిని చూసి నోరెళ్ళబెట్టిన నాయనమ్మ "ఓరోరి నాయనా ఈడకంటే ఆడనే గుండులెక్కున్నావు కదా ఆడకే వెళ్ళు" అందిట కాని అప్పటికి మాకు క్వాటర్ దొరకటము, బోనస్ గా పనిమనిషి దొరకటము కూడా జరిగిపోయి వాడి వీసా రిజెక్ట్ ఐపోయింది.
చక్కగా రెండు బెడ్ రూంలూ, డ్రాయింగ్ కమ్ డైనింగ్, కిచెన్ ఫర్నీచర్ తో సహా ఎంత బాగుందో! అన్నట్లు ఓ చిన్న బాల్కనీ కూడా ఉంది. మా రెండు పెట్టల సామానులూ సర్దుకోగా బోలెడు జాగా మిగిలింది! మూడో రోజు సాయంకాలం కాప్టెన్ అండ్ మిసెస్ ఖన్నా వచ్చారు మా ఇంటికి. లోపలికి వస్తూనే ఖన్నా మా ఏమండి చేతులు పట్టుకొని "కుమార్, మాకు ఇంకా క్వాటర్ ఎలాట్ కాలేదు. రెండు మూడు నెలల్లో అవుతుంది. అప్పటి దాక నువ్వే మీ ఇంట్లో పెట్టుకోవాలి మమ్మలిని" అన్నాడు.
"వాకే డన్." అని అభయమిచ్చేసారు ఏమండి. ముచ్చటగా మూడోరోజు చుట్టాలొచ్చేసారు! మిసెస్. ఖన్నా పేరు పరిమళ. పరి అని పిలువు అందరూ అలాగే పిలుస్తారు అంది. పరి ఏయిర్ హోస్టెస్ గా జాబ్ చేస్తూ ఖన్నా లో ప్రేమలో పడి పెళ్ళి చేసుకొని, జాబ్ కు రిజైన్ చేసింది. మరి ఆ రోజులల్లో ఏయిర్ హోస్టెస్ పెళ్ళైతే జాబ్ మానేయాల్సిందే! చాలా స్టైల్ గా ఉండేది. ఉన్నట్లుండి ఓ రోజు ఏమండి పరి తో "మాలాకు కూడా మేకప్, హేర్ స్టైల్స్ , నీ లాగా సారీ కట్టుకోవటం నేర్పు" అన్నారు.
"అమ్మో! యాక్ ఆ లిప్ స్టిక్ లూ బాక్ కోంబింగ్ హేర్ స్టైలూ నేను చేసుకోను బాబూ. నేను నేర్చుకోను బాబూ" అన్నాను గుండెల మీద చేయి వేసుకొని.

"ఏం? ఎందుకు నేర్చుకోవు ? ఆ వంకర టింకర గా వేసుకునే జడ, చుట్టుకున్న చీర తో ఎప్పటికీ అట్లా అప్పలమ్మ లా ఉంటావా?" అన్నారు.

"మరి పెళ్ళైయ్యే వరకూ నేను జడ వేసుకోలేదు. అమ్మనే రెండు జడలు వేసేది. లంగా వోణీలు వేసుకునే దానిని. ఇప్పుడే గా చీరలు కట్టుకుంటున్నాను. ఒక్క జడ వేసుకుంటున్నాను. కొంచం అలవాటవుతే వస్తుందిగా" అన్నాను ఏడుపు గొంతుతో.

"అలవాటవ్వాలంటే నేర్చుకోవాలిగా. అంత గాడీగా ఏమీ చేసుకోనక్కర లేదు. కాస్త మంచి గా తయారవ్వటం నేర్చుకో అంటున్నాను. ఏం నేర్చుకోలేవా?" సవాల్ చేసారు.

ఇంకే ముంది పౌరుషిణి నిద్ర లేచింది. ఏమిటో ఏమండీ నా పౌరుషిణి  పని పడతారు ఎప్పుడూ. అదో అట్లా నాలోని బ్యూటిషియన్ కు అంకురార్పణ జరిగింది.

పూనా నుంచి సికింద్రబాద్ రాగానే,  ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్ తెచ్చుకొని హైదరాబాద్ లో బి.యే సెకెండ్ ఇయర్ లో చేరటమూ, మా అమ్మాయి పుట్టటమూ జరిగిపోయాయి. ఇక్కడ నాకు ఒక ప్లస్ పాయింట్ ఏమిటయ్యా అంటే, తెలంగాణా ఎజిటేషన్ మూలం గా ఎకడమిక్ ఇయర్ డిసెంబర్ లో మొదలయ్యింది జూన్ కాకుండా. దానితో నాకు మా అమ్మాయి పుట్టినప్పుడు సంవత్సరం ఆగకుండా ముందుకు జరిగిందన్నమాట. ఐతే నేమి ఆపరేషన్ సక్సెస్-పేషంట్ డైడ్ లో చెప్పానుగా ఝూటర్ ఢమాల్ ఎందుకయ్యిందో! మళ్ళీ మళ్ళీ ఎందుకు లెండి పాండిందే పాటరాలా కోర్స్ ఐపోగానే! ఏమండీకి షిలిగురి పోస్టింగ్ వచ్చింది. అప్పటికి అది ఇంకా పాకిస్తాన్ యుద్ద వాతావరణం లోనే ఉండటం తో కుటుంబాలను ఎలవ్ చేయలేదు. దగ్గరలోని డార్జిలింగ్ లో ఉండనిచ్చేవారు. ఏమైనా నా బి.యే పూర్తి చేయాలిగా అందుకని హైదరాబాద్ లోనే ఉండిపోయాను. మళ్ళీ మిగిలిన రెండు సబ్జెక్ట్ లూ చాలా సీరియస్ గా చదివి పరీక్ష రాసాను. పాపం అప్పుడూ మా మాస్టారుగారు నేను ట్యూషన్ చెపుతానండి అని వచ్చారు కాని ఏమండీగారు సున్నితంగా వద్దని చెప్పి నన్ను రక్షించారు! కాకపోతే ఒక పేపర్ ఔట్ ఆఫ్ సిలబస్ వచ్చింది. అది పోస్ట్ పోన్ అయ్యిది. నా సహనన్ని పరీక్షిస్తూ రెండు నెలల తరువాత ఆ పేపర్ పెట్టారు. నేను చాలా దీక్షగా చదువుకుంటూ ఉండగా, ఓ రోజు "హాయ్ మాతే నాకింక బోర్ కొడుతోంది. నేను వచ్చేస్తున్నా" అన్నాడు నా సుపుత్రుడు.

"అంత హడావిడేమిట్రా బేటా? నువ్వు రావటానికి ఇంకా ఇరవై రోజులు ఉంది కదా. పోనీ ఓ నాలుగురోజులు సర్దుకోరా" అన్నాను.

"ఉహ్హూ, ఇంక నీ బొజ్జలో ఉండలేను. మాలామమ్మీ వచ్చేసా  బాత్ ఖతం -బర్కాస్ బిరియానీ. గుడ్ మార్నింగ్" అని ఎంట్రీ ఇచ్చేసాడు. ఏం పిల్లల్లో మహా అల్లరిపిల్లలు అని మురిపెంగా అనుకొని  ఇంకేమి చేస్తాను ఏదో ముప్పతిప్పలూ పడి డెలివరీ ఐన మూడోరోజు పరీక్ష రాసి, బి.యే పట్టా పుచ్చేసుకుని, ఏమండీ చేతికి భక్తిగా అందించి, "మాధవాయ్ పెళ్ళాం పి.యు.సీ కాదు, గ్రాడ్యుయేట్" అన్నాను నవ్వుతూ.

ఏమండీ హాపీ. మంచి సంబంధం వచ్చిందని పి.యూ.సీ తో ఆపి పెళ్ళి చేసాము అని అప్పుడప్పుడు నా చదువు గురించి బాధ పడుతున్న అమ్మానాన్నగారు హాపీ. అమ్మయ్య అని మీరూ హాపీ అయిపోకండి నా చదువు అప్పుడే పూర్తి కాలేదు. ఆ తరవాత నా చదువు సంగతి నెక్స్ట ఎపిసోడ్ లో వినండి. ఇప్పటికిది సశేషం!

శ్రీమతి ప్రసూన రవీంద్రన్, హైద్రాబాద్



ఓటొజ్జ గణపయ్య! నీ బంటు నేనయ్య!

❖❖❖❖❖




❖❖❖❖❖

# సంగీత నాదామృతం

డా. పద్మ మల్లెల, సిడ్నీ



గత సంచికలో మనం సంగీత పరిణామ క్రమంలో సామగానం తదితర అంశాలను తెలుసుకున్నాం. అయితే వేదకాలం తరువాత సంస్కృత పరిణామ క్రమంలో సంగీతం కన్నా ముందు కవిత్వం ప్రధానంగా ఉండేది. ఉదాహరణకి రామాయణంలో పాత్రలు పాట పాడటం తరువాత శ్రీ కృష్ణుడి వేణుగానం, సరస్వతీ అమ్మవారు మరియు నారదుడి వీణ వంటి వాటి ప్రస్తావన కనపడుతుంది. కానీ ఇదమిత్థంగా ఎలా పాడేవారు ఏమి పాడే వారు అనే దాఖలాలు లేవు. ఇక 3 , 4 శతాబ్దాలను epic period of poetry అని అంటారు. ఈ సమయంలో ఉదాహరణకి కాళిదాసు రచించిన కుమారసంభవం, రఘువంశం అభిజ్ఞాన శాకుంతలం వంటి కావ్యాలు ఉద్భవించాయి. అయితే ఇటువంటి కావ్యాల్లోని పద్యాలు శ్లోకాలను ఇప్పటి లాగా చదవటం కాకుండా పాడటం జరిగేది. తరువాత 6, 7 శతాబ్దాలలో భక్తి ఉద్యమం తో తమిళ్ళం లో శైవ సంప్రదాయంలోతేవారాలు వైష్ణవ సంప్రదాయం లో పాసురాలు తరువాత సంస్కృత సంప్రదాయం లో నామ సంకీర్తనలు వచ్చాయి.దరిమిలా 12 వ శతాబ్దం లో గత సంచికలో మనం చర్చించుకున్న జయదేవ అష్ట పదులు సంగీతప్రపంచంలో మొదటి రచనలుగా చెప్పుకోవచ్చు. ఇక్కడ శ్రీ జయదేవ కవి జీవిత చరిత్ర గురించి కొంత తెలుసుకుందాం. వీరి తండ్రి భోజదేవుడు తల్లి రామాంబ. వీరు ఒరిస్సా లోని దిందుబిల్వం అనే గ్రామంలో జన్మించారు. ముందు సంచికలో చెప్పుకున్నట్టు ఈయన రచించిన గీత గోవిందం లో 24 అష్టపదులున్నాయి. ఇందులో 19 వ అష్టపది అయిన "వదసియది కించిదపి" అనే దానిలో 'స్మరగళ ఖండనం మమ శిరసి మండనం' అనే వాక్యాలు రాసే టప్పుడు ఆ కూర్పు నచ్చక నదికి స్నానానికి వెళ్ళి వచ్చే సరికి శ్రీ కృష్ణ భగవానులు వచ్చి అవే వాక్యాలు వ్రాసి వెళ్ళారట.

జయదేవుల వారు తత్వచింతామణి, ప్రసన్న రాఘవ నాటకం మొదలయిన అనేక గ్రంధములు రచించారు. ఈయన గురువుగారు శ్రీ గోవిందాచార్యుల వారు. ఇక ఈయన రచించిన అష్టపదులలో పల్లవి 8 చరణాలు ఉంటాయి.8 అంటే అష్ట చరణాలు ఉన్నాయి కనుక వీటిని అష్టపదులు అంటారు. ఇవి గీత గోవిందం కావ్యంలో ఉన్నాయి. ఈ తరహా లోనే అష్టపదులు రచించిన వారు శ్రీ రామకవి రచించిన రామాష్టపదులు పరివ్రాజకాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ వారు రచించిన శివాష్ట పదులు చెప్పుకో తగినవి. జయదేవ కవి శార్ఙ్గదేవుల కాలానికి చెందినవారు. శార్ఙ్గదేవులు సంగీత రత్నాకరం అనే సంగీత లక్షణ గ్రంథాన్ని రచించి సంగీత శాస్త్రానికి పునాది వేసిన మహనీయులు.వీరు 1175 నుండి 1247 మధ్య కాలంలో జీవించారు. వీరు మహారాష్ట్ర లోని దేవగిరి రాజధానిగా పాలించిన యాదవ రాజు సింగన్న గారి ఆస్థానంలో ఉండేవారు.సంగీత రత్నాకరం లో మొత్తం 7 అధ్యాయాలు ఉన్నాయి. స్వరగతాధ్యాయము, రాగవివేకాధ్యాయము, ప్రకీర్ణకాధ్యాయము, ప్రబంధాధ్యాయము, తాళాధ్యాయము అనే 6 అధ్యాయాలు సంగీతానికి సంబంధించినవి.7వ అధ్యయాయమైన నర్తనాధ్యాయము నాట్యానికి సంబంధించినది. సంగీత రత్నాకరం సంగీత శాస్త్రానికి సంబంధించిన భగవద్గీతగా పేర్కొనవచ్చు. తరువాత సంగీత పరిణామక్రమంలో చెప్పుకోతగిన వారు అన్నమాచార్యుల వారు. వీరు 14 వందల శతాబ్దానికి చెందిన వారు. ఈయన తమ సంకీర్తనల ద్వారా కీర్తన అనే ఈ నాటి సంగీత రచనకు శ్రీకారం చుట్టిన తొలి వాగ్గేయ కారులు. ఇక్కడొక విషయం చెప్పుకోవాలి. జయదేవ కవి మరియు అన్నమాచార్యుల వారి సమయం నుండి కవిత్వం నుండి సంగీతం విడిగా ఒక స్వీయ స్థానాన్ని సమకూర్చుకుందని చెప్పవచ్చు. ఒకరకంగా కవిత్వం సామాన్యులకు అందించే ప్రయత్నం లో పద కవిత్వం ఆవిర్భవించింది. దీనికి ఆద్యులు అన్నమాచార్యుల వారు. అందుకే ఆయనను పదకవితా పితామహుడని అంటారు. అన్నమాచార్యుల వారు 1408 వ సంవత్సరంలో శ్రీ నారాయణ సూరి లక్కమాంబ దంపతులకు జన్మించారు.వీరు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అనుగ్రహంతో జన్మించారు. వీరు బాల్యం నుంచి వేంకటేశ్వర స్వామి వారి గురించి అనేక కీర్తనలు పాడుతూ ఉండేవారు. వీరు 36000 సంకీర్తనలను రచించి ఇప్పుడు కర్ణాటక సంగీతంలో ఉన్నకీర్తన అనే ఒక సంగీత రచనకు పునాది వేసిన మహానుభావులు. ఈయన రచనలలో పల్లవి, అనుపల్లవి మరియు చరణం అనే చక్కని structure ఏర్పరిచి సంగీతానికి ఒక క్రమ పద్ధతి ఏర్పరిచిన మార్గదర్శకులు. వీరి గురించి తరువాతి సంచికలలో ఇంకా క్షుణ్ణంగా తెలుసుకుందాం. ఇక ఈ నెల విశిష్టత అందరూ ఆత్రుతతో ఎదురుచూచే వినాయక చవితి సందర్భంగా దీక్షితుల వారి షోడశ గణపతి కీర్తనల మీద ఒక సమీక్ష చేసుకుందాం. సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ ముత్తు స్వామి దీక్షితుల వారు సముదాయ లేక గుచ్ఛ కృతులు రచించటం అనే ఒక ఒరవడిని ఏర్పరచారు. అటువంటి గుచ్ఛకృతులలో ఒక సముదాయం షోడశ గణపతి కృతులు. ఇవి ఆయన నివసించిన తిరువారూరు లోని త్యాగేశ్వర స్వామి వారి గుడిలో ఉన్న 16 గణపతుల మూర్తుల మీద రచించిన కృతులు. ఆయన మొత్తం 27 గణపతి కృతులు రాసినప్పటికీ ఈ 16 కృతులు బాల, తరుణ, భక్తి, వీర, శక్తి, ద్విజ, సిద్ధి, ఉఛ్చిష్ట,, విఘ్న, క్షిప్ర , హేరంబ, లక్ష్మీ, మహా, విజయ, మరియు ఊర్ధ్వ మొదలయిన గణపతుల మీద రచించిన రచనలు. అవి వరుసగా ఉఛ్చిష్ట గణపతి కాశిరామక్రియ(పంతువరాళి), ఏక దంతం బిలహరి, గజాననయుతం వేగవాహిని(చక్రవాకం), గణనాయకం రుద్రప్రియ, గణరాజేన ఆరభి, గణేశ కుమార జంఝూటి, కర కలభ ముఖం సావేరి, పంచమాతంగముఖ మలహరి, మహాగణపతిం నాట, మహాగణపతే నటనారాయణి, మహా గణపతిం తోడి, రక్త గణపతిం మోహన , లంబోదరాయ వరాళి, వల్లభనాయకస్య బేగడ, వాతాపి గణపతిం హంసధ్వని, వారాంత స్థిత అఠాణ , వినాయక విఘ్న నాశక వేగవాహిని, శక్తి సహిత శంకరాభరణం, శ్వేత గణపతిం చూడామణి, సిద్ధివినాయకం చామరం (షణ్ముఖ ప్రియ), హస్తి వదానాయ నవరోజు, శ్రీ గణ నాథం ఈశ మనోహరి, శ్రీ గణేశ పరాత్పరం ఆర్ద్రదేశి, శ్రీ మహా గణ పతి రవతుమాం గౌళ, శ్రీ మూలాధార శ్రీ, విఘ్నేశ్వరం మలహరి, హేరంభాయ అఠాణ మొదలయిన రాగాలలో విరించించారు.

వాటి లో మనందరికీ చిర పరిచితమైన హంసధ్వని రాగంలోని వాతాపి గణపతింభజే అనే కృతి తిరువారూర్ దగ్గరలో ఉన్న తిరుచెన్కట్టన్కుడి అనే ప్రదేశంలో ఉన్న శివుడి గుడి లో ఉన్న గణేశుడి చిత్రాన్ని గురించి రాయబడింది. ఈ చిత్రం ముందు చాళుక్యుల రాజధాని అయిన బాదామి లో ఉండేది. ఆ చిత్రాన్ని దండయాత్రలో చాళుక్యుల పై పల్లవ రాజుల విజయానికి గర్తుగా పైన పేర్కొన్న గుడి కి తేబడింది. ముందుగా ఆకృతి సాహిత్యం :

**పల్లవి:** వాతాపి గణపతిం భజేహం వారణాస్యం వరప్రదం శ్రీ ॥వాతాపి॥

**అనుపల్లవి:** భూతాది సంసేవిత చరణం భూత భౌతిక ప్రపంచ భరణం

**మధ్యమ కాలం:** వీత రాగిణం వినత యోగిణం విశ్వ కారణం విఘ్న వారణం ॥వాతాపి॥

చరణం:

పురా కుంభ సంభవ ముని వర ప్రపూజితం త్రికోణ మధ్య గతం

మురారి ప్రముఖాద్యుపాసితం మూలాధార క్షేత్ర స్థితం

పరాది ఛత్వారి వాగాత్మకం ప్రణవ స్వరూప వక్రతుండం

నిరంతరం నిటల చంద్ర ఖండం నిజవామకర విధృతేక్షు దండం

మధ్యకాలం: కరాంబుజ పాశ బీజాపూరం కలుష విదూరం భూతాకారం

హరాది గురుగుహ తోషిత బింబం హంసధ్వని భూషిత హేరంబం ॥వాతాపి॥

ఈకృతి రచింపబడిన హంసధ్వని రాగం దీక్షితుల వారి తండ్రి గారయిన రామస్వామి దీక్షితుల వారు కర్ణాటక సంగీత లోకానికి పరిచయం చేశారు. ఇక పల్లవి యొక్క అర్థాన్ని పరిశీలిస్తే వరప్రదుడైన గజముఖం కలిగిన వాతాపి అంటే బాదామి లోని గణపతిని సదా భజిస్తున్నాను. అనుపల్లవి ని చూస్తే ఈచరాచర ప్రపంచానికి ఆధార భూతమై భూతగణాలన్నిటి చేత పూజింపబడే చరణుడైన ఆయన రాగద్వేషాలకు అతీతమైన పరమాత్ముడు. సకల విఘ్న హర్త అయిన ఆయన యోగులచే వినుతింపబడే విశ్వ కారణుడు. అటువంటి వాతాపి గణపతిని సదా భజిస్తున్నాను. చరణాన్ని పరిశీలిస్తే కుంభసంవుడైన అగస్త్యాది మునులచే పూజలందుకొనే ఆయన త్రికోణ మధ్యగతుడు. మూలాధార క్షేత్ర స్థితుడైన ఆయన విష్ణువు మొదలయిన ప్రముఖులచే ఉపాసింపబడుతాడు. ప్రణవ అంటే ఓంకార స్వరూపుడు వక్రతుండుడైన ఆయన పర ఆదిగా ఉండే 4 రకాలయిన వాక్కులకు ఆత్మస్వరూపుడు. వామ హస్తం లో చెరుకు ధరించి ఎల్లప్పుడు అర్ధ చంద్రుడిని కలిగి ఉంటాడు. తన కర కమలాల్లో పాశాన్ని ధరించి బీజాపూరుడు అయిన ఆయన కలుషాలను పోగొట్టి శివ షణ్ముఖుల చే పొగడ్తలు కొనే రూపం కలిగి హంసధ్వని రాగం చే రంజిల్లే హేరంబుడైన వాతాపి గణపతిని ఎల్ల వేళలా భజన చేస్తున్నాను.

ఇక్కడ హేరంభుడంటే కల్మషం లేని భక్తులను ఎల్లవేళల ఆదుకొనే వాడు. ఇక బీజాపూరం అంటే చాళుక్య రాజుల రాజధాని అయిన బీజాపూర్ లో వెలసిన తండ్రి.

గురుగుహ అనేది దీక్షితుల వారి ముద్ర. ఈయన రచనలలో రాగముద్ర ఉంటుంది అంటే ఒక రచన ఏ రాగం లో రచింప బడిందో ఆ రాగం పేరు రచనలో ఉంటుంది. ఉదాహరణకి ఈకృతి హంసధ్వని రాగం లో రచింప పడిందని 'హంసధ్వని భూషిత 'అనే చోట తెలుస్తుంది. కనుక పాఠకులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలతో సెలవు.

ముత్తుస్వామి దీక్షితుల వారి కీర్తన శ్రీమతి ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి గారి గళంలో క్రింద లింకులో వినండి.

https://www.youtube.com/watch?v=pMFHfvLiBSc

❖❖❖❖❖



# బాలవాహిని

## తెలుగు సామెతలు

- అందని ద్రాక్ష పండ్లు పుల్లన
- అంధునికి అర్థం చూపినట్లు
- అగ్నిలో ఆద్యం పోసినట్లు
- అజీర్ణానికి ఆకలి మెండు
- అట్నుంచి నరుక్కు రమ్మన్నారు
- అడుసు తొక్కనేల కాలు కడగనేల
- అనువుగానిచోట అధికుల మనరాదు
- అప్పు లేకపోతే ఉప్పు గంజి అయినా మేలు
- అరచేతిలో వైకుంఠం చూపినట్లు

## వేమన శతకం

ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు
చూడ చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినుర వేమ

మేడి పండు చూడ మేలిమై యుండును
పొట్టవిచ్చి చూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ వినుర వేమ

బుల్లి భీముడికి రంగులు అద్దండి చిన్నారులు –




## బుల్లి బుజ్జాయిలు తెలుగు అక్షరాలు నేర్చుకుందామా...

| | | |
|---|---|---|
| అ<br>A | ఆ<br>AA | ఇ<br>I |
| 4<br>ఈ<br>EE | 5<br>ఉ<br>U | 6<br>ఊ<br>OO |
| 7<br>ఎ<br>E | 8<br>ఏ<br>AE | 9<br>ఐ<br>AI |
| 10<br>ఒ<br>O | 11<br>ఓ<br>OA | 12<br>ఔ<br>AU |
| 13<br>అం<br>AM | 14<br>అః<br>AH | 15<br>క<br>KA |
| 16<br>ఖ<br>KHA | 17<br>గ<br>GA | 18<br>ఘ<br>GHA |

| | | |
|---|---|---|
| ఙ<br>GNA | చ<br>CHA | ఛ<br>CHHA |
| 22<br>జ<br>JA | 23<br>ఝ<br>JHA | 24<br>ఞ<br>INI |
| 25<br>ట<br>TA | 26<br>ఠ<br>THA | 27<br>డ<br>DA |
| 28<br>ఢ<br>DHA | 29<br>ణ<br>NA | 30<br>త<br>TA |
| 31<br>థ<br>THA | 32<br>ద<br>DA | 33<br>ధ<br>DHA |
| 34<br>న<br>NA | 35<br>ప<br>PA | 36<br>ఫ<br>PHA |
| 37 | 38 | 39 |

| | | |
|---|---|---|
| 7<br>బ<br>BA | 38<br>భ<br>BHA | 39<br>మ<br>MA |
| 0<br>య<br>YA | 41<br>ర<br>RA | 42<br>ల<br>LA |
| 3<br>వ<br>VA | 44<br>శ<br>SHA | 45<br>ష<br>SHA |
| 6<br>స<br>SA | 47<br>హ<br>HA | 48<br>ళ<br>LA |
| 9<br>క్ష<br>KSHA | 50<br>ఱ<br>RA | |

## అలనాటి అందాల నటుడు అక్కినేని



రేలంగి వెంకట్రామయ్య తన పాత సైకిల్ మీద చెన్నపట్నంలో జరిగే రోజుల్లో అంటే దాదాపు 1948 సంవత్సరంలో అక్కినేని నాగేశ్వరరావు కూడా సైకిల్ మీద తిరిగేవారు. అది కొత్త రాలీ సైకిల్. అప్పటికే ఆయన తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయం. ఆయన సీతారామ జననం, మాయ లోకం, ముగ్గురు మరాఠీలు, రత్నమాల, పల్నాటి యుద్ధం చిత్రాల్లో నటించి ఉన్నారు. బాలరాజు చిత్రం విడుదలై విజయ దుందుభి మోగిస్తోంది. అందులో ఆయన పదహారణాల ముఖ్య పాత్రలో నాయకుడుగా అక్కినేని నటించారు.

ఆ రోజుల్లో ఫోన్ చేయటం కోసం పాండీ బజార్ వచ్చి గీతా కేఫ్ నుంచి ఫోన్ లో మాట్లాడుతూ ఉండేవారు. ఆ గీత కేఫ్ ఇప్పటికీ ఉంది. ఆయన సైకిల్ దిగి లోపలికి వెళ్తున్నప్పుడు, వస్తున్నప్పుడు అందరి చూపు ఆయన మీదనే ఉండేది. తెల్లటి పంచె, జుబ్బాలో అసలు సిసలైన తెలుగు కట్టు, ఒత్తయిన జుట్టు, రిమ్ లెస్ కళ్ళద్దాలతో అందరి దృష్టిని ఆకర్షించే వారు.

సెప్టెంబర్ 20వ తేదీ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకాలతో ఈ లింకు ద్వారా ఈ సన్నివేశం వీక్షించండి.

https://www.youtube.com/watch?v=W7xbK45kCpY



# తెలుగువాణి

## Radio 2TripleO FM 98.5MHz

*8 -10AM on Saturday – Sydney Time*
*2.30 -4.30 AM on Saturday - India Time*
*(Please check for equivalent Local time@ your place)*

*Listen to Teluguvani on Radio 2Triple O FM 98.5MHz or DAB 985 or Listen audio by dialing: +61 2 8080 5650 Or Tunein App on Android / iPhone*

*Mrs Raja Tallapragada – Convener*

*Mr Chandrasekhar Raghavaraju -Coordinator*

*Mr Sai Gollapudi - Coordinator*

*For sponsorship and other details contact : Convener on 0422 953 668 or*

*Email: vani@sydneytelugu.org*

*Follow the links below :*

*https://Radio2tripleo.com.au*
*http://s7.viastreaming.net/8500/m*
*https://www.facebook.com/telugu.vani.52*

ఈవారం ప్రశ్న సమాధానం: *Please click the link below:*
*https://www.sydneytelugu.org/resources/evaram-prasna*

❖❖❖❖❖



# ఇండియా వీసా – అంటేనే మహా ప్రయాస

----వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్, USA

మొన్నీ మధ్య అత్యవసరంగా మా ఆవిడా, అమ్మాయీ అర్జంటుగా ఇండియా వెళ్ళ వలసి వచ్చింది. ఇండియా వెళ్ళడం ఎంత కష్టమో రావడం కూడా అంతే కష్టం అని మాకు మరొక సారి తెలిసి వచ్చింది. నేను అమెరికా వచ్చిన కొత్తలో ...అంటే విమానం టిక్కెట్లు కాగితాల మీదే కార్బన్ పేపర్ పెట్టి టైపు కొట్టి ఇచ్చే రోజుల్లోనూ, టెలిఫోన్ సదుపాయాలు అక్కడక్కడా మాత్రమే ఉండే రోజులూ, కంప్యూటర్ అనేది ఇంకా బ్రహ్మ పదార్థం గానూ, బొంబాయి, ఢిల్లీ విమానాశ్రయాలు అగ్గి పెట్టెల సైజులో ఉండి కష్టమ్స్ వాళ్ళు మమ్మల్ని విపరీతమైన కష్టమ్స్ పెట్టి కనీసం రెండు మందు బాటిళ్ళు, ఒక త్రీ ఇన్ వన్నూ, నాలుగు పెన్నులూ, వీలుంటే పాకెట్ సైజ్ కేలుక్యులేటర్ మా సూట్ కేసుల్లోంచి లాగేసుకుని వెయ్యి రూపాయలు జేబులో పెడితే కానీ మమ్మల్ని బయటకి వెళ్ళనివ్వని రోజుల్లో ఇండియా ప్రయాణం అనగానే ఏడాది పాటు పోగేసి దాచుకున్న డబ్బు, గంటల లెక్కలో శలవు దినాలు లెక్క పెట్టుకుని నానా ప్రయాసా పడేవాళ్ళం. అయితే ఇంటికి వెళ్ళగానే అమ్మా, నాన్న గారూ, అప్ప చెల్లెళ్ళు, అన్నదమ్ములు, "నాకేం తెచ్చావ్?' అంటూ గుమిగూడిన బంధువులు, స్నేహితులు....ఇలా అందరినీ చూడగానే ఆ ప్రయాణం తాలూకు శ్రమ అంతా మర్చిపోయే వాళ్ళం. మమ్మల్ని ఫారిన్ రిటర్న్డ్ అనే వారు. ఈ ఎన్నారై అనే మాట మాకు తెలియదు.

ఇప్పుడు పరిస్థితులు మారాయి. అమ్మా, నాన్న, అన్నదమ్ములూ, అప్ప చెల్లెళ్ళు స్నేహితులు, బంధువులూ ఉన్నా మనల్ని ఫారిన్ రిటర్న్డ్ గా చూడ్డం ఎప్పుడో మానేశారు. మనల్ని ఆహ్వానించడానికి విమానాశ్రయం రావడం కూడా అపురూపమే. ఒక వేళ వచ్చినా "ఏరా, పాపం అమెరికా నుంచి వచ్చావు. ఇదిగో ఈ పాతిక వేలు ఉంచుకో. ఇక్కడ వారం ఖర్చులకి ఉపయోగ పడుతుంది" అని ఎన్నారైల బీద తనం చూసి జాలిపడే రోజులు వచ్చేసాయి. "ఎప్పుడొచ్చావ్" ఎప్పుడు వెళ్తున్నావ్?" అనే పలకరింపులు వచ్చేశాయ్. "గుడ్ టు సీ యూ, మామయ్యా, సీ యు లేటర్" అంటూ పారిపోయే రోజులు వచ్చేశాయ్. ఇప్పుడు బొంబాయి, ఢిల్లీ మొదలైన విమానశ్రయాలు టోక్యో, దుబాయ్, షికాగోలకి ఏ మాత్రం తీసిపోవు. విమానం టిక్కెట్లు ఆన్-లైన్ లో మనమే కొనుక్కోవచ్చును. అంతా కంప్యూటర్ మయమే. ఎక్కడా కాగితం ముక్క అక్కర లేదు.

ఇలా ఎన్ని మార్పులు వచ్చినా ఇండియా ప్రయాణం లో ఇబ్బందులు మటుకు తగ్గ లేదు. దానికి ఉదాహరణ మొన్నటికి మొన్న మా అమ్మాయి, మా ఆవిడా ఇండియా ప్రయాణమే. మా ఆవిడకి ఇది వరకటి ఇండియా వీసా ఇంకా పనికొస్తుంది కాబట్టి పరవా లేదు. కానీ మా అమ్మాయికి అర్జంటుగా ఒక రోజులో ఇండియా వీసా కావాలి. ఇండియా కాన్సలేట్ వారి వెబ్ సైట్ లో చూస్తే అలాంటి అర్జంటు వీసా కావలసిన వారు ఇండియా దౌత్యకార్యాలయానికి వెళ్లి పొద్దున్న 11 గంటల లోపున $300 రుసుము కట్టి వీసాకి దరఖాస్తు చేస్తే అదే రోజు సాయంత్రం 4 గంటలకి వీసా ఇస్తారు అని సమాచారం ఉంది. ఇండియన్ కాన్సలేట్ మా హ్యూస్టన్ లోనే ఉంది కాబట్టి మా అమ్మాయి ఆఘమేఘాల మీద అక్కడికి పరిగెట్టింది. తీరా దరఖాస్తు ఫారం పూర్తి చేసి, 300 డాలర్ల నగదు ఇవ్వగానే ముందు నవ్వు మొహం పెట్టి తరువాత అక్కడ వాళ్ళు అదోలా మొహం పెట్టారు. "మీకు వీసా ఇవ్వలేం" అని అక్కడి ఆండాళ్ మా అమ్మాయి దరఖాస్తు తిరస్కరించింది. మా అమ్మాయి చేసిన పొరపాటు ఏమిటీ అంటే ..తను అమెరికాలో పుట్టి పెరగడం..ట.

నిర్ఘాంత పోయి "మరి ఇప్పుడు ఏం చెయ్యాలీ?" అని అడిగింది మా అమ్మాయి.

"మీ తల్లి దండ్రులు పాకిస్తానీ వాళ్ళా, ఇండియా వాళ్ళా?" అని అడిగింది ఆండాళమ్మ. మా అమ్మాయి పేరులో "లక్ష్మి" అని ఉంది. నాకు తెలిసీ పాకిస్తాన్ లో లక్ష్మి పుట్టే అవకాశం లేదు.

"మా నాన్న పేరు రాజు, మా అమ్మ పేరు గిరిజా లక్ష్మి. వాళ్ళది ఫలానా అంధ్ర ప్రదేశ్ లో కాకినాడ. నా పేరులో కూడా లక్ష్మి ఉంది. ఈ కారణాల వలన నేను పవిత్ర భారత దేశం వారి సంతతి నే అని మీకు అర్థం అయింది కదా, ఆండాళ్ ఆంటీ" అని మా అమ్మాయి విశదీకరించింది.

"అవును కానీ, ఈ అర్జంటు వీసా పాకిస్తాన్లో పుట్టిన వారికే కాదు, వారి సంతతికి కూడా ఛస్తే ఇవ్వం. నువ్వు భారతీయ సంతతికి చెందితే నీకు ఇస్తాం కానీ మీ అమ్మా, నాన్నల ఇండియా పాస్ పోర్ట్ లు కావాలి." ఆండాళ్ ఒకటో ఉవాచ

"వాళ్ళిద్దరూ అమెరికా వచ్చి 45 ఏళ్ళు అయింది. వాళ్ళవి అమెరికా పాస్ పోర్ట్ లు. 35 ఏళ్ల క్రితం అమెరికన్ సిటిజెన్ షిప్ తీసుకున్నాక ఇండియా పాస్ పోర్ట్ లు రద్దు అయ్యాయి. ఇప్పుడు లేవు." అంది మా అమ్మాయి.

"సరే. వాళ్ళు ఇండియాలో పుట్టినట్టు రుజువు కావాలి."-ఆండాళ్ రెండో ఉవాచ.

"అలా అని వాళ్ళ అమెరికన్ పాస్ పోర్ట్ లో ఉంటుంది కదా!" -మా అమ్మాయి రెండో సమాధానం.

"అదెల్లా ముడియాదు. వాళ్ళిద్దరి పుట్టినరోజు సర్టిఫికేట్ లు కావాలి" – ఆండాళ్ మూడో ఉవాచ.

"భలే దానివే. వాళ్ళు పుట్టినప్పుడు కంప్యూటర్లు లేవు. ఊరికి ఒక ఫోన్ ఉండేది. అలాంటి సర్టిఫికెట్లు లేవు కానీ జాతకాలు ఉన్నాయేమో?"- ఈ సారి నవ్వేసింది మా అమ్మాయి.

"సరే. వాళ్ళిద్దరికీ పెళ్లి అయినట్టు వాళ్ళ మేరేజ్ సర్టిఫికేట్ కావాలి. అదేదో ఇండియాలోనే కదా అవుత?" -అనుమానం గా ఆండాళ్ నాలుగో ఉవాచ.

"మేరేజ్ సర్టిఫికేటా? నేను ఎప్పుడూ అది చూడ లేదు కానీ ఉండే ఉంటుంది" అంది మా అమ్మాయి.

"ఆహ్.గుడ్....వెళ్లి పట్టుకునిరా"

అభయంఇచ్చిందిఆండాళ్

అప్పటికే సమయం 11 దాటింది. ఇంటికి వెళ్లి ఆ మేరేజ్ సర్టిఫికేట్ వెతికి మళ్ళీ రావడానికి గంటన్నర పడుతుంది. మరెలా? అని మా అమ్మాయి మధనపడుతూ ఉంటే...ఆండాళ్ మళ్ళీ తన మధుర గానం వినిపించింది. ఆండాళ్ కోకిల లా ఉంటుంది అని వేరే చెప్పక్కర లేదు.

"అన్నట్టు. నువ్వు వాళ్ళకే పుట్టినట్టు రుజువు కావాలి" -ఆండాళ్ ఐదో అస్త్రం.

"అంటే?"...మళ్ళీ నిర్ఘాంత పోయింది మా అమ్మాయి.

"ఆ మాత్రం తెలీదా? నీ పుట్టిన రోజు సర్టిఫికేట్ కావాలి. అందులో మీ అమ్మా, నాన్నల పేర్లూ ఉండాలి" –అండాళమ్మ జాలిగా ఆరో ఉవాచ.

అది వినగానే మా అమ్మాయికి ఒకానొక అతి ఘోరమైన అనుమానం వచ్చేసింది. ఇండియాలో అయితే ఎక్కడ చూసినా "ఫలానా శర్మ గారి నాలుగో అష్టావక్రుడు". లేదా "ఫలానా రెడ్డి గారి మొదటి జడ్డి కుమారుడు", లేదా "ఫలానా చౌదరి గారి కుంతీ కుమార్తె " అని ఎప్పుడూ తండ్రి పేరే రాస్తారు కానీ తల్లి పేరు ప్రస్తావించరు. అదే అమెరికాలో సరిగ్గా దానికి వ్యతిరేకంగా అవసరం అయితే తల్లి పేరు రాస్తారు కానీ తండ్రి ఎవరో చస్తే కమిట్ అవరు. అంచేత బర్త్ సర్టిఫికేట్ లో కేవలం తల్లి పేరు మాత్రమే రాసే అవకాశం ఉంది. తీరా తన పుట్టిన తేదీ సర్టిఫికేట్ లో అమ్మ పేరు ఒకటే ఉండి, నాన్న పేరు లేకపోతే తనకి ఇండియా వీసా రాదేమో అనే భయం పట్టుకుని మా అమ్మాయి ఇంచు మించు మూర్ఛ పోయే స్థితికి వచ్చి నాకు ఫోన్ చేసి ఈ తతంగం అంతా చెప్పింది. నేను కూడా ఈ నిబంధనలకి ఆశ్చర్య పోయాను. కానీ, నాకు మా కాన్సలేట్ జనరల్ గారు బాగానే తెలుసు కాబట్టి ఏమన్నా సహాయం చెయ్యగలడేమో అని ఆయనకి ఫోన్ చేశాను. ఈ రోజుల్లో పాకిస్తాన్ టెర్రరిస్ట్ ల నుంచి ప్రమాదం కారణంగా వీసా రూల్స్ కాస్త కఠినంగానే ఉన్నాయి అనీ ఆయన వివరించి అమెరికన్ సిటిజెన్స్ కి ఆన్ -లైన్ లో ఎలెక్ట్రానిక్ వీసా 48 గంటల్లో వస్తుందనీ అది వినియోగించుకోమనీ సలహా ఇచ్చారు.

దాంతో మా అమ్మాయి ఆండాళ్ గారి నిస్సహాయతకి తన సానుభూతి ప్రకటించి, ఇంటి కొచ్చి తన బర్త్ సర్టిఫికేట్ లో తన కన్నా తండ్రిగా నా పేరు కూడా ఉండడంతో సంతోషించిందో, నిట్టూర్చిందో ..అసలు ఏమనుకుందో తెలియదు కానీ, ఆ సమస్యకి తెర పడగానే ఆన్ -లైన్ లో వీసా సంపాదించుకుని ఒక రోజు ఆలస్యంగా తనూ, మా ఆవిడా ఇండియా వెళ్ళారు. అదే ఒక తెల్ల, నల్ల వగైరా అమెరికన్లకి అర్జంటు వీసాలు బహుశా అర్జంటుగా అర గంటలోనో లేదా 15 రోజుల్లోనే ఇస్తారేమో తెలియదు.

మొత్తానికి మా ఆవిడా, మా అమ్మాయీ, డాలస్ నుంచి మా పెద్ద బావ మరిదీ మద్రాసు విమానాశ్రయంలో దిగేటప్పటికి తిరుపతిలో మా అత్త గారు పోయారు. ఆఖరి చూపులు దక్క లేదు. దేహ దర్శనం దక్కింది. మా పిల్లలు ముగ్గురికీ వాళ్ళ అమ్మమ్మ అంటే ప్రాణం. ఆవిడ మరణంతో మా కుటుంబంలో మా పై తరం అంతరించింది. నాలుగు నెలల క్రితం ఆరోగ్యం సహకరించక పోయినా మా అత్త గారు పంతం పట్టి అమెరికా వచ్చి తన ఏకైక ముని మనవరాలు....అంటే మా మనవరాలిని చూసి మనసారా ఆశీర్వదించి వెళ్లి పోయారు. ఇప్పుడు నిజంగానే వెళ్ళిపోయారు. ఇవాళే..అంటే మార్చ్ 1 నాడే మా మనవరాలి మొదటి పుట్టిన రోజు. జీవితం అలా కొనసాగుతూ ఉంటుంది. లైఫ్ గోస్ ఆన్....

❖❖❖❖❖

## వరసిద్ధి వినాయకుడు



చిత్తూరు జిల్లాలో, చిత్తూరుకు పది కిలోమీటర్ల దూరంలో కాణిపాకం కలదు. ఇక్కడ వరసిద్ధి వినాయక ఆలయం ఉంది. ఇక్కడ విఘ్నేశ్వరుడు స్వయంభువు. కాణిపాకం లో వెలసిన ఈ వినాయకునికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ దేవుడు సర్వాంగ సమేతంగా పెరుగుతుంటారు. దీనికి ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి స్వామి వారికి 50 సంవత్సరాల క్రితం వెండి కవచం ప్రస్తుతం సరిపోవటం లేదు. విగ్రహం నీటిలో కొద్దిగా మునిగి ఉంటుంది ఎంత త్రవ్వినా స్వామివారి తుది మాత్రం కనుగొనలేకపోయారు.

సత్యప్రమాణాల దేవుడైన కాణిపాకం విఘ్నేశ్వరుడి ముందు ప్రమాణం చేయడానికి అబద్ధీకులు సిద్ధం కారు. కాణిపాకంలో ప్రమాణం చేస్తారా? అంటూ సవాల్ విసురుతారు. ఇక్కడ చేసిన ప్రమాణాలకు బ్రిటిష్ కాలంలో న్యాయస్థానాలలో కూడా ప్రామాణికంగా తీసుకునేవారు.

ఎన్నికల ప్రచారానికి ముందు రాజకీయ నాయకులు ఈ గణపతి దీవెనలు అందుకని ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తారు. గుడి ముందు పెద్ద కోనేరు ఉంది. ఈ ఆలయం దినదిన ప్రవర్ధమానంగా ప్రసిద్ధి చెందుతోంది. ఇక్కడ యాత్రికులకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి సత్రం కూడా కలదు. దగ్గరలో శ్రీ వేంకటేశ్వరుని ఆలయం కలదు.

❖❖❖❖❖


WESTMEAD
DOCTORS
GENERAL PRACTICE
Telugu and
Hindi speaking
Female GPs
Male GPs
ALLIED HEALTH
Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian
SPECIALISTS
Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist
ONSITE PATHOLOGY
Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD
PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU
Open 7 days
BULK BILLING AVAILABLE



**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing

OPEN 7 DAYS


New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm


G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au



# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are finishing times and Varjyam is start and finish times - Standard or Daylight Savings Time (AEST/AEDT) as applicable in Australia.

## సెప్టెంబర్ 2021

ప్లవ శ్రావణ బ నవమి నుండి
భాద్రపద బ అష్టమి

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిధి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

**Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>R - 16:30 to 18:30 | **బడి సెలవులు**<br>విక్టోరియా - 18 సెప్టెంబర్ నుండి 03 అక్టోబర్<br>NSW - 20 సెప్టెంబర్ నుండి 01 అక్టోబర్ | **5**<br>బ త్రయోదశి 12:46<br>ఆశ్లేష 22:38<br>వర్జ్యం 11:16 వ 12:54 | **12**<br>శు పంచమి 0:0<br>శు షష్ఠి 21:44<br>విశాఖ 14:14<br>వర్జ్యం 18: 0 వ 19:31 | **19**<br>శు త్రయోదశి 10:28<br>ధనిష్ఠ 7:54<br>వర్జ్యం 15:7 వ 16:43 | **26**<br>బ పంచమి 17:32<br>కృత్తిక 19:4<br>వర్జ్యం 5:36 వ 7:23 |
| **సోమ**<br>R - 7:30 to 9:30 | **సెలవు దినాలు**<br>05 - మహాలయ పక్షం<br>10 - వినాయక చవితి<br>24 – AFL గ్రాండ్ ఫైనల్ | **6**<br>బ చతుర్దశి 12:4<br>మఖ 22:21<br>వర్జ్యం 10:30 వ 12:4 | **13**<br>శు సప్తమి 19:34<br>అనురాధ 12:53<br>వర్జ్యం 18:10 వ 19:41 | **20**<br>శు చతుర్దశి 9:53<br>శతభిషం 7:58<br>వర్జ్యం 14:30 వ 16:8 | **27**<br>బ షష్ఠి 20:6<br>రోహిణి 22:8<br>వర్జ్యం 13:7 వ 14:55 |
| **మంగళ**<br>R - 15:00 to 16:30 | | **7 ●**<br>బ అమావాస్య 10:49<br>పుబ్బ 21:38<br>వర్జ్యం 6:7 వ 7:40 | **14**<br>శు అష్టమి 17:32<br>జ్యేష్ఠ 11:33<br>వర్జ్యం లేదు | **21 ●**<br>శు పూర్ణిమ 9:45<br>పూర్వాభాద్ర 8:28<br>వర్జ్యం 18:32 వ 20:13 | **28**<br>బ సప్తమి 22:43<br>మృగశిర పూర్తి<br>వర్జ్యం 4:28 వ 6:16 |
| **బుధ**<br>R - 12:00 to 13:30 | **1** శ్రావణం<br>బ నవమి 8:49<br>మృగశిర 17:4<br>వర్జ్యం లేదు | **8** భాద్రపదం<br>శు పాడ్యమి 9:1<br>ఉత్తర 20:25<br>వర్జ్యం 4:28 వ 5:59 | **15**<br>శు నవమి 15:46<br>మూల 10:23<br>వర్జ్యం 8:52 వ 10:23<br>వర్జ్యం 19:38 వ 21:10 | **22**<br>బ పాడ్యమి 10:13<br>ఉత్తరాభాద్ర 9:37<br>వర్జ్యం 22:25 వ 0:8 | **29**<br>బ అష్టమి పూర్తి<br>మృగశిర 1:15<br>వర్జ్యం 10:34 వ 12:21 |
| **లక్ష్మి**<br>R - 13:30 to 15:00 | **2**<br>బ దశమి 10:41<br>ఆరుద్ర 19:25<br>వర్జ్యం 2:17 వ 4:2 | **9**<br>శు విదియ 6:55<br>హస్త 18:57<br>వర్జ్యం 4:18 వ 5:48 | **16**<br>శు దశమి 14:3<br>పూర్వాషాఢ 9:30<br>వర్జ్యం 17:13 వ 18:46 | **23**<br>బ విదియ 11:21<br>రేవతి11:13<br>వర్జ్యం లేదు | **30**<br>బ అష్టమి 0:55<br>ఆరుద్ర 3:53<br>వర్జ్యం 16:56 వ 18:40 |
| **శుక్ర**<br>R - 10:30 to 12:00 | **3**<br>బ ఏకాదశి 12:8<br>పునర్వసు 21:8<br>వర్జ్యం 8:16 వ 9:59 | **10**<br>శు తదియ 4:44<br>చిత్ర 17:26<br>వర్జ్యం 2:26 వ 3:56<br>వర్జ్యం 22:39 వ 0:8 | **17**<br>శు ఏకాదశి 12:37<br>ఉత్తరాషాఢ 8:40<br>వర్జ్యం 12:34 వ 14:8 | **24**<br>బ తదియ 12:53<br>అశ్విని 13:23<br>వర్జ్యం 9:1 వ 10:46 | **సిడ్నీ**<br>సూర్య ఉ అ<br>1 6:13 17:37<br>8 6:04 17:41<br>15 5:54 17:46<br>22 5:45 17:51<br>29 5:35 17:56 |
| **శని**<br>R - 09:00 to 10:30 | **4**<br>బ ద్వాదశి 12:51<br>పుష్యమి 22:17<br>వర్జ్యం 5:31 వ 7:12 | **11**<br>శు చవితి 2:22<br>స్వాతి 15:48<br>వర్జ్యం 21:2 వ 22:31 | **18**<br>శు ద్వాదశి 11:18<br>శ్రవణం 8:5<br>వర్జ్యం 12:3 వ 13:38 | **25**<br>బ చవితి 14:59<br>భరణి 16:7<br>వర్జ్యం 0:4 వ 1:51 | **మెల్బోర్న్**<br>సూర్య ఉ అ<br>1 6:42 19:58<br>8 6:31 18:04<br>15 6:20 18:10<br>22 6:09 18:16<br>29 5:59 18:22 |

**suklam baradharam vishnum sasi varnam chaturbhujam |**
**prasanna vadanam dhyayeth sarva vighnopa santhaye ||**


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

## తెలుగు వాహిని పాఠకుల స్పందన

జాతీయ జండాతో అగస్ట్ నెల వాహిని ముఖచిత్రం అద్భుతంగా వుంది... అంతర్జాలంలో మన మువ్వన్నెల జండా ఎగరటం చాలా సంతోషంగా అనిపించింది... నూతనత్వానికి వాహిని ఎప్పుడూ ముందు వుంటుంది... అదే ప్రయత్నంలో గొలుసుకట్టు నవల 'నీహారిక' మొదలవటం చాలా బాగుంది... సురక్షితంగా వున్న ఆస్ట్రేలియాలో కోవిడ్ కేసులు పెరగడం కొంచెం బాధగా అనిపించింది... అందరూ క్షేమంగా వుండాలని కోరుకుంటున్నాను... 2020, 2021 సంవత్సరాలు మన జీవితంలో చీకటి నింపాయి... వెలుతురు కూడా ఆ సర్వాంతర్యామే చూపించాలి... విజయగారు సంపాదకీయంలోనే అన్నీ విశ్లేషించారు... చాలా బాగుంది...

"భగవద్గీతలో పరమార్థ దర్శనమును ఉద్దేశించి, కర్మలను ఆచరించాలి... దీని వలన బ్రతికి యున్న దేహము నందే పుణ్యపాపములను విడిచి మోక్షమును పొందెదరు"... చాలా మంచి విషయములను తెలియజేస్తున్న శ్రీ పెయ్యేటి రంగారావుగారి 'భగవద్గీత' ఎంతో ఆలోచింపచేస్తున్నది...

డా కె టి పద్మజగారి భరతమాతకు 'అక్షర తిలకం' చాలా బాగుంది... దేశభక్తి గీతాలపై ఇచ్చిన వివరణ బాగుంది... విజయగారి 'అమ్మ భాష' ఆలోచింపజేసింది... 'కరోనా కాలం' ఎలా వుందో చదువుతుంటే కనులకు కట్టినట్టుగా అనిపించింది...

కమలగారి 'నన్ను వదిలి నీవు పోలేవులే' ఆద్యంతం నవ్వులు పువ్వులై పూసింది... రచనా శైలి చాలా బాగుంది... పెయ్యేటి రంగారావుగారి 'ప్రేమ' ఊహకందకుండా సరికొత్త మలుపుతో చాలా బాగుంది... వంగూరి చిట్టెన్ రాజుగారి 'సెల్ఫీ పిచ్చి కథ' లో ఫోటోల కథ మరుగున పడిన జ్ఞాపకాలను గుర్తు చేసింది... గొలుసు కట్టు నవల 'నీహారిక' ప్రయోగాత్మకంగా బాగుంది... కొత్తదనాన్ని పాఠకులకు అందించాలనే సంపాదకుల సంకల్పానికి అభినందనలు...

శ్రీమతి పామీరు జానకీ దేవి, హైద్రాబాద్

అఖండ మైన శాంతి పోరాటాన్ని ఏళ్ళ తరబడి కొనసాగించి దాస్య ఉక్కు సంకెళ్లను త్రెంచుకొని స్వతంత్రం సిద్ధించు కొని 75 వసంతాలు నిండిన భారతావని ఆనందానికి, ప్రగతికి చిహ్నమైన మువ్వెన్నల పతాకాన్ని ముఖ చిత్రంగా చేసుకొని తెలుగు ఆడ పడుచుల పండగ మాసం శ్రావణ మాసం పేరంటాల ముత్తైదుగా,సర్వ సుందరంగా తెలుగు తనాన్ని మేళవించిన మెరుపుల పట్టు చీర ధరించి ప్రతి తెలుగు గడపలో అడుగిడింది.ఈ నెల " తెలుగు వాహిని" మాసపత్రిక.

శ్రావణ ముత్తైదును ఆనందం తో ఆహ్వానించి బుట్టెడు శెనగలు బండెడు పళ్ళు వాయనంగా ఇవ్వండి తెలుగు జాతీయతను మది నిండా నింపుకొని తెలుగు వారమని అనిపించు కోండి......విదేశీ గడ్డపై....


భారత స్వాతంత్ర పోరాటంలో పాలు పంచుకున్న ప్రముఖ నాయకుల ,కవుల ప్రస్తావనంతో మొదలయ్యింది మాస పత్రిక ప్రధ మ పుటం. గత చరిత్రను జ్ఞాకపకం చేసుకొని గర్వంగా ముందుకు కొనసాగుదాం,ప్రగతి పథంలో మేటివారమని అనిపించుకుందాం. అని డాక్టర్ పద్మజ గారు తమ వ్యాసం లో ఒక జాతీయ సందేశం అందించారు.

పసిడి తనంలో అమ్మ పొత్తిళ్ళలో వున్నప్పుడు ఉగ్గు పాలతో అమ్మ నేర్పిన పదరాజసాలు నేటి సాహిత్య సంపదకు పునాదులైనాయి. కన్న తల్లి ప్రేమావాత్సల్యం తో పెంచి పోషిస్తే ఆశ్రయించిన సాహితీ మాత అక్కున చేర్చుకొని తన బిగికౌగలిలోసాహిత్య కుసుమాల సౌరభాన్ని అఘ్రాణించే అదృష్టాన్ని కలిగించింది శ్రీమతి విజయ గారి అమ్మ భాష. చక్కగా చెప్పారు తమ మనసులోని మాటను శ్రీమతి విజయ గారు. వారి రచనా శైలి కి జోహార్లు.

జానకి దేవి గారు  తమ   స్త్రీ తన బల హీనతను ఎలా ఒక వరంగా మార్చు కుంటుందో బాగా చెప్పారు. ఇంటి వారిచే మాట పడుతున్నా బయటి వారి చే మాట పడ కూడదు అన్న  ఆదుర్ధాకి  కాలమే ఆ ఆదుర్దా ఒత్తిడికి సర్దు కొని  అందరినీ ఆలస్యంగా రప్పించింది మీటింగుకి. శ్రీ శ్రీదేవి గారి కరోనా కాలం లో ఒక మధ్య తరగతి స్త్రీ కుటుంబంలో ఎంత  వొత్తిడి కి లోనై బాధ పడ్డారో చాలా చక్కగా వివరించారు తమ అద్భుత రచనా శైలి కథానికలో. శ్రీమతి ని సరదాగా బయటకి తీసి కెళ్ళి,మతి మరుపు తో బయటే వదిలేసి వచ్చే భర్తలు వుంటారు సమాజం లో అని జాగ రూకతో భర్త చెయ్యి వదలు వద్దు బయటకివెళ్ళినప్పుడు అని భార్య మణులకు ఒక మంచి సందేశం అందించారు ...రచయిత్రి కమల గారు. చిరు కవితలు ధీటైన సాహిత్యం తో ఆలోచింప జేశాయి మనసును కట్టి వేసి. ఇక  ప్రేమకు స్థానం తో పనిలేదు యే స్థానం లో వున్నా మనో వికాసాన్ని కలిగింప చేస్తుంది అని తమ అద్భుత రచనా శైలి లో పూజ్యులు శ్రీ రంగారావు గారు తెలియ చేశారు. భార్య ప్రేమ తల్లి ప్రేమగా మారిన  అద్భుత కథా విశేషం. పాట నేర్చు కుందామ్ శీర్షికన ఈ నెల పాట ఎంపిక బాగున్నది. రాఖీ పూర్ణిమ పండగ , ఆడవారి శ్రావణ మాసం రెండిటికీ హైలైట్. మన తెలుగు వారికి 16 సంఖ్య అంటే అమిత మైన ప్రేమా గౌరవం. ఆస్ట్రేలియా తెలుగు అసోసియషన్ కమిటీ లో పదహారు మంది సభ్యులు వున్నారు.వారు అంతా తమ ప్రతిభను చాటు కుంటూ విదేశీ గడ్డలో మన తెలుగు తనం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలి అనే వారి ప్రయత్నానికి జోహార్లు, వారి అందరకీ శుభాభినందనలు.

శ్రీ పెయ్యేటి భాస్కర శర్మ, హైద్రాబాద్

❖❖❖❖❖




❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

**INDAUS IMMIGRATION**

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au

# నీహారిక
## గొలుసుకట్టు నవల

### 6

### (ఐ. ప్రసన్న లక్ష్మి)

ఒక్కసారిగా గొడుగులో ఆమె సరసన ఉన్న మూర్తి ఉలిక్కిపడ్డాడు. ఆమె చటుక్కున గొడుగునుంచి కొంచెం పక్కగా జరిగి చేతిబ్యాగ్‌లోంచి ఒక కవర్ తీసి అతనికి ఇచ్చింది. ఇంకో మాట లేకుండా అతను వెనుదిరిగి వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయాడు.

“ఎవరతను, ” అడిగాడు మూర్తి. కొంచెం ఈర్ష్య, కొంచెం కుతూహలం నిండిన గొంతుతో.

“నాతో స్నేహం కావాలి అంటే ఇంకోసారి అతని గురించి ఏ వివరమూ నన్ను అడగవద్దు. నీకు అనవసరం.”

“నిజమే, నా ఆతృత అంతా నీకేమన్నా హాని జరుగుతుందేమో నని.”

చిన్నగా, పలచగా, నీరసంగా నవ్వింది ఆమె.

అతడేమీ తన కలల రాకుమారికి అపకారం తలపెట్టడుగా అని కాసేపు ఆలోచనలో పడ్డాడు, నీహారికా! అంటూ పేరుపెట్టి పిలిచాడంటే బాగా పరిచయస్తుడై ఉంటాడు. ఈమెది అద్భుత సౌందర్యమైతే... అతడిది దర్జాను ఒలకబోసే ఐశ్వర్యం. ఎవరై ఉంటాడబ్బా! మూర్తి మనసు పరిపరి విధాలా పోతోంది. కొంపదీసి తన ఆశలకు హారతి ఇచ్చేయడు కదా! అనుకుంటూ సతమతమౌతున్నాడు.

వర్షం కాస్త నెమ్మదించింది. పిల్లతిమ్మెరకి ఆమె ముంగురులతో చెవి జుంకాలు పోటీపడి సన్నగా ఊగుతుంటే... ఏదో సడి అతడి మదిలో అల్లరి చేస్తోంది. “నీహారిక” అంటే మంచుతెర అని అర్థం. నిజమే అందంలో, ఆహార్యంలో ఆమెదెంత పారదర్శకతో కదూ! ఆమెనలా కన్నులార్పకుండా చూస్తూనే ఉన్నాడు. మనసులోని సందేహం అతడ్ని నిలువనీయడం లేదు.

పడమర దిక్కున హరివిల్లు ప్రకృతిలోని రహస్యాన్ని విడమరుస్తూండగా వింతకాంతులతో శోభిల్లుతోంది ఆమె వదనం.

ఎలా సంభాషణ ముందుకు నడపాలి అని అతను ఆలోచిస్తుంటే, ఆమె అడిగింది, “ఇంతకూ నీవు ఎవరూ?”

## 7

### (మందా మురళీకృష్ణ)

ఆమె ప్రశ్నతో పరిపరి విధాలు పోతున్న అతని ఆలోచనలకు బ్రేక్ పడింది. ఆమె వైపు దృష్టి సారించాడు.

"నా పేరు మూర్తి." గొంతు తడబడినా అతడి చూపు మాత్రం ఆరాధనగా ఆమె వైపే...

"నేను ఇక్కడే ఆంధ్రబ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాను" అంటూ ఆమె అడగనివి కూడా చెప్పుకు పోతున్నాడు.

"మరి మీ గురించి?"... ఆమె కేసి చూశాడు, ఏమంటుందా అని.

ఆమె నడుస్తున్నదల్లా ఒక్కసారిగా ఆగి, "ఇక్కడే ఈ సందులో మా ఫ్రెండ్ ఇల్లు ఉంది. ఇక నేను వెడతాను" అంది అతనివైపే చూస్తూ.

ఆ మాటలు వింటూనే మూర్తి గుండెల్లో కలుక్కుమంది. అనవసరంగా తొందరపడ్డానే అని తన్ను తానే తిట్టుకున్నాడు.

అద్భుత సౌందర్యరాశి ఇలా వర్షంలో మెరిసి మాయమవడం... అనుకుంటూ తడబాటు పడుతున్నాడు.

వెంటనే.. "పదండి నేనూ అటువైపే వెళ్లాలి..."

అలవోకగా అబద్ధం చెప్పాడు.

ఇబ్బందిగా మొహం పెడుతూ ఏంచెప్పాలా అని ఆమె తటపటాయిస్తోంది.

కనురెప్ప పడితే ఆమె ఎక్కడ మాయమౌతుందో అని అతడు ఆమెనే తదేకంగా చూస్తున్నాడు.

ఆమె అతడిని ఎలాగైనా తప్పించుకోవాలని మూర్తి వంక చూస్తూ, "ఏమీ అనుకోకండి నాకు ముఖ్యమైన పని ఉంది మరోసారి కలుద్దాం" అంటూ అటుగా వస్తున్న ఆటోను ఆపి, ఎక్కేసి "మీ గొడుగు తీసుకోండి" అంది హడావుడిగా గొడుగు ఇచ్చేసి... రైల్వేస్టేషన్ రోడ్డుకు పోనీ అని ఆటోతో చెప్పింది. ఆటో క్షణాల్లో కనుమరుగయ్యింది.

ఆ హడావుడిలో ఆమె గమనించలేదు గాని, గొడుగు అందించేటప్పుడు ఆమె ఫైల్ ఒకటి జారి కిందపడింది. ఆటో వెళుతున్న వైపే చూస్తున్న మూర్తి వర్షంలో తడిసిపోతున్న ఆ ఫైలును గభాల్నవంగి తీసి తడిని తుడుస్తూ... అప్రయత్నంగా లోపలి కాగితాల్ని చూశాడు.

అంతే... అంత వర్షంలోను ముచ్చెమటలు పట్టాయి.

పక్కకు వెళ్లి కంగారుగా ఆమె వెళ్లిన వైపే చూస్తూ ఆ కాగితాలు చూస్తుంటే... అతని ముఖంలో రంగులు మారుతున్నాయి.

## 8

## (కె.గీత)

ఆ ఫైల్ మొదటిపేజీ నిండా ఏవో అర్థంకాని అక్షరాలు, బహుశా పేర్లు అయి ఉండవచ్చు, ఏదో కోడ్‌లో, వాటి ఎదురుగా కోట్ల రూపాయలలో సంఖ్యలూ...

బహుశా ఏదో కోడ్ లాంగ్వేజ్‌లా ఉందే.. అంతు చిక్కని ప్రశ్నలా మారిపోయాయి అతని ముఖకవళికలు.. ప్రశ్నార్థకాలవుతున్నాయి.

పక్కపేజీ తిప్పబోయాడతను..

ఇంతలో సర్రున ఆటో వచ్చి ఆగింది..

అందులో నుండి ఆమె దిగి అతని చేతుల్లో నుండి ఫైల్‌ను దాదాపు లాక్కున్నట్లుగా తీసుకుంది... ఒక్క క్షణం. నిర్ఘాంతపోయాడు మూర్తి..

ఏదో అడగబోయేంతలో ఆమె పెదవులపై మనోహరమైన నవ్వు చూసి మైమరచిపోయాడు...

ఆమె చనువుగా అతని చెయ్యి పట్టుకుని లాగి అతడు ఆశ్చర్యం నుండి తేరుకోకముందే... 'నాతో పద'... అంది...

ఎక్కడికి అనే ప్రశ్న అతని నోటి నుంచి బయటకు వచ్చేలోగా ఆటో ముందు కురికింది...

పెద్ద రెస్టారెంట్ ముందరాగింది ఆటో...

ఆమె దిగింది.. మారు మాటాడకుండా ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టే ఆమెని అనుసరించాడు మూర్తి...

ఖాళీ టేబుల్ కోసం చుట్టూ చూసింది నీహారిక... జనం పలచగానే ఉన్నారు.. మధ్యలో ఖాళీ టేబుళ్లు కనిపిస్తున్నా కార్నర్ కోసమా అన్నట్టు ఆమె కళ్లు వెతుకుతున్నాయి... ఆమె కోరుకున్న టేబుల్ కంటపడింది.

అతని వైపు పదమంటూ కళ్లతోనే సైగలు చేస్తూ... వయ్యారంగా ముందుకు నడిచింది నీహారిక...

టేబుల్‌పై హేండ్ బ్యాగూ, ఫైలూ ఉంచి...'ఎక్స్‌క్యూజ్'మీ అంటూ ఆమె వాష్ రూం వైపు నడిచింది... ఫైల్ చూడగానే మూర్తికి మళ్లీ అందులోని కోడ్ లాంగ్వేజూ.. అంకెలూ గుర్తొచ్చినా.. చెప్పదలుచుకుంటే తానే చెప్తుంది... అడిగేమీ లాభంలేదనుకున్నాడో ఏమో మరి అడగటం మానుకున్నాడు.

ఆమె ఎదురుగా వచ్చి కూర్చుంది... ముఖంపై అదే ముగ్ధమనోహరమైన నవ్వు..

కలల రాకుమారి తనంతట తానే దిగివచ్చి తనలోకానికి తీసుకెళ్లిందా అన్నట్టుగా మత్తులో కూరుకుపోయాడు మూర్తి...

"నా పేరు తెలుసు. మీ పూర్తిపేరు?"

"మొదలు ఆ మీరు అన్న పదం బాన్ చేస్తున్నా. నువ్వు అను, నాకు ఇష్టం. నీకు దగ్గర అయినట్లు అనిపిస్తుంది.

"తప్పదా?"

"నూటికి నూరు పాళ్లు."

"నీ పూర్తి పేరు ఏమిటి మూర్తిగారు..."

"నీ అన్నాక గారు వస్తుందా"

"చెప్పమ్మా మూర్తీ, సతాయించకు" అంతే... ఆ పిలుపుకి మూర్తి క్లీన్‌బౌల్డ్.

తేరుకుని చెప్పాడు. "నీరజాక్ష్ మూర్తి"

"నిజం గానా"

"అబద్ధం ఎందుకు దీనికి"

"ఎలా కలిసినయో, నీ "సీ" నా "సీ" చిత్రంగా"

"మనలాగే"

"సరే నీ గురించి చెప్పు"

ఇందాక అడిగిన విషయం, ఆమె పారిపోయినది, అడిగి ఆమెను తను దూరం చేసుకున్న విషయం, అన్నీ మరచిపోయాడు మానవుడు.

"ఏముందీ, నాదేమన్నా రాణీ రుద్రమదేవి చరిత్రా!

అమ్మా నాన్నా ఆక్సిడెంట్లో పోయారు. ఎవరు లేరు. చిన్న ఉద్యోగం చేసుకుంటున్నా.. ఇందాక కారులో వచ్చినతను మా బాస్. ఈ ఫైల్ కూడా ఆఫీస్‌ది. ఇంతే సంగతులు. చిత్తగించగలరు." మళ్లీ అడగకుండా, అతని మనస్సులో యే సందేహమూ మిగలకుండా అవకాశం ఉపయోగించుకుంది.

ఇంతలో ఆమె సెల్‌కు ఫోన్ వచ్చింది.

"ఎక్స్‌క్యూజ్‌మి, ఆఫీసు నుంచి. ఆ నిర్మలా.. లేదు కొంచెం బిజీ."

"....."

"బాయ్‌ఫ్రెండ్‌తో."

"......"

"పార్టీనా, ఆగు! పప్పన్నం పెడతాను ఏమో.."


మూర్తి మనసు ఎక్కడికి వెళ్లిందో, ఎగిరి వెళ్లి ఊహల్లో తేలివచ్చింది.

"......"

"లేదురా.. విజయా రెస్టారెంట్‌లో.. కిటికీ దగ్గర టేబుల్. ఆ, అదే ట్రాఫిక్ మూలంగా... వినిపించటం లేదు.. ఉంటా బై."

మూర్తి ఏడో స్వర్గం నుంచి దిగివచ్చే లోపు ఆ ఫైల్, టేబుల్ అడుగు భాగానికి అతుక్కుపోయింది, అడ్‌హేసివ్ టేపు ప్రతిభ వల్ల.

❖❖❖❖❖


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: దేవుళ్ళు

సంగీతం వందేమాతరం శ్రీనివాస్

గీతరచయిత: జొన్నవిత్తుల

నేపధ్య గానం:  ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

**వక్రతుండ మహాకాయ**

**కోటి సూర్య సమప్రభ**

**నిర్విఘ్నం కురుమే దేవ**

**సర్వకార్యేషు సర్వదా**

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

బాహుదా నదీ తీరములోన బావిలోన వెలసిన దేవా

మహిలో జనులకు మహిమలు చాటి ఇహపరములనిడు మహానుభావా

ఇష్టమైనది వదిలిన నీకడ ఇష్టకామ్యములు తీర్చే గణపతి

కరుణను కురియుచు వరముల నొసగుచు నిరతము పెరిగే మహాకృతి

సకల చరాచర ప్రపంచమే సన్నుతి చేసే విఘ్నపతి

నీ గుడిలో చేసే సత్య ప్రమాణం

ధర్మదేవతకు నిలుపును ప్రాణం

విజయ కారణం విఘ్ననాశనం కాణిపాకమున నీ దర్శనం

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

పిండి బొమ్మపై ప్రతిభ చూపి బ్రహ్మాండ నాయకుడివైనావు

మాతాపితలకు ప్రదక్షిణముతో మహాగణపతిగ మారావు

భక్తుల మొరలాలించి బ్రోచుటకు గజముఖ గణపతివైనావు

బ్రహ్మాండమునే బొజ్జలో దాచి లంబోదరుడవు అయినావు

లాభము శుభము కీర్తిని గూర్చగ లక్ష్మీగణపతివైనావు

వేద పురాణములఖిలశాస్త్రములు కళలూ చాటును నీ వైభవం

వక్రతుండమే ఓంకారమని విభుదులు చేసే నీ కీర్తనం

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

జయ జయ శుభకర వినాయక శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక

https://www.youtube.com/watch?v=gjklOFzBPT4

గానగాంధర్వునికి ప్రధమ వర్ధంతి నివాళి -సెప్టెంబర్ 25

❖❖❖❖❖

# శిధిల నగరం – 6

(నెవిల్ షూట్ నవల "Ruined city" కి అనువాదం)

అనువాద కర్త: జి.వి.సోమనాధ శాస్త్రి (సోమసుధ), హైద్రాబాద్

(ఆఫీసులో వచ్చిన కడుపునొప్పితో వారన్ దృష్టి వ్యాయామం మీదకు మళ్ళింది. కారు ప్రయాణంలో తాను నిద్రమాత్ర లేకుండా నిద్రపోగలడన్న తలంపుతో ఆ రాత్రి దూర ప్రయాణానికి సిద్ధమవుతాడు. వాన కురిసే రాత్రిలో టైరు చప్పుళ్ళతో వారన్ మత్తుగా నిద్రపోతాడు. మధ్యలో పెట్రోలు పోయించుకొనేటప్పుడు గ్రాంథేం దగ్గర ఒకసారి మెలకువ వస్తుంది. తెల్లవారేసరికి డొనాగ్ అతన్ని టైన్ లోయకు చేరుస్తాడు. వారన్ కోరికపై గ్రీన్ హెడ్ ప్రాంతానికి చేరాక డొనాగ్ కారుని రోడ్డు పక్కకు ఆపుతాడు. తరువాత. . . .)

@@@@@

"ఇది చాలు" బిగ్గరగా అన్నాడతను. వెనక్కి తిరిగి కారుని సమీపించాడు.

"నన్నిక్కడ వదిలేయి" డొనాగ్ తో చెప్పాడతను. "కొంతదూరం నడుస్తాను. కార్లైల్ చేరుకొని అక్కడ ఉంటాను. ఇంక నీ అవసరం లేదు. దారిలో ఎక్కడైనా కాసేపు నిద్రపోయి లండన్ కి వెళ్ళిపో!"

"మంచిదయ్యా!" డ్రైవర్ సందేహిస్తూ అన్నాడు. "మీకేమన్నా తెచ్చి పెట్టమంటారా, టిఫినూ అదీ. ?"

"ఫరవాలేదు. ధన్యవాదాలు. . . ఒక్క నిమిషం! నీ దగ్గరున్న పటాన్ని యిస్తావా?"

డొనాగ్ తన దగ్గరున్న పటాలన్నీ అతనికి చూపించాడు. ఆర్డ్నన్స్ సర్వే వారు ముద్రించిన రెండు పటాలను ఎన్నుకొని, వాటిని తన పొడుగు చేతుల చొక్కా జేబులో కుక్కుకున్నాడు.

"ఇవి పనిచేస్తాయి" వారన్ చెప్పాడు. "ఇక నువ్వెళ్ళొచ్చు. ఒక వారంలో లండనుకి తిరిగి వస్తానని ఇవాన్స్ కు చెప్పు."

డ్రైవరుకి మనసులో బాధ అనిపించింది. అయ్యగారిని మంచి పరిస్థితుల్లో విడిచేవరకు తనతోనే ఉండాలని అతనికి అనిపించింది. కానీ ఆ విషయంలో అతనికి ఆ అవకాశాన్ని వారన్ ఇవ్వలేదు. అయ్యగారి కోరికపై ఆయన్ని నడిరోడ్డు మీద, నిర్మానుష్యమైన ప్రాంతంలో విడిచి వెళ్ళవలసి వచ్చింది.

"మంచిదయ్యా!" అని చెప్పి, లిమొజిన్ని స్టార్ట్ చేసి కొండ పల్లంలోకి దిగి కార్లైల్ వైపు కారుని పోనిచ్చాడు.

దారిలో ఫలహారం తింటూండగా అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఉత్తరం వైపు బాటలో రమారమి నలభై అయిదు మైళ్ళ వేగంతో లిమోజిన్ని పరుగెత్తిస్తే, సులభంగా మూడు వందల మైళ్ళని ఆరు ముప్పావు గంటల్లో అధిగమించి లండన్ చేరుకోగలడు. లండన్ నగరంలో ప్రయాణాన్ని కలుపుకొంటే ఏడు గంటలు వేసుకోవచ్చు.

అతని చేతి గడియారం ఎనిమిదిన్నర చూపిస్తోంది. అంటే మూడున్నరకల్లా తను అయ్యగారి యింటికి చేరుకొంటాడు. అక్కడ తన కోసం ఎదురుచూసే ప్రేయసికి చెప్పిన సమయం కన్నా గంట ఆలశ్యమవుతుంది. కానీ ఆమెతో గడపటానికి సగం రోజు కన్నా పైనే మిగిలి ఉంటుంది. తను యిక్కడ నీరసించి ఆగిపోతే, ఆమెతో ఆనందంగా గడపటం సాధ్యం కాదు. సాధారణంగా తన కోసం అలా కష్టపడేవాణ్ణే ఏ ఆడపిల్లయినా యిష్టపడుతుంది.

హోటల్లో బిల్లు చెల్లించి అతను లండను రోడ్డు పట్టుకొన్నాడు. కొన్ని గంటల తరువాత, మధ్యాహ్న సమయానికి కొంచెం ముందుగా, పదకొండు గంటల వేళ, అతను రెట్ఫడ్ కి మూడు మైళ్ళ దగ్గరలోకి వచ్చాడు. ఇంతలో ఒక చిన్న కారు పక్క బాటలోంచి రహదారికి మళ్ళుతూ అకస్మాత్తుగా అతని కారుకి ఎదురు వచ్చింది. గంటకు ఎనభై మైళ్ళ వేగంతో తన పైకి దూసుకొస్తున్న ఆ కారును తప్పించుకోవటానికి, డొనాగ్ కంగారులో ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లిమొజిన్ ఆ చిన్నకారు ఒక పక్క అంచుని తాకటంతో, అది ఎగిరి దూరంగా ఉన్న పొదలో పడింది. అదే ఊపులో లిమొజిన్ అకస్మాత్తుగా రోడ్డుకి అడ్డంగా కుడివైపుకి తిరిగిపోయి, పట్టణంలోంచి వస్తున్న అయిదు టన్నుల లారీని గుద్దుకొంది.

బిలబిలమంటూ పోగైన జనం లిమొజిన్ శిధిలాలను తొలగించి చూడగా, రోడ్డు మీద విగతజీవుడై పడి ఉన్న డొనాగ్ కనిపించాడు.

ఎల్సీ మధ్యాహ్నమంతా లండన్ లోని వారన్ యింట్లో తన ప్రియుడి రాక కోసం ఆశగా ఎదురుచూస్తూ కూర్చుంది. బహుశా ఆమె నిరీక్షణ యింకా కొనసాగవచ్చు.

@@@@@@@@@@

వారన్ కి ఆకలేస్తోంది. కారు వెళ్ళిపోయాక, రోడ్డుకి పల్లంలో కనిపిస్తున్న రైల్వేస్టేషనుకి వెళ్ళాడు. అక్కడ ఒక కూలివాడు దీపాలను శుభ్రం చేస్తూ కనిపించాడు. ఆ స్టేషన్లో అతను తప్ప మరెవరూ లేరు. వారన్ అతని వద్దకెళ్ళి తినటానికి ఎక్కడ దొరుకుతుందని అడిగాడు. అతను అక్కడికి అరమైలు దూరంలో ఉన్న పాకలో భోజనం దొరుకుతుందని, అక్కడకు వెళ్ళే గుర్తులను చెప్పాడు.

వారన్ రోడ్డు మీదకొచ్చి ఆ దిక్కుగా నడవసాగాడు. అతను నడుస్తూ చేతితో తన మాసిన గెడ్డాన్ని నిమురుకొన్నాడు. గెడ్డం గీసుకోవటానికి తన దగ్గర రేజర్ లేదు. ఆ ప్రాంతంలో కొందామంటే అసాధ్యమనిపిస్తోంది. పళ్ళు తోముకొనే అవకాశం కూడా లేదు. అతను ఆలోచనల్లో ఉండగానే పాకను చేరుకొన్నాడు.

వాతరోగంతో నడుము వంగిన యువతి తలుపులు తీసి పాకలోంచి బయటకొచ్చింది. టిఫిను దొరుకుతుందేమోనని వారన్ అడిగాడు.

"కావల్నంటే రెండు గుడ్లు, కప్పు టీ సేసిత్తా. ఈడ ఈ రుతువులో బేకరీ బెరెడ్డు దొరకదు. మేమేటి తింటామో నువ్వు అదే తినాల మరి."

ఆమె టిఫిన్ తయారు చేయటానికి వంటింట్లోకి వెళ్ళింది. అతను అక్కడ కనిపించిన బల్లపై కూర్చుని చొక్కాజేబులోంచి పటాన్ని తీసి చదవసాగాడు. తనకు వ్యాయామం అవసరమనుకొంటే ఈశాన్యదిక్కుగా వెళ్ళటం మంచిదనిపించింది. అక్కడనుంచి బెల్లింగ్ హాం వెళ్ళే దారంతా బీడైన భూములతో నిండి ఉంటుంది. తన దగ్గరున్న పటాలను బట్టి ఒకటి, రెండు వారాలపాటు తనకు మంచి వ్యాయామం యివ్వగల ప్రాంతం అదొక్కటే!

రెండు వేపిన గుడ్లు, యింట్లో తయారుచేసిన గోధుమ వర్ణపు రొట్టెముక్క, కొద్దిగా వెన్న, జాం, మట్టి ముంతలో చిక్కని టీ తెచ్చిపెట్టిందామె. అతను ఆత్రుతగా వాటిని తిని ఆకలి చల్లార్చుకొన్నాడు. రెండవ గుడ్డు తిన్నాక కప్పుల కొద్దీ టీని తాగి తృప్తిగా త్రేంచాడు.

సిగార్ పైపు వెలిగించాక, ఆమెకు తను తిన్న దానికి ఒక షెల్లింగ్ చెల్లించాడు. పటాన్ని చూసినప్పుడు తనకు మధ్యాహ్న భోజనానికి దారిలో ఎక్కడా రెస్టారెంట్లు ఉన్నట్లు కనపడలేదు. అందుకని దారిలో ఆకలి వేస్తే తినటానికి రెండు పెన్నీలిచ్చి మాడిపోయిన రొట్టెముక్కను కొన్నాడు. దాన్ని రెండు ముక్కలుగా విరక్కొట్టి తన చొక్కాకున్న రెండు జేబుల్లో కుక్కుకున్నాడు. తరువాత ఆ పాక నుంచి బయటకొచ్చి బీడు భూములవైపు తరలిపోయాడు.

రాత్రి వర్షానికి బాగా తడిసిన ఆ నల్లని బీడు భూముల్లో పెద్ద పెద్ద అంగలేస్తూ ఆ రోజంతా నడిచాడతను. చల్లని గాలి వణికిస్తుంటే చెవులను కప్పేలా చొక్కాను తలపైకి లాక్కున్నాడు.

రోజంతా విరామం లేకుండా సన్నని పొగమంచుతో కూడిన తుంపర పడుతూనే ఉంది. అడవి పొదలతో నిండిన బాటలో వేగంగా నడవటం వలన అతని పాదాలకు గాయాలయ్యాయి. ఇంత నడిచినా ఆకలి వేయకపోవటం అతన్ని ఆశ్చర్యపరిచింది. అయినా మధ్యాహ్న సమయంలో రొట్టె ముక్కలను బయటకు తీసి కొద్దిగా కొరుక్కున్నాడు. అలా తినగా మిగిలిన రొట్టెముక్కలు, పొడి రాలుతూ అతని చొక్కా జేబుల్లో పడి ఉన్నాయి.

ఎనిమిది గంటలపాటు నడిచి అతను బెల్లింగ్ హాం చేరుకొనే సమయానికి సాయంత్రం అయిద్దైంది. ఆఖరి మైలు నడుస్తున్న సమయానికి కొద్దిగా చీకటి పడింది. శారీరకంగా బాగా అలసిపోయాడతను. కానీ ఆ అలసట అతని మనసును తేలికపరిచింది. అతనికి మంచి మంచం దొరికితే ఆ రాత్రికి సహజసిద్ధమైన నిద్ర పడుతుందని అనిపిస్తోంది. అంతేగాక అతని బుర్రలో ఒత్తిడి సడలినట్లు కూడా అనిపించింది. చివరికి ఆ గ్రామంలో అతనొక సత్రాన్ని చేరుకొన్నాడు.

చేతిలో మూటాముల్లె లేకుండా, తడిసిన శరీరం, మాసిన గడ్డంతో అసహ్యంగా కనిపిస్తున్న అతన్ని సత్రం జనాలు అనుమానంగా చూసారు.

"ఆయ్!" సత్రం యజమాని చెప్పాడు. "మంచాలున్నాయి. కానీ ఈడ ఉండాలంటే కొంచెం డబ్బెక్కువ పెట్టాల. మూటాముల్లె లేకుండా వచ్చినందుకు పది షిల్లింగులు డిపాజిట్టు కట్టాల!"

"సహేతుకంగానే ఉంది" అంటూ వారన్ పర్సులోంచి డబ్బు తీసి అతనికిచ్చాడు. అతని పర్సు చూసిన వెంటనే సత్రం యజమాని మర్యాదగా మాట్లాడటం మొదలెట్టాడు.

'మేము జాగర్తగా ఉండాలయ్యా! లేకుంటే అనుమానిచ్చేటోళ్ళ చేతిలో పడాల్సి ఉంటది. పుట్టాక నేనెప్పుడూ చూళ్ళే! ఈ ఏడు శానామంది కుర్రోళ్ళు రోడ్డున పడ్డారు" తన ప్రవర్తనకు క్షమాపణ చెబుతున్న ధోరణిలో అక్కడ పరిస్థితిని వివరించాడు.

"ఉద్యోగాల్లేకనా?" వారన్ అడిగాడు.

"ఆయ్! పన్లేక రోడ్లమ్మట తిరుగుతున్నారు. దచ్చినాన బాగా పని దొరుకుద్దని సెప్తున్నారు. కానీ నాకు తెలవదు. ఇదే మీ గది. మీకు ఓ నిమిసంలో యేన్నీళ్ళు తెచ్చిత్తాను."

వారన్ స్నానమయ్యాక కిందకెళ్ళాడు. గుడ్లు, మాంసాహారం, మిఠాయి, చెర్రీపళ్ళతో చేసిన కేక్ తీసుకొన్నాడు. అక్కడ నుంచి కాఫీ సెక్షనుకెళ్ళి బల్లపై పడి ఉన్న వార్తాపత్రికలను చూసాడు. అవన్నీ పశు, వాహన సంబంధమైన విషయాలను కలిగి ఉండటంతో

చదవ బుద్ధి కాలేదు. అక్కడ సత్రం యజమాని తన స్నేహితులతో పరాచికాలాడుతున్నాడు. వారన్ వానలో రోజంతా తడిసిన తన చొక్కా, కోటులను వంటశాలలో మంట వెచ్చదనానికి ఆరబెట్టమని యిచ్చి, తన గదికి తిరిగొచ్చాడు.

సమయం ఏడున్నర అవుతోంది. ఎప్పుడో యుద్ధంలో పడుకొన్నట్లు లోదుస్తులతోనే మంచమెక్కాడు. ఒక్కసారి గతం గుర్తుకొచ్చింది.

సుమారు అయిదు గంటలపాటు గాఢంగా నిద్రపోయి, అర్ధరాత్రి కొద్దిగా నీరు తాగి మళ్ళీ మంచమెక్కాడు. ఉదయం వరకూ అతనికి ఒళ్ళు తెలియని నిద్ర పట్టింది. తెల్లవారి నిద్రలేచే సమయానికి అతని ఆరబెట్టిన బట్టలు గది తలుపు దగ్గర పడి ఉన్నాయి. వాటిని ధరించి అద్దం ముందు నిలబడ్డాడతను.

కోటు కొద్దిగా కుచించుకొని పోయి కనిపించింది. చొక్కాలో మునుపటి మెరుపు తగ్గింది. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసి వారన్ నవ్వుకొన్నాడు. దుస్తుల్లో వచ్చిన మార్పుని అతను లెక్కచేయలేదు సరి కదా సంతోషించాడు. నిన్నటి కన్నా ఈ రోజు కొంచెం కొత్తగా కనిపిస్తున్నాడు. కొన్ని నెలల తరువాత ఈ రోజు తేలికైన మనసుతో ఫలహారానికి కిందకెళ్ళాడు.

వాతావరణం కొంచెం చల్లగా ఉన్నా ఆహ్లాదకరంగా ఉంది. సత్రానికి సొమ్ము చెల్లించి తిరిగి రోడ్డు మీదకొచ్చాడు. తిరిగి ఈశాన్య దిక్కుగా బీడుభూముల్లో నడకను ప్రారంభించాడు. నల్ల కొండల్లో ఉన్న కుగ్రామాలను, రహదారులను దాటుకొంటూ వెడుతున్నాడు.

అప్పుడప్పుడు నీటిమబ్బుల చాటునుంచి సూర్యుడు ఆ బంజరు ప్రాంతాన్ని పలకరిస్తూ, పందాలేసుకొన్నట్లు పరుగు తీసే మబ్బుల మధ్యలో మాయమవుతున్నాడు.

వారన్ ఆ రోజంతా ఆగకుండా నడుస్తూనే ఉన్నాడు. అతనికి ఒంట్లో నలతగా అనిపించింది. ఏదో తెలియని నీరసం వ్యాయామంపై అతనికున్న ఉత్సాహాన్ని చంపేస్తోంది. దారిలో ఎక్కడా తిండి దొరక్క జేబులోని రొట్టెముక్కనే కొద్దిగా కొరుక్కొన్నాడు. అసలు ఏదన్నా తినాలన్న కోరిక కూడా అతనికి కలగటం లేదు. సూర్యాస్తమయ వేళకు అతనొక కొండపైకి చేరుకొన్నాడు.

ఆకాశం మబ్బుల్లేక నిర్మలంగా ఉంది. దూరంగా తూర్పు దిక్కున, సుమారు పది, పదిహేను మైళ్ళ దూరంలో తెల్లని రంగులో మెరిసే సముద్రపు తీరం కనిపిస్తోంది.

అతను కొండ మీద నుంచి లోయలోకి దిగటం ప్రారంభించాడు. దూరంగా యిళ్ళ నుంచి వచ్చే పొగ పచ్చని చెట్లతో ముచ్చట్లాడుతోంది. దారిలో కనిపించిన గేటు దాటి ప్రధాన రహదారి మీదకు రాగానే ఉన్నపాటున వారన్ కుప్పకూలిపోయాడు. వెంటనే రెండు రోజుల క్రితం ఆఫీసులో వచ్చినట్లు, ఎవరో పొడుస్తున్నట్లు విపరీతమైన నొప్పి వచ్చి, మెలికలు తిరిగాడు. రోడ్డు పక్కన గడ్డిలో పడుకొని ఊపిరందక అల్లాడిపోయాడు. కొంతసేపటికి నొప్పి తీవ్రత తగ్గి మందకొడిగా అనిపిస్తోంది.

"భగవంతుడా! ఇప్పటికి తట్టుకోగల్గాను" అంటూ తనలో గొణుక్కొన్నాడు. "మరెప్పుడూ నాకిలాంటి అవస్థ రాకుండా చూడు స్వామీ!"

కొంతసేపయ్యాక గడ్డిలో నుంచి లేచి నడుచుకొంటూ అరమైలు దూరంలో ఉన్న గ్రామానికి చేరుకొన్నాడు. అక్కడ ఒక సత్రంలో గది అద్దెకు తీసుకొన్నాడు. టీ తాగాక కోలుకొన్నట్లు అనిపించింది. కాస్త ఉపశమనం కోసం దగ్గరలో ఉన్న సినిమా హాలుకి వెళ్ళాడు.

ఆ రాత్రి బట్టలిప్పేసి జాగ్రత్తగా పొట్టను నొక్కి లోపల ఎముక ఏదైనా విరిగిందేమోనని పరీక్షించుకొన్నాడు. కానీ చివరికి అది కండరాల సంబంధమైన బాధగా నిర్ధారించుకొన్నాడు. కొంతసేపు మంచంపై కూర్చుని జేబులోనుంచి పటాలను తీసుకొని, మినుకు మినుకుమనే కొవ్వొత్తి వెలుగులో పరిశీలించాడు. కొన్నేళ్ళుగా అసలు వ్యాయామం జోలికే పోని తాను, ఒక్కసారిగా యింత కష్టపడటం కూడా మంచిది కాదనిపించింది. మరునాడు అతను కొండ లెక్కకూడదని తీర్మానించుకొన్నాడు.

సముద్రతీరం దగ్గరలోనే ఉంది. మెల్లిగా సముద్రతీరం చేరుకొని, తీరం వెంబడి ఉత్తరదిక్కుగా వెడితే మంచిదనిపించింది. ఆ మరునాడు వాయువ్య మూలగా ఉన్న కొండలను ఎక్కవచ్చు. అంతేగాక మధ్యలో కొన్ని పట్టణాలు ఉన్నాయి. అక్కడ రేజరు కొనుక్కోవచ్చు, లేదా ఎక్కడన్నా గడ్డం గీయించుకోవచ్చు.

అతను ఆదమరిచి నిద్రపోయాడు. లండను నగరం, అతని యిల్లు, యిన్నాళ్ళుగా అతన్ని బాధించిన సమస్యలు తన మస్తిష్కంలో మరుగున పడిపోయాయి. చాలా నెలల తరువాత తొలిసారిగా ప్రశాంతమైన మనసుతో అతను విశ్రాంతి తీసుకొంటున్నాడు. ప్రస్తుతం తన జీవితంలో ఉన్న శారీరక బాధలు తప్ప మరేమీ అతన్ని అంటిపెట్టుకొని లేవు.

మరునాడు ఉదయానికి వాతావరణం తేమగానూ, వణికించేటంత చల్లగాను ఉంది. వారన్ సత్రంలో బిల్లు చెల్లించి తూర్పు దిక్కుగా తన పాదయాత్రను ప్రారంభించాడు. వీచే గాలి, వాన ముసురు అతని ప్రయాణానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. కొండ మీద నుంచి దిగువనున్న పంటపొలాల వైపు వెళ్ళే బాటలో అతను నడిచి పోతున్నాడు.

గత కొద్దిరోజులుగా అతను జరిపిన బీడుభూముల్లో పాదయాత్రకు యిది భిన్నమైనది. అతను కాంక్రీటు రోడ్డు మీదే సులభంగా నడవగలుగుతున్నా, ఏదో తెలియని అలసట అతన్ని కమ్మేసింది. ఉన్నట్లుండి గత రాత్రి కండరాలనొప్పి వచ్చిన ప్రాంతంలోనే, మెల్లిగా నొప్పి మొదలై తీవ్రమవుతోంది. వెంటనే తన నడక వేగాన్ని తగ్గించాడతను. ఆ కండరాలనొప్పి మీద అతనిలో అనేక సందేహాలు మొదలయ్యాయి. మిట్టమధ్యాహ్నానికి అతని సందేహాలు కేవలం సందేహాలు మాత్రమే కాదని తేలిపోయింది.

వారన్ సముద్ర తీరానికి అయిదుమైళ్ళ దూరంలో ఉన్నాడు. అలసటగా అనిపించి, చౌరస్తాలో కొన్ని నిమిషాలు రోడ్డు పక్క కనిపించిన మైలురాయి మీద కూర్చుని, సిగరెట్టు వెలిగించాడు.

అకస్మాత్తుగా నొప్పి చుట్టూ విస్తరించి దేనితోనో పొడుస్తున్నట్లుగా తీవ్రమైపోయింది. అతను బాధతో పొట్టను ఒక చేత్తో పట్టుకొని, నేల మీద గడ్డిపై మరో అరచేతిని ఆనించి ముందుకు బాగా వంగాడు. అతని నోట్లోని సిగరెట్టు జారిపడి తన పక్కన గడ్డి కాలటం మొదలెట్టింది.

"దేవుడా!" పాలిపోయిన అతని పెదాలు అస్పష్టంగా గొణిగాయి. "ఈ నొప్పి నిమిషంలో తగ్గిపోవాలి."

కానీ నొప్పి తగ్గటంలేదు. అది మరింత అధ్వాన్నంగా మారి, పొట్టలో మరింత కిందకు పాకి సలిపేస్తోంది. అది కేవలం కండరాలనొప్పి కాదని అతనికి అర్ధమైంది. పావుగంటసేపు రోడ్డు పక్కన గడ్డిలో నిస్సత్తువగా అలాగే పడి ఉన్నాడు.

(సశేషం)

❖❖❖❖❖


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au